
రైజ్ కళాశాల వద్ద మళ్లించిన ట్రాఫిక్

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం మరికొద్దిసేపట్లో తేలనుంది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 11 గంటలకే ఏపార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయో వెల్లడికానుంది. ఒకట్రెండు నియోజకవర్గాలు మినహా మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రధాన పార్టీల అభ్యర్థులలో ఎవరు విజయం వైపు దూసుకుపోతున్నది, ఎవరు వెనుకబడింది అన్న అంశంపై కూడా స్పష్టత రానుంది. గతనెల 13న పోలింగ్ జరగ్గా ఓట్ల లెక్కింపు మంగళవారం చేపడుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ఏజెంట్లతో అధికార యంత్రాంగం సోమవారం మాక్ కౌంటింగ్ నిర్వహించింది. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పూర్తిస్థాయి లెక్కింపునకు సిద్ధమైంది.

తేలనున్న భవితవ్యం


కురిచేడులో కవాతు చేస్తున్న పోలీసులు


రైజ్ కాలేజీలోని ఓ కేంద్రంలో కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

- నేడు కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- భారీ బెట్టింగ్‌లతో అభ్యర్థుల విజయాలపై పెరిగిన ఆసక్తి
- ఒంగోలు ఫలితంపై మరింత ఉత్కంఠ
- స్థానాలు మారిన మంత్రులకు గట్టిపోటీ
- దర్శి నియోజకవర్గంపై అందరి దృష్టి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల తోపాటు, లోక్‌సభ అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఒంగోలులో మంగళవారం జరుగ నుంది. అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ బాపట్లలోను, కందుకూరు ఓట్ల లెక్కిం పు నెల్లూరులోనూ ఉంటుంది. దూరప్రాంత నియో జకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్లు ఓట్ల లెక్కింపు జరిగే పట్టణాలకు ఇప్పటికే చేరిపోయారు. వారి రాకతో లాడ్జిలు, హోటళ్లు కిట కిటలాడుతున్నాయి.

భారీ బెట్టింగ్‌ల మధ్య..

రాష్ట్రస్థాయిలో టీడీపీ కూటమికి అనుకూలంగా బెట్టింగ్‌లు ఎక్కువ సాగాయి. జిల్లా స్థాయిలో ఈ పర్యాయం ఏ పార్టీకి మెజారిటీ స్థానాలు వస్తాయన్న అంశంపైనే పందేలు జరిగాయి. అద్దంకి, పర్చూరులో టీడీపీ అభ్యర్థులకు వచ్చే ఆధిక్యంపైనే ఎక్కువ బెట్టింగ్‌లు నడిచాయి. మిగిలిన స్థానాల్లో జయాపజయాలపై పందేలు సాగాయి. దర్శి, చీరాల, మార్కాపురం, కందుకూరు నియోజకవర్గాల్లోనే అసెంబ్లీ అభ్యర్థుల గెలుపోటములపై ఎక్కువ బెట్టింగ్ జరిగింది. ఎగ్జిట్ పోల్స్ వెల్లడైన అనంతరం ఆరా సంస్థ అంచనాలకు అనుగుణంగా వైసీపీకి మద్దతుగా బెట్టింగ్‌లు కొంత పుంజుకున్నాయి. అయితే సోమవారం ఉదయం నుంచి అవి తగ్గి తిరిగి టీడీపీ కూటమి విజయానికి అనుకూలమైన పందేలు పెరిగాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కనిగిరి, దర్శిలలో...

కనిగిరిలో 2009లో గెలుపొందిన డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రస్తుతం కూటమి అభ్యర్థిగా రెండోసారి విజయాన్ని అందుకునే దిశగా కనిపిస్తున్నారు. ఆయనపై పోటీ చేసిన వైసీపీ అభ్యర్థి నారాయణ యాదవ్ తొలిసారి అవకాశం కోసం ఆశపడుతున్నారు. వైసీపీలో మరో కీలక నాయకుడైన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శిలో అనూహ్యంగా గట్టి పోటీని ఎదుర్కొన్నారు. తొలిసారి రంగంలోకి వచ్చిన కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నిరకాలుగా దూసుకుపోయారు. దీంతో లక్ష్మిదే విజయం అని కూడా సర్వేలు సూచించడంతో దర్శి ఫలితంపై ఆసక్తి పెరిగింది.

పశ్చిమంలోనూ గట్టి ఫైట్

అధికార వైసీపీకి కంచుకోటలాంటి మార్కాపురం డివిజన్‌లో అభ్యర్థుల మార్పు ద్వారా విజయాన్ని సాధించాలని జగన్ పన్నిన వ్యూహం ఎంతమేరకు ఫలిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. గిద్దలూరు, మార్కాపురం నుంచి కూటమి అభ్యర్థులు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి విజయంపై నమ్మకంతో ఉండగా.. వైసీపీ అభ్యర్థులు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు అదే ధీమాతో ఉన్నారు. ఎర్రగొండపాలెంలో తొలిసారి ఎన్నికల బరిలో దిగిన ఎరిక్షన్‌బాబు, చంద్రశేఖర్‌లు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ మూడింటిలో వైసీపీ ఒకటి గెలుస్తుందా? లేక రెండోది కూడా గెలుస్తుందా? అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

చీరాలపై పలు ఊహాగానాలు...

త్రిముఖ పోటీ మధ్య చీరాలలో టీడీపీ కూటమి అభ్యర్థి విజయానికి అవకాశాలు మెరుగుపడ్డాయని ఒక అంచనా. అయితే ఎమ్మెల్యే కరణం బలరాం కుమారుడు వెంకటేష్ విజయావకాశాలపై వైసీపీ నాయకులు పూర్తి ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ విజయం ద్వారా రాష్ట్రంలో రెండు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతోందని, ఆ పార్టీ ప్రకటించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీ అభ్యర్థి కొండయ్య బలహీనవర్గాలకు చెందిన నాయకుడు కావడం కూడా ఆపార్టీకి కలిసివచ్చింది.

గొట్టిపాటి, ఏలూరి విజయం లాంఛనమే

అద్దంకి, పర్చూరుల్లో కూటమి అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివ రావుల విజయం లాంఛనమేనని అందరూ భావిస్తున్నారు. ఈ పర్యాయం గెలిస్తే రవికుమార్ వరుసగా ఐదుసార్లు విజయం సాధించిన శాసనసభ్యులుగా గుర్తింపు పొందుతారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు కూడా లేకపోలేదు. గత ఎన్నికల్లో పర్చూరులో సంచలన విజయం సాధించిన కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఈసారి విజయం సాధించడం ద్వారా హ్యాట్రిక్ సొంతం చేసుకోబోతున్నారు.

దామచర్ల వర్సెస్ బాలినేని...

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్, వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య పోటీని ప్రజానీకం ప్రతిష్ఠాత్మకంగా పరిగణించింది. బాలినేని గత ఎన్నికల్లో 5వసారి గెలుపొందారు. 2012లో తొలిసారి ఓడిపోయిన జనార్దన్ 2014లో గెలుపొంది, గత ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. రెండోసారి గెలుపొందేందుకు తహతహలాడుతున్నారు. కీలకంగా భావించిన ఈ నియోజకవర్గంలో గెలుపుపై ఇద్దరు అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. కానీ దామచర్ల జనార్దన్ వైపే మొగ్గు కనిపిస్తోంది. జనార్దన్ గెలిచి టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీ, పాలనాపరంగా ఆయనకు మంచి గుర్తింపు లభించే అవకాశం ఉంది.

ఇద్దరు మంత్రులకు అగ్ని పరీక్షే...

అధినేత ఆదేశాలతో నియోజకవర్గాలు మారి పోటీ చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్ కొండపిలో, మరో మంత్రి నాగార్జున సంతనూతలపాడులో కూటమి నుంచి గట్టిపోటీ ఎదుర్కొన్నారు. కొండపిలో సురేష్‌పై పోటీ చేసిన కూటమి అభ్యర్థి స్వామికి గెలిస్తే మంచి ప్రాధాన్యం లభించనుంది. అలాగే ఇటు పార్టీలోనూ, అటు నియోజకవర్గంలోనూ అన్నీ తానై వ్యవహరిస్తున్న టీడీపీ నాయకుడు దామచర్ల సత్యకు అధిష్ఠానం మంచి అవకాశం కల్పించనుంది.

సిబ్బందికి డ్రై రన్

- తుది ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుపై అధికారులు, సిబ్బందికి కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం డ్రై రన్‌ను నిర్వహించారు. ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు తర్వాత పార్టీల వారీగా ఏవిధంగా నమోదు చేయాలి, ఎలా కంప్యూటరీకరించాలి తదితర అంశాలను వివరించారు. ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం జరగనున్న ఓట్ల లెక్కింపు తుది ఏర్పాట్లను ఆయన నియోజకవర్గాల అబ్జర్వర్లతో కలిసి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలతోపాటు ప్రధాన ద్వారం నుంచి సిబ్బంది లోపలికి పంపే సమయంలో పోలీసుల చెకింగ్‌ను పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపు కేంద్రాలను నియోజకవర్గాల వారీగా సందర్శించి పలు సూచనలు చేశారు. మరోవైపు అబ్జర్వర్లు కూడా ఏర్పాట్లను పరిశీలించి ఆర్వోలకు పలు సూచనలు చేశారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- మొత్తం 15.87లక్షల ఓట్లు పోల్
- ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒంగోలు పార్లమెంట్ స్థానం
- రైజ్ కాలేజీ వద్ద భారీ బందోబస్తు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 3 : జిల్లాలో హోరాహోరీగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బ్యాలెట్ ఓట్లు, తదనంతరం ఈవీఎం ఓట్ల లెక్కింపును చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు ఒంగోలు పార్లమెంట్ స్థానానికి వేర్వేరుగా ఈ లెక్కింపు జరగనుంది. అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు కోసం మంగళవారం ఉదయం 6 గంటలకు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని నియమించనున్నారు. వీరితోపాటు ఓట్ల లెక్కింపు కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక పరిశీలకుడిని నియమించారు. జిల్లాలో మొత్తం 18,22,470 ఓట్లు ఉండగా గతనెల 13న జరిగిన పోలింగ్‌లో 15,87,681మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లావ్యాప్తంగా 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాల వారీగా లెక్కింపునకు చర్యలు తీసుకున్నారు. రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు ఉంటుంది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 140మంది పోటీలో ఉండగా ఒంగోలు పార్లమెంట్ స్థానానికి 25మంది అభ్యర్థులు ఉన్నారు. ఇతర పార్టీలు రంగంలో ఉన్నా టీడీపీ కూటమి, వైసీపీ మధ్యనే నువ్వానేనా అన్నట్లు పోటీ ఉండటంతో ఓట్ల లెక్కింపుపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. మరో వైపు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కూడా మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. అందుకు అనుగుణంగా టేబుళ్లను కూడా ఏర్పాటు చేశారు.

నియోజకవర్గాల వారీ పోస్టల్ బ్యాలెట్ల వివరాలు ఇవీ..

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
ఒంగోలు	4,638	4,577
సంతనూతలపాడు	1,967	1,905
కొండపి	1,864	1,794
దర్శి	1,860	1,837
యర్రగొండపాలెం	1,708	1,549
మార్కాపురం	3,041	2,764
కనిగిరి	2,755	2,480
గిద్దలూరు	3,751	3,550

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఉన్న ఓట్లు, పోలైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం పేరు	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
యర్రగొండపాలెం	265	2,07,214	1,85,242
దర్శి	282	2,26,370	2,05,993
గిద్దలూరు	284	2,39,710	2,03,136
కనిగిరి	297	2,40,079	2,04,912
సంతనూతలపాడు	256	2,14,638	1,87,712
మార్కాపురం	257	2,14,608	1,87,952
ఒంగోలు	259	2,40,242	2,03,143
కొండపి	283	2,39,609	2,11,350
మొత్తం	2,183	18,22,470	15,87,681


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సర్వీసు ఓట్లను బ్యాలెట్ బాక్సులో వేస్తున్న అధికారులు

రైజ్ కాలేజీకి సర్వీసు ఓట్లు

- జిల్లాకు చేరిన 3,495 తరలింపు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 3 : కేంద్ర సర్వీసుల్లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి సంబంధించి 3,495 సర్వీసు ఓట్లు జిల్లాకు చేరాయి. గత పక్షం రోజుల నుంచి వీటన్నింటినీ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రత్యేక బాక్సుల్లో పెట్టి ఓట్ల లెక్కింపు జరగనున్న రైజ్ ఇంజనీరింగ్ కళాశాలకు సోమవారం ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఓటింగ్ ఒంగోలు పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 6,693 సర్వీసు ఓట్లు ఉండగా సోమవారం నాటికి 3,495 వచ్చాయన్నారు. మంగళవారం ఉదయం 8గంటలలోపు వచ్చే సర్వీసు ఓట్లన్నింటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. వాటిని కూడా కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హెడ్ పోస్టుమాస్టర్ రాజేశ్వరి, డివిజనల్ పోస్ట్ ఆఫీస్ ఏఎస్‌పీ మధుసూదన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి కట్టి.. ధరలు దిగజార్చి!

- భారీగా పడిపోయిన పొగాకు ధరలు
- ఒక్కరోజులోనే కిలోకు రూ.28 తగ్గుదల
- వ్యాపారుల తీరుపై పలు కేంద్రాల్లో రైతుల నిరసన
- ఆగి సాగిన వేలం
- నేడు కొనుగోళ్లకు సెలవు

ఒంగోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాది పొగాకు మార్కెట్లో ధరలు పతనమయ్యాయి. ఒక్కరోజులోనే కిలో గరిష్ఠ ధర ఏకంగా రూ.28 మేర తగ్గిపోయింది. శనివారం మార్కెట్లో గరిష్ఠ ధర కిలో రూ.360 పలుకగా సోమవారం అది రూ.332కు దిగజారింది. పొగాకు వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందన్న పరిస్థితి మరోసారి రుజువైంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి పొగాకు ధరలు పెరుగుతూనే ఉన్న విషయం విదితమే. గతనెల రెండో పక్షంలో పైపైకి చేరాయి. ఈ క్రమంలో ఈనెల 1న మార్కెట్లో రికార్డు స్థాయి ధరలు లభించాయి. పొగాకు బోర్డు చరిత్రలో ఆల్‌టైం రికార్డ్‌గా ఒంగోలు-1 కేంద్రంలో గరిష్ఠ ధర కిలో రూ.360 లభించింది. ఇతర కేంద్రాల్లోనూ రూ.350పైనే ఉన్నాయి. అంతేకాక


కొండపి వేలం కేంద్రంలో కొనసాగుతున్న పొగాకు కొనుగోళ్లు

మేలురకం బేళ్ల కోసం వ్యాపారులు పోటీ పడ్డారు. అయితే ఒక్కరోజు వ్యవధిలోనే సోమవారం నాటికి ఆ ధరలు గణనీయంగా తగ్గిపోయాయి.

ధరలు తగ్గించాలని వ్యాపారుల నిర్ణయం

దక్షిణాదిలో ఇస్తున్న ధరలు తమకు ఎందుకు ఇవ్వరని ఉత్తరాది ప్రాంత రైతులు నుంచి వస్తున్న ఒత్తిడితోపాటు, దక్షిణాదిలో ఇలాగే ధరలు పెరుగుతూపోతే భవిష్యత్‌లో మార్కెట్ ఏస్థాయికి వెళ్తుందోనని ఆందోళన చెందిన వ్యాపారులు తగ్గించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఆదివారం గుంటూరులో భారత పొగాకు వ్యాపారుల సంఘం (ఐటీఏ) ప్రతినిధులు సమావేశమై చర్చించుకొని అంతిమంగా ధరలు తగ్గించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఆ ప్రభావం సోమవారం దక్షిణాది పొగాకు మార్కెట్‌పై కనిపించింది. గరిష్ఠ ధరలను కిలో రూ.330కే పరిమితం చేయాలని భావించిన వ్యాపారులు ఆ ప్రకారమే సోమవారం వేలం ఆరంభం నుంచే వ్యవహరించారు. దీంతో అంతకు ముందు పోటీపడి ధరలు పెంచి కొనుగోలు చేసిన డీలర్లు, మధ్యస్థాయి వ్యాపారుల కొనుగోళ్లు తగ్గిపోయాయి. అదేసమయంలో ప్రధాన కంపెనీలు అయిన ఐటీసీ. జీపీఐతోపాటు పలువురు ఎగుమతిదారులు గతం కన్నా ఎక్కువ బేళ్లను కొనుగోలు చేశారు. తద్వారా మార్కెట్లో వ్యాపారులు సిండికేట్ అయి కొంటున్న తీరు స్పష్టంగా అర్థమవుతోందని రైతు ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరగడం పొగాకు మార్కెట్లో సర్వసాధారణం. అలాగే నిన్న మొన్నటివరకూ ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు కూటమి కట్టి ఒక్కసారిగా తగ్గించి వేశారని రైతులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో వేలం కేంద్రాలను నిలిపివేస్తున్నారు. బుధవారం మార్కెట్‌లో భవిష్యత్ ధరలపై స్పష్టత రానుంది.

ఉపశమనం

- పలకరించిన తొలకరి
- పలు ప్రాంతాల్లో జల్లులు
- తగ్గిన ఉష్ణోగ్రతలు, చల్లబడిన వాతావరణం
- పంటల సాగుకు సానుకూలం

ఒంగోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. తీవ్రమైన ఎండలు, అంతకు మించి ఉక్కపోతతో అల్లాడిన ప్రజానీకానికి ఎట్టకేలకు ఉపశమనం లభించింది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షమే కురిసింది. రాష్ట్రంలోకి మూడు రోజుల ముందే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతోపాటు దక్షిణ కోస్తా ప్రాంతంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనంతో తొలకరి జల్లులు పడ్డాయి. దీంతో మూడు నెలలుగా ఎండల తీవ్రతతో తల్లడిల్లుడుతున్న ప్రజానీకానికి ఊరటతోపాటు తొలకరి సాగుకు కూడా సానుకూల పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాలలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున జల్లులు పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

11.40మి.మీ సగటు వర్షపాతం

జిల్లాలో సోమవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో సగటున 11.40 మి.మీ వర్షపాతం నమోదైంది. పశ్చిమప్రాంతంలో ఒక మోస్తరు నుంచి భారీవర్షమే పడింది. త్రిపురాంతకం మండలంలో గరిష్ఠంగా 75.6మి.మీ వర్షం కురిసింది. పుల్లలచెరువు మండలంలో 60.0, కురిచేడులో 46.4, కంభంలో 36.8, తర్లుపాడులో 31.2, బేస్తవారపేటలో 29.4, మార్కాపురంలో 24.0, పెద్దారవీడులో 18.6, దోర్నాలలో 12.8, గిద్దలూరులో 12.8, హెచ్‌ఎంపాడులో 12.2, నాగులుప్పలపాడులో 11.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇతర మండలాల్లో జల్లులు పడ్డాయి. తాజా జల్లులతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. మరో రెండు, మూడు రోజులు వాతావరణం ఇలాగే చల్లబడి ఉండటంతోపాటు జల్లులు పడే అవకాశం కనిపిస్తోంది.

తొలకరి సాగుకు ఉపయుక్తం

తాజా వర్షాలు తొలకరి సాగుకు ఉపకరించనున్నాయి. గత నెల మూడో వారంలో ఒక మోస్తరు జల్లులు జిల్లాలో పడగా తొలకరి పంటల సాగు కోసం పలుప్రాంతాల రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. అలాంటి ప్రాంతాల్లో ప్రస్తుతం విత్తనాలు వేసే అవకాశం ఉంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు లక్షా 76వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. అందులో తొలకరి పంటలుగా పిలిచే నువ్వు, పెసర, సజ్జ వంటి మూడు నెలల పంటలు అలాగే పశుగ్రాస పంటలతోపాటు పిల్లిపెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు పైర్లను తక్షణం సాగు చేసే అవకాశం కనిపిస్తోంది.


ఒంగోలులో సోమవారం కమ్ముకున్న దట్టమైన మేఘాలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 2 : ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోనేందుకు సన్నద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశానికి జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ చట్టం వచ్చాక గ్రామీణ ప్రాంత కష్టజీవులకు ఆసరాగా ఉందన్నారు. అటువంటి పథకాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నారని, ఈ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. పేదల చేతుల్లో ఉన్న భూములను కూడా పెత్తందారులు, రాజకీయ నాయకులు అక్రమంగా అడ్డగోలుగా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. పేదలకు అనుకూలంగా ఉన్న చట్టాలను, హక్కులను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు జాలా అంజయ్య కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురాం తదితరులు ఉన్నారు.



పోస్టల్ బ్యాలెట్‌పెట్టెలను బస్సు వద్దకు తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

పోస్టల్ బ్యాలెట్లు కౌంటింగ్ కేంద్రానికి తరలింపు

కొండపి, జూన్ 3 : కొండపి నియోజకవర్గంలో పోలైన 2,236 పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించిన బాక్సులను ఎన్నికల అధికారులు రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి సోమవారం తరలించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలోని పోస్టల్ బ్యాలెట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌కు వేసిన తాళాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.కుమార్, పోస్టల్ బ్యాలెట్ల నోడల్ అధికారి సుధాకర్‌రావు, కొండపి సీఐ పాండురంగారావు, ఎస్సై కృష్ణబాజీబాబు, పోలీసు సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తొలగించారు. అనంతరం బాక్సులను బస్సులోకి ఎక్కించారు. వాటిని బందోబస్తు మధ్య కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్లారు. మొత్తం కార్యక్రమాన్ని వీడియో తీయించారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

సింగరాయకొండ, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై టి.శ్రీరామ్ హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈనెల 5 తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఫలితాలు వెల్లడించిన అనంతరం బాణసంచా కాల్చడం, ర్యాలీల నిర్వహణకు అనుమతిలేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు

ఒంగోలు(విద్య), జూన్ 3 : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 12 నుంచి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. సోమవారం పర్యావరణహితంపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు, పాఠశాలల పునః ప్రారంభమయ్యే ఈనెల 12నుంచి విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. 12న నీటి ఆదాపై, 13న శక్తిని ఆదా చేయడం, 14న శుభ్రతను కాపాడటం, 15న వ్యర్థాలను తగ్గించడంపై, 18న స్థిరమైన ఆహార వ్యవస్థపై. 19న ఆరోగ్యకర జీవన శైలిని అడాప్ట్ చేయడంపై అవగాహన కల్పించాలి. 5న జిల్లా స్థాయి ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో విద్యుత్ ఎస్ఈ సత్యనారాయణ, డీఎల్‌పీవో పద్మ, జిల్లా సైన్స్ అధికారి రమేష్, ఈఈ రాఘవరెడ్డి, ఏఈఈ వై. భాస్కర్ వర్మ, ఉప విద్యాధికారి రోజారాణి, సమగ్ర శిక్ష సీఏవో బీవీ శ్రీనివాసరావు, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమారి తదితరులు ఉన్నారు.



సైకిల్ ర్యాలీ చేస్తున్న సంస్థ సభ్యులు

సైకిల్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

ఒంగోలు(కల్చరల్), జూన్ 3:సైకిల్‌ను ఉపయోగించటం వల్ల వాహన కాలుష్యం తగ్గి పర్యావరణం పరిరక్షింపబడుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. సోమవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సంస్థ సభ్యులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకే కాకుండా మంచి వ్యాయామంగా కూడా సైకిల్ వాడకం ఉపయోగపడుతుందని అన్నారు. సైకిల్ వాడండి - పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో ర్యాలీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ర్యాలీలో సంస్థ కోశాధికారి బీరం అరుణ, శక్తి సదన్ నిర్వాహకులు కే.శాంతిలత, సి.హెచ్.కనకదుర్గ, వంటేరు మలాన్, సుభాషిణి, జీలకర్ర, అఖిల తదితరులు పాల్గొన్నారు.

కర్ఫ్యూ వాతావరణం..!

144 సెక్షన్ అమలుతో షాపులు, పార్కులు మూత

గ్రామీణ ప్రాంతాలతోపాటు, పలు ప్రాంతాల ఆర్టీసీ బస్సులు రద్దు

పోలీసుల ఆంక్షలతో వ్యాపారం బంద్

వీధులన్నీ నిర్మానుష్యం

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 3 : ఎన్నికల ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. మరి కొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. దీంతో అటు అధికార యంత్రాంగం, ఇటు పోలీసులు ఆంక్షలు కఠినతరం చేశారు. ఇప్పటికే మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయగా, అందుకు అనుగుణంగా మూడు రోజులపాటు మద్యం దుకాణాలు, రెస్టారెంట్‌లు, బార్‌లు, మద్యం మాల్స్ మూత వేశారు. ఇదిలా ఉంచితే ఆర్టీసీ బస్సులను సైతం రద్దు చేశారు. ప్రత్యేకించి, గ్రామీణ ప్రాంతాలకు పూర్తిగా పల్లెవెలుగు బస్సులను రద్దు చేయగా, దూర ప్రాంతాల ట్రిప్పులను 30 శాతం రద్దు చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఓట్ల లెక్కింపు క్రమంలో ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అంతటా 144 సెక్షన్ విధించారు. ముఖ్యంగా ఒంగోలు పార్లమెంట్ పరిధిలో పార్లమెంట్‌తో పాటు, అన్నీ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తుండగా, అన్నీ నియోజకవర్గాల నుంచి ఆయా రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. దీంతో ఇప్పటికే హోటల్స్, లాడ్జిలు, పలు గెస్ట్ హౌస్‌లు ఆయా రాజకీయ పార్టీల శ్రేణులతో నిండిపోయాయి. అయితే మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా జరిగే ఘటనలపై పోలీసు యంత్రాంగం పూర్తిగా దృష్టి సారించింది. ముందుగానే నగరంలో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. అలాగే సోమవారం మధ్యాహ్నం నుంచి టీ దుకాణాల నుంచి మెగా షాపింగ్ మాల్స్ వరకు, అలాగే, వివిధ వ్యాపార సంస్థలన్నీ మూసివేశారు. అలాగే అత్యవసర సేవలకు సంబంధించి మెడికల్, పెట్రోలు బంకులు మినహా మిగతా వ్యాపార సంస్థలన్నీ బంద్ అయ్యాయి. ఇదిలా ఉంచితే పార్కులను సైతం మూసి వేయడంతో కర్ఫ్యూ వాతావారణం నెలకొంది. కాగా నేడు వెలువడే ఫలితాలపై అంతటా ఉత్కంఠ నెలకొంది.



మూతవేసిన నగరంలోని దేవుడుచెరువు పార్కు



నగరంలోకి ప్రవేశించే రహదారిలో పోలీసుల విస్తృత తనిఖీలు



వాహనాల నియంత్రణ, చెకింగ్ కోసం ఏర్పాటు చేసిన కేంద్రం



నగరంలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు

ఒంగోలు సబ్ డివిజన్‌లో 144 సెక్షన్

ఒంగోలు(క్రైం), జూన్3: ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్నీ పోలీసు స్టేషన్ పరిధిలో ఇప్పటికే 30 పోలీసు చట్టం అమలులో ఉందని , కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ విధించినట్లు ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. అదే విధంగా కౌంటింగ్ జరిగే మంగళవారం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారని అన్నారు. సోమవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వ్యాపార సంస్థలు, దుకాణాలు మూసివేయాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం నిషేధించినట్లు తెలిపారు.



144 సెక్షన్‌తో జన సంచారం లేని నగరంలోని గాంధీ రోడ్డు

అత్యసరానికి పోలీసు నంబర్లు

కౌంటింగ్ రోజు ఏదైనా సంఘటనలు జరిగితే అత్యవసరంగా ఈ కింది నంబర్లకు ఫోన్ చేయాలని పోలీసులు కోరుతున్నారు. డీఎస్పీ 9121104796, ఎస్సై 9000694409, పబ్లిక్ హెల్ప్‌లైన్ 9121102266, డయిల్ 100,112, 912110242 నంబర్లుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

నేడు ఓట్ల లెక్కింపు

టీడీపీ విజయం సాధిస్తుందని ఎగ్జిట్‌పోల్స్ అంచనా

కొండపి, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ టీడీపీకి అనుకూలంగా చెప్పినప్పటికీ గెలుపుపై ఇరుపార్టీల వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి 1,203 ఓట్ల మెజారిటీతో ఇక్కడ విజయం సాధించారు. అయితే అప్పట్లో కౌంటింగ్ ఫలితం నువ్వా? నేనా? అన్నవిధంగా సాగడంతో ఉత్కంఠను రేకెత్తించింది. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి కొండపి మండలంలో 2,233 ఓట్లు, జరుగుమల్లి మండలంలో 1,382, టంగుటూరు మండలంలో 2,201 ఓట్లు కలిపి 5,816 ఓట్ల మెజారిటీ వచ్చింది. వైసీపీ అభ్యర్థి మాదాసి వెంకయ్యకు మర్రిపూడి మండలంలో 527ఓట్లు, పొన్నలూరు మండలంలో 73, సింగరాయకొండ మండలంలో 4,082 ఓట్లు కలిపి 4,682 ఓట్ల ఆధిక్యత లభించింది. ఆ ప్రకారం టీడీపీ అభ్యర్థి స్వామికి గత ఎన్నికల్లో 1,134 ఓట్ల మెజారిటీ లభించగా, పోస్టల్ ఓట్లలోనూ ఆయనకు 69 ఆధిక్యత వచ్చింది. దీంతో స్వామి 1,203 ఓట్లతో విజయం సాధించారు.

ఇప్పుడు కూడానా?

ఈ దఫా కొండపి ఫలితంపై కొన్ని సర్వే సంస్థలు పోటీ తీవ్రంగా జరిగిందని, స్వల్ప మెజారిటీతో టీడీపీ అభ్యర్థి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విజయం సాధిస్తారని అంచనా వేశాయి. దీంతో ఇక్కడి ఫలితంపై సర్వత్రా చర్చ ప్రారంభమైంది. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీకి మెజారిటీ వచ్చిన మండలాల్లో ఈదఫా తిరిగి భారీ ఆధిక్యత లభిస్తుందని ఆపార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. గడచిన ఎన్నికల్లో వైసీపీకి మెజారిటీ అందించిన మండలాల్లో నేడు ఆపరిస్థితి లేదని, ఒక మండలం మినహా మిగతా రెండు టీడీపీకే అనుకూలంగా ఉన్నాయని తెలుగు తమ్ముళ్లు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకులు మాత్రం గడచిన ఎన్నికల్లో టీడీపీకి మెజారిటీ వచ్చిన మండలాల్లో ఈసారి భారీగా తగ్గిపోతున్నదని, తమకు భారీ మెజారిటీ వచ్చిన మండలంతోపాటు, మిగతా రెండు మండలాల్లో కూడా ఈసారి పెరుగుతున్నదని అంచనా వేస్తున్నారు. మొత్తంగా కొండపి ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

144వ సెక్షన్ అమలు

సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కొండపి సర్కిల్ పరిధిలోని కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ పాండురంగారావు తెలిపారు. రెండు రోజులపాటు ఎక్కడా ప్రజలు గుమికూడవద్దని, బాణసంచా కాల్చవద్దన్నారు. విజయోత్సవాల పేరిట రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాలో పార్టీల నాయకులు, కార్యకర్తలు రెచ్చగొట్టుకునే పోస్టులు పెట్టడం నిషేధమన్నారు. దుకాణాలను కూడా నిర్వాహకులు మూసివేయాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రామకృష్ణయ్యకు బీఎన్ నివాళి

నాగులుప్పలపాడు, జూన్ 3: దశదినకర్మలో మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. కొత్తకోట గ్రామంలో సోమవారం జరిగిన ముంద్ర రామకృష్ణయ్య పెద్దకర్మలో పాల్గొన్న సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ పాల్గొని రామకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల సెక్రటరీ కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఆంజనేయులు, కాకర్ల విజయ్, శేఖర్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నేతను పరామర్శించిన విజయ్‌కుమార్

మద్దిపాడు: నందిపాడు తెలుగుదేశం పార్టీ నాయకుడు రావి మారుతీరావకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా సంతనూతలపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బి.ఎన్.విజయ్‌కుమార్ సోమవారం మారుతీరావు గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీసి, అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విజయ్‌కుమార్ వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అడకా స్వాములు, మన్నే శేషయ్య, కోదూరి లక్ష్మీనారాయణ, క్రొత్రపాటి మాధవరావు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముంద్ర రామకృష్ణయ్య దశదిన కర్మలో పాల్గొన్న బీఎన్, నేతలు

అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీ పట్టివేత

- స్వాధీనం చేసుకున్న డంప్‌ల నుంచీ ఎత్తుకెళ్తున్న కొందరు
- అధికారులు వెళ్లడంతో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌లతో పరారు



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీ

జరుగుమల్లి (కొండపి), జూన్ 3 : జరుగుమల్లి మండలం చతుకుపాడు గ్రామానికి సమీపంలోని పాలేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సోమవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాన్ని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. చతుకుపాడు- కామేపల్లి గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు వెంట పొలాల్లో తోలిన ఇసుక డంప్‌లను మైనింగ్‌శాఖ జిల్లా అధికారులు గతంలో స్వాధీనం చేసుకున్నారు. అయితే వీటి వద్ద ఎటువంటి కాపలా లేకపోవడంతో ఇక్కడి నుంచి కూడా ఆదివారం రాత్రి ఎక్స్‌కవేటర్ సాయంతో అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకెళ్తున్నారు. ఆదివారం రాత్రి రెవెన్యూ అధికారులు డంప్‌ల వద్దకు వెళ్లడంతో వారిని చూసి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను తీసుకొని పొలాల్లో నుంచి తప్పించుకొని వెళ్లిపోయారని సమాచారం. దీనిపై కూడా పోలీసులకు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఓపెన్ స్కూలు పరీక్షకు 47 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), జూన్ 3 : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ సప్లిమెంటరీ పరీక్షలకు సోమవారం 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 448 మంది హాజరు కావాల్సి ఉండగా 401 మంది హాజరయ్యారు. పదవ తరగతి హిందీ పరీక్షకు 8మందికి గాను ఆరుగురు హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ఇంటర్ బయాలజి సబ్జెక్టుకు 223 మంది హాజరు కావాల్సి ఉండగా 193 మంది, ఇంటర్ కామర్స్ పరీక్షకు 448 మంది హాజరు కావాల్సి ఉండగా 401 మంది హాజరయ్యారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు, విద్యాశాఖ డైరెక్టర్ ఎ. సుబ్బారెడ్డి సోమవారం ఒంగోలులోని మూడు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే శివకుమార్; ఓపెన్ స్కూలు సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరెడ్డిలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

6నుంచి టెన్త్ మూల్యాంకనం

పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 6నుంచి స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. గణితం మినహా మిగిలిన సబ్జెక్టుల జవాబు పత్రాలు ఇక్కడికి మూల్యాంకానికి వచ్చాయన్నారు. గణితం జవాబు పత్రాలు డిజిటల్ ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారని తెలిపారు. ఇతర సబ్జెక్టులకు సంబంధించి సుమారు 10వేల జవాబు పత్రాలు ఇక్కడికి మూల్యాంకనానికి వచ్చాయని పేర్కొన్నారు. మూల్యాంకనానికి 20 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 150 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 40 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. మూల్యాంకనం ఈనెల 9తో ముగుస్తుందని సుభద్ర తెలిపారు.

12 నాటికి నాడు-నేడు పనులు పూర్తికి ఆదేశం

ఒంగోలు(విద్య), జూన్ 3 : వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అంటే ఈనెల 12 నాటికి పాఠశాలల్లో నాడు-నేడు కింద మంజూరు చేసిన పనులన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యా మౌలిక వసతుల కమిషనర్ కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు తరగతి గదులకు శ్లాబులు పూర్తి చేస్తే తర్వాత తలుపులు, కిటికీలు పెట్టుకోవచ్చన్నారు. పాఠశాలల్లో నిర్మాణాల కట్టుబడుల వల్ల వచ్చే చెత్త, చెదారం, ఇతర నిర్మాణ సామగ్రిని పాఠశాలలోని నిర్మాణ స్థలాల నుంచి తొలగించి దూరంగా వేసి పాఠశాలల్లో ప్రమాదాలను నివారించాలని సూచించారు.

సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా వచ్చిన మెటీరియల్‌ను పాఠశాలల పునఃప్రారంభ నాటికి పనిచేసే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు నాడు- నేడు పనులు పూర్తి చేసి పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి మౌలిక వసతులు కల్పించాలని కాటంనేని భాస్కర్ ఆదేశించారు.



టంగుటూరులో కొనసాగుతున్న పొగాకు వేలం

పొగాకు వ్యాపారుల సిండికేట్

- భారీగా పడిపోయిన ధరలు
- ఒక్కరోజులో కిలోకు రూ.15 తగ్గింపు

టంగుటూరు, జూన్ 3 : పొగాకు వేలంలో వ్యాపారులంతా సిండికేట్ అయ్యారు. ధరలను భారీగా దిగజార్చారు. టంగుటూరు వేలం కేంద్రంలో ఒక్క రోజు వ్యవధిలోనే మేలురకం కిలో రూ.15 తగ్గించారు. శనివారం గరిష్ఠ ధర కిలో రూ.347 లభించగా సోమవారం రూ.332 వద్దనే ఆగిపోయింది. శనివారం మార్కెట్ ధరలను చూసిన రైతులు ఆనందించారు. సోమవారానికి ఇది రూ.350 దాటుతుందని ఆశించారు. తీరా వేలం కేంద్రంలోకి వెళ్లిన తర్వాత ధరలను చూసి డీలాపడ్డారు. ఈ ఏడాది మార్కెట్‌లో ఇప్పటి వరకూ లభిస్తున్న ధరలను చూసి రైతులు వచ్చే సీజన్‌కు పొగాకు సాగుకు ఇప్పటి నుంచే భూముల కౌలు, బ్యారెన్‌లు అద్దెకు ఒప్పందాలు చేసుకోవడం ప్రారంభించారు. ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో ఎకరా కౌలు రూ.35 వేల నుంచి 40 వేలకు చేరింది. బ్యారన్‌ల లీజు కూడా పెరిగింది. కొందరు కొత్త బ్యారన్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అనూహ్యంగా సోమవారం వేలంలో ధరలు తగ్గాయి. దీంతో రైతులు ఆలోచనలో పడ్డారు. టంగుటూరు వేలం కేంద్రానికి సోమవారం ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం రైతులకు చెందిన 1,017 బేళ్లను అనుమతించారు. వాటిలో 965 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205 దక్కింది.

కొండపిలో కిలోకు రూ.19 పతనం

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో మేలురకం పొగాకు ధర భారీగా పడిపోయింది. సోమవారం కిలోకు రూ.19 తగ్గింది. శనివారం ఎఫ్-1 రకం పొగాకు కిలో రూ.350 పలకగా, సోమవారం రూ.331 వద్ద ఆగిపోయింది. దీంతో వ్యాపారులంతా సిండికేట్ అయ్యారని రైతులు భావిస్తున్నారు. సోమవారం ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,117బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. వాటిలో 1,072బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు మంగళవారం కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

- మూడు నెలలకు రూ.2.15లక్షల ఆదాయం

సింగరాయకొండ, జూన్ 3 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. గత మూడు నెలలకు రూ.2,15,224 ఆదాయం సమకూరింది. అనంతరం ఈనెల 16వ తేదీ నుంచి 26 వరకూ జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో టెంకాయలు అమ్ముకోవడానికి వేలంపాటను నిర్వహించారు. రూ.1.55 లక్షలకు పేరం సుబ్బరామిరెడ్డి టెంకాయలు అమ్ముకునే హక్కును దక్కించుకున్నారు. కూల్‌డ్రింక్స్ ఐస్‌క్రీమ్ అమ్ముకోవడానికి నిర్వహించిన వేలం పాటలో ఎవ్వరూ పాల్గొనలేదు. దీంతో తాత్కాలికంగా దానిని నిలిపివేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవో పి.కృష్ణవేణి, ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కళాకారులు

అలరించిన సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్), జూన్ 3: వాసవి మెలోడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. స్థానిక సీవీఎన్ రీడింగ్‌రూము ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాయనీగాయకులు అప్పిశెట్టి రత్తయ్య అశోక్, పబ్బిశెట్టి రంగనాథ్, డి.శివప్రసాద్, బాలాజీ, స్వర్ణలత, శైలజ, డి.భవానీ తదితరులు పాత, కొత్త చిత్రాలలోని పలు గీతాలను రసరమ్యంగా ఆలపించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. గుర్రం కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించగా రవికుమార్ బృందం వాద్య సహకారాన్ని అందజేశారు.



మహేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన గొట్టిపాటి

అద్దంకి, జూన్ 3 : మండలంలోని గోపాలపురం మాజీ సర్పంచ్ యర్రా మహేష్ కిడ్నీ మార్పిడి చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం మహేష్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. టీడీపీ నేతలు కరి పరమేష్, యర్రా రాఘయ్య, శ్రీనివాసరావు ఆయన వెంట ఉన్నారు.

కౌంటింగ్ వద్ద అప్రమత్తంగా ఉండాలి

● ఏజెంట్లకు దామచర్ల సూచన

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 3 : ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి ఏజెంట్‌లు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి రౌండ్ కౌంటింగ్ కూలంకుషంగా పరిశీలించాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ సూచించారు. సోమవారం రాత్రి స్థానిక ఆస్టోనా హోటల్‌లో ఏజెంట్‌లతో దామచర్ల సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు టీడీపీ కూటమికి ఓట్లు వేశారన్నారు. గెలుపు దిశగా వెళుతున్న కూటమిపై ఓర్వలేక వైసీపీ శ్రేణులు అల్లర్లు సృష్టించి, కౌంటింగ్ కేంద్రంలో గందరగోళం చేసే అవకాశం ఉందన్నారు. పార్టీ ఏజెంట్‌లు సమన్వయంతో వ్యవహరించి, కౌంటింగ్ సమయంలో అవకతవకలు జరగకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈదర మోహన్, యోగయ్య యాదవ్, టీడీపీ నాయకులు, కార్పొరేటర్ చెన్నుపాటి వేణు, వై. శశికాంత్ భూషణ్‌తోపాటు, కౌంటింగ్ ఏజెంట్‌లు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామచర్ల



స్వర్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారీగా చేరిన వర్షపు నీరు

పాఠశాలలోకి వర్షపు నీరు

స్వర్ణ(పర్చూరు), జూన్ 3 : ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోకి భారీగా నీరు చేరింది. గ్రామంలోని ప్రధాన కాలనీలోకి నీరు చేరడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతోపాటు గాలి దుమారం కూడా తోడు కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీటితో కలసి మురుగు నీరు రోడ్డుపై చేరడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

బిల్లుల మోత.. అప్రకటిత విద్యుత్ కోత..!

- రాత్రింబవళ్లు ఇష్టారీతిగా కరెంట్ కట్
- గతంలో మునిసిపాలిటీ నిధుల నుంచి ముందస్తుగా రూ.9కోట్లు అప్పగింత
- అయినా తప్పని సమస్య
- పల్లెలను పట్టించుకునే నాథుడే లేరు
- అవస్థలు పడుతున్న ప్రజలు



చీరాలటౌన్, జూన్ 3 : విద్యుత్ బిల్లులు మోత మోగిస్తూనే, అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ విద్యుత్ అధికారులు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒకవైపు భయానకంగా ఎండలు మండుతున్నాయి. దీంతో నివాసాలు ఉక్కపోతగా మారాయి. ఈక్రమంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు వేడి గాలులకు అల్లాడుతున్నారు. మరోవైపు కరెంట్ రిలీఫ్ పేరుతో విద్యుత్ సరఫరాలు అర్థాంతరంగా నిలిపివేస్తున్నారు. వర్షం కురుస్తుందన్నా లేక గాలి వీస్తుందన్నా అంతకంటే ముందే సరఫరా ఆపుతున్నారు. అంతేకాకుండా లైన్ క్లియరెన్స్ పనులంటూ గంటలకొద్దీ అంధకారాల్లోకి తోస్తున్నారు. నోటితో మాత్రం 24 గంటలు నిరంతర సరఫరా అంటూ, సాంకేతిక లోపాలను ఉదహరిస్తు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎడాపెడా కోతలు విధిస్తు ప్రజలను వేధిస్తున్నారు. అంతేకాకుండా పెరిగిన చార్జీలు కారణంగా ఇళ్లల్లో వాడకం తగ్గించినా విద్యుత్ బిల్లుల్లో ట్రూ అప్ చార్జీలు, ఇంధన కొనుగోలు చార్జీలు అంటూ వినియోగదారునికి అదనపు వాతలు పెడుతున్నారు. ఈనేపథ్యంలో ఇంట్లో ఫ్యాన్ తిరగక, బయట ఎండకు తట్టుకోలేక సామాన్యులు బతుకు జీవుడా అంటున్నారు. ఇదిలావుంటే గతంలో మునిసిపల్ నిధుల నుంచి అప్పటి అధికారులు, పాలకులు విద్యుత్ సమస్యలు నియంత్రించేందుకుగాను మునిసిపాలిటీ నిధుల నుంచి ముందస్తుగా రూ. 9కోట్లు నిధులు విద్యుత్ అధికారులకు అప్పగించారు. వీటిపై అధికారులు కూడా చాలాచోట్ల విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చారు. మరమ్మతులు చేశారు. అయినా కోతలు తప్పకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలో అనేక ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు ఉన్నాయి. అయితే అప్రకటిత కోతలు కారణంగా హాస్పిటల్స్‌లో అసౌకర్యం ఏర్పడుతుంది. మరోవైపు ఎన్నికల కోడ్ ఉన్నందున పెట్రోల్ బంకుల్లో డబ్బాలలో డీజిల్ పోయడం లేదు. దీంతో హాస్పిటల్స్‌లో ఏదైనా అత్యవసర శస్త్ర చికిత్స సమయంలో విద్యుత్ అంతరాయం కలిగితే ప్రాణాపాయ పరిస్థితులు ఉన్నాయి.

చీరాల డివిజన్ పరిధిలోని పర్చూరు, చీరాల పరిధిలో అన్ని కేటగిరీలు కలుపుకుని సుమారు 1,62000 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. దీంతో రోజుకు 1 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ వాడకం జరుగుతుంది. ఎండలు మండుతున్నా ఈ మధ్య కురిసిన వర్షాలు కారణంగా వాతావరణం అప్పుడప్పుడు చల్లబడింది. ఆ సమయంలో కొన్నిసార్లు విద్యుత్ డిమాండ్ తగ్గిందనే చెప్పాలి. అయినా కూడా చీరాల పట్టణంలోని సుమారు 10 వార్డులకు పైగా, వేటపాలెం, కొత్తపేట, చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, తోటవారిపాలెం, కావూరివారి పాలెం, వాడరేవు, దేవినూతల, బుర్లవారి పాలెం, ప ర్చూరు పరిధిలో పర్చూరు, కారంచేడు, కేశవరప్పాడు వంటి ప్రాంతాలలో గం టల కొద్దీ రాత్రింబవళ్లు విద్యుత్ అప్రకటిత కోతలు విధిస్తున్నారు. ఈనేపథ్యం లో వాటిపైనే ఆధారపడి జీవించేవారి పరిస్థితి దయనీయంగా మారింది. ఈక్రమంలో చేనేత కార్మికులకు మగ్గం సాగడం లేదు. రైతులకు సాగునీరు అం దడం లేదు. అధికారులు సమస్యలు పట్టించుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బిల్లులు తగ్గేదేలే

సాధారణంగా విద్యుత్ అప్రకటిత కోతలు, అంతరాయం వలన వినియోగం తగ్గుతోంది. ఈ క్రమంలో బిల్లులు తక్కువగా రావాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. వినియోగ ధరలు కంటే అదనపు సుంకాలే మోత మోగుతున్నాయి. విద్యుత్ కొనుగోలు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ), ట్రూ అప్ పేరుతో యూనిట్‌కు అదనంగా 21 పైసల నుంచి గరిష్ఠంగా 45 పైసలు వరకు వసూలు చేస్తున్నారు. ఈవిధంగా చూసుకుంటే విద్యుత్ ఆదాయం దండిగానే ఉంది. అయినా సరఫరా మెరుగు పరచక పోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తుండమే కాకుండా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోతలు ఉండవు..సరఫరా సక్రమంగా అందిస్తాం

ఇకపై విద్యుత్ కోతలు ఉండవు. ఎక్కడా కూడా కోతలు అమలు చేయడం లేదు. వర్షాలు, గాలులు సమయంలో సాంకేతిక లోపం సహజం. వాటిని వెం టనే పరిష్కరిస్తున్నాము. వ్యవసాయ విద్యుత్ సరఫరాలకు అంతరాయాలు లేవు. ఈ మధ్య కాలంలో కొన్నిచోట్ల విద్యుత్‌కు అంతరాయం జరిగింది. ఆ సమస్యను కూడా పరిష్కరించాం. వినియోగదారులకు ఇబ్బందులు ఉండవు. కాల పరిమితి ముగిసిన సర్వీసు వైర్లతో ప్రమాదం. అలాగే తడిచిన విద్యుత్ మోటార్లకు దూరంగా ఉండాలి.

- థామస్, చీరాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

మొదలైన కౌంటింగ్ టెన్షన్

- నాడు అన్ని మండలాల్లోనూ టీడీపీకి మెజార్టీ
- అప్పటి, ఇప్పటి ఎన్నికల సరళిపై అంచనాలు



కౌంటింగ్ కోసం సిద్ధం చేసిన టేబుళ్లు

అద్దంకి, జూన్ 3 : గత సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ గాలి వీచినా అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాలలోనూ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆధిక్యతను సాధించారు. అత్యధికంగా పంగులూరు మండలంలో 3,330 ఓట్ల మెజార్టీ రాగా, అత్యల్పంగా బల్లికురవ మండలంలో 589 మెజార్టీ వచ్చింది. 2019 ఎన్నికలలో మండలాలవారీగా పరిశీలిస్తే సంతమాగులూరు మండలంలో 13 గ్రామాలలో టీడీపీకి, 7 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. సంతమాగులూరు మండలం మొత్తం పరిగణలోకి తీసుకుంటే టీడీపీకి 2611 ఓట్ల మెజార్టీ వచ్చింది. బల్లికురవ మండలంలో 13 గ్రామాలలో టీడీపీకి, 9 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. బల్లికురవ మండలం మొత్తమ్మీద టీడీపీకి 589 ఓట్లు మెజార్టీ వచ్చింది. అద్దంకి రూరల్ మండలంలో 16 గ్రామాలలో టీడీపీకి, 11 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. అద్దంకి రూరల్ మండలం మొత్తమ్మీద టీడీపీకి 2330 ఓట్లు మెజార్టీ వచ్చింది. అద్దంకి పట్టణంలో 1053 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. పంగులూరు మండలంలో 16 గ్రామాలలో టీడీపీకి, 5 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. పంగులూరు మండలం మొత్తమ్మీద 3,330 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. కొరిశపాడు మండలంలో 12 గ్రామాలలో టీడీపీకి, మూడు గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. కొరిశపాడు మండలం మొత్తమ్మీద 2788 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. పోస్టల్ ఓట్లలో కూడా టీడీపీకి మెజార్టీ వచ్చింది. నియోజకవర్గం మొత్తమ్మీద 12,747 ఓట్లు టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ మెజార్టీ సాధించారు. అ ప్పటి మండలాల మెజార్టీ ఆధారంగా ప్రస్తు తం ఆయా గ్రామాలలో జరిగిన ఓటింగ్ సరళిని బట్టి ఇరు పార్టీల నేతలు మెజార్టీలపై లె క్కలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే టీడీపీకి 12 నుంచి 15 వేల వరకు మెజార్టీపై, అన్ని మండలాలలో టీడీపీ మెజార్టీ సాధిస్తుందని బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున సాగాయి. మంగళవారం మధ్యాహ్నానికి దాదాపుగా ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉండడంతో బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్ మొదలైంది.

ఎన్నికల నిబంధనల ప్రకారం నడుచుకోవాలి

పార్టీ శ్రేణులకు సురేష్, స్వామి విజ్ఞప్తి

కొండపి, జూన్ 3 : ఎన్నికల నిబంధనల ప్రకారం నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని మంత్రి, వైసీపీ కొండపి అభ్యర్థి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈమేరకు వారు సోమవారం సోషల్ మీడియాలో తమ సందేశాలను పోస్టు చేశారు. స్వామి వీడియో ద్వారా మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలంతా గొడవలకు దూరంగా ఉండాలన్నారు. సంయమనంతో ముందుకు పోవాలని సూచించారు. పోలీసులకు సహకరించి, ఆంక్షలకు లోబడి నడుచుకోవాలని కోరారు. ఎవరైనా గొడవలకు ప్రేరేపించినా సంయమనం కోల్పోవద్దన్నారు. ఆదిమూలపు సురేష్ వీడియో సందేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కౌంటింగ్ సందర్భంగానూ, అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని కోరారు. పోలీసు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కౌంటింగ్‌కు సహకరించాలి

సంతనూతలపాడు, జూన్ 3: కౌంటింగ్‌కు టీడీపీ, జనసేననాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ సహకరించాలని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తైయ్యే వరకు ఎటువంటి గొడవలకు అస్కారం లేకుండా చూడాలని పోలీసులకు, అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.332

సంతనూతలపాడు, మే 27: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో సోమవారం ధర రూ.332లు పలికింది. అమ్మకాలకు మంగమూరు నుంచి 1,136 పొగాకు బేళ్లు రాగా 1,062 బేళ్లు అమ్ముడయ్యాయి. 74 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.332లు పలకగా, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.273.19 వచ్చినట్లు తెలిపారు. వేలంలో 23కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యోహానుకు బీఎన్ నివాళి

సంతనూతలపాడు, జూన్ 3: స్థానిక క్రిస్టియన్‌పాలెంకు చెందిన వంకాయలపాటి కోటేశ్వరరావు తండ్రి యోహాను పెదకర్మ కార్యక్రమానికి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సోమవారం హాజరై ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మద్దినేని హరిబాబు, అడకా స్వాములు, ఆర్.అంకారావు తదితరులు పాల్గొన్నారు.

సత్య కార్యాలయంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్

టంగుటూరు, జూన్ 3 : మండలంలోని తూర్పునాయుడుపాలెం సమీపంలోని ఐవోసీ ఎదురు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య కార్యాలయంలో మంగళవారం ఎన్నికల ఫలితాల వీక్షణకు 30 అడుగుల ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. అక్కడే సత్య ఎన్నికల ఫలితాలు వీక్షిస్తారు. కొండపి నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులంతా అక్కడికి వచ్చి ఎన్నికల ఫలితాలను వీక్షించాలని నిర్వాహకులు కోరారు. మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

దుకాణాలను మూసివేయించిన పోలీసులు

బల్లికురవ, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాలలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు హెచ్చరించారు. సోమవారం రాత్రి బల్లికురవ మండల కేంద్రంలో దుకాణాలను సీఐ మూసివేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు చెప్పారు.

పెన్షన్.. టెన్షన్

- చేతికందని పింఛను సొమ్ము
- బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు



పింఛన్ కోసం బ్యాంకు వద్ద వేచిఉన్న వృద్ధులు



ఒంగోలు(నగరం), జూన్3 : పింఛన్ సొమ్మును ప్రభుత్వం బ్యాంకులలో జమ చేయడంతో పెన్షన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రతినెలా 1వ తేదీన ఇంటికి వచ్చి అందించే పింఛన్ రెండు నెలలుగా చేతికి అందక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇతర లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈనెల పింఛన్ సొమ్ము 1వ తేదీనే బ్యాంకుల్లో ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసినప్పటికీ 10శాతం మందికి కూడా ఆ సొమ్ము చేతికి అందలేదు. బ్యాంకుల వద్ద పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. బ్యాంకు అధికారులు రోజులో 100 మందికి మించి పింఛన్ ఇవ్వలేకపోతున్నారు. దీంతో లబ్ధిదారులు ప్రతి రోజూ ఉదయాన్నే పింఛన్ సొమ్ము కోసం బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. జిల్లాలో రెండు లక్షల 22వేల మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును ప్రభుత్వం బ్యాంకులలో జమ చేసింది. మేలో కూడా ప్రభుత్వం ఇదే విధంగా పింఛన్ సొమ్మును బ్యాంకులకు జమ చేయగా, కొంతమంది లబ్ధిదారులకు మే పింఛన్ నేటికీ చేతికి అందలేదు. వేలమంది లబ్ధిదారులకు జిల్లాలో ఏ బ్యాంకులో తమ పింఛన్ సొమ్ము జమ అయిందే తెలియని పరిస్థితి నెలకొంది. ఈ గందరగోళ పరిస్థితిలో ఈనెలైనా పింఛన్ సొమ్ము తమ చేతికి అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. పింఛన్ సొమ్ము బ్యాంకుల నుంచి పొందే లబ్ధిదారులు లక్షల్లో ఉండగా, బ్యాంక్ సిబ్బంది మాత్రం అందరికీ సకాలంలో అందించే పరిస్థితిలో లేరు. ఒక మండలంలో 15 నుంచి 20 గ్రామాలుండగా, 2 లేదా 1 బ్యాంక్ మాత్రమే ఉంది. గ్రామాల నుంచి లబ్ధిదారులు పదుల కిలోమీటర్లు నడిచి బ్యాంకులకు వెళ్లి పింఛన్ కోసం రోజంతా ఎదురుచూస్తున్నారు. ఇదిలావుండగా జిల్లాలోని 74,323 మందికి పింఛన్ ఇంటివద్దకు వెళ్లి అందజేయాల్సి ఉంది. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలవ్యాధులతో బాధపడుతున్నవారికి పింఛన్‌ను ఇంటికి వెళ్లి అందించాల్సి ఉంది. అయితే వీరికి కూడా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పింఛన్ సొమ్ము అందివ్వలేదు. ప్రభుత్వం స్పందించి వచ్చే నెలనుంచైనా పాత పద్ధతిలోనే ఇంటింటికీ పింఛన్ సొమ్ము అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

చెరువులో పడి విద్యార్థి మృతి



విద్యార్థిని మింగిన చెరువు

కురిచేడు, జూన్ 3: మండలంలోని పడమర కాశీపురంలో సోమవారం ఉదయం గేదెలు కాయడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు చెరువులో పడి విద్యార్థి మృతి చెందాడు. గ్రామానికి చెందిన సాదం ఏడుకొండలు, అంజమ్మల కుమారుడు బంగారు(13) గేదెల మేపకానికి పొలం వెళ్ళాడు. గేదెలు నీరు తాగడానికి గ్రామం పక్కనే ఉన్న చెరువులోకి దిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి సమృద్ధిగా నీరు చేరింది. గ్రామంలో గృహాల వద్దకు మట్టి తోలడానికి చెరువు కట్ట పక్కనే ఎక్సకవేటర్‌తో మట్టిని తీశారు. దీంతో కట్ట పక్కనే గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలలోకి నీరు చే రింది. బంగారు చెరువులోకి దిగగానే గుంతలలో పడి ఈత రాక అడుక్కు చేరాడు. పక్కనే ఉన్న పిల్లలు గ్రామంలోకి పరుగెత్తికెళ్ళి విషయం ప్రజలకు చెప్పారు. గ్రామస్థులు పరుగునవచ్చి బంగారును చెరువులో నుంచి బయటకు తీసి బతికించే ప్రయత్నాలు చేశారు. అయినా ఫలితం లేదు. బంగారు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాగా చదువునే పిల్లవాడు వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండ కుండా గేదెల మేపకానికి వెళ్ళి అకాల మరణం చెందడంతో గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

భైరవకోనలో ఉగ్ర ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 3: సీఎస్‌పురం మండలంలోని భైరవకోన దేవస్థానంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సోమవారం కుమారుడు జయసింహారెడ్డి, టీడీపీ శ్రేణులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు ఉగ్రను సాదరణంగా ఆహ్వానించా రు. ఉగ్ర కుటుంబసభ్యుల పేర్లతో పూజలు జరిపించారు. త్రిముఖ దుర్గాంబా అమ్మ వారి ఆశీస్సులు మనందరికి ఉండాలని కోరుకున్నట్లు ఉగ్ర తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంగయ్య, టి.చినఅల్లూరయ్య, మాలకొండయ్య, పి.రవి కుమార్, బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి పాల్గొన్నారు.



భైరవకోనలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఉగ్ర



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నేటితో తేలనున్న భవితవ్యం

- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- గెలుపుపై ఎవరికి వారే ధీమా
- ఓట్ల లెక్కింపు కోసం ఒంగోలుకు నేతల క్యూ

గిద్దలూరు, జూన్ 3 : గిద్దలూరు బాద్‌షా ఎవరో నేడు తేలనుంది. అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. రౌండ్‌కు 14 టేబుళ్లతో కౌంటింగ్ ప్రారంభం కానుండగా మొత్తం 21 రౌండ్లలో గిద్దలూరు నూతన ఎమ్మెల్యే ఎవరనేది తెలియనున్నది. నియోజకవర్గంలో మొత్తం 2,39,710 మంది ఓటర్లు ఉండగా ఇందులో 2,02,397 మంది 284 పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోం ఓటింగ్, ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లతో కలిపి ఇందులో 3,550 మంది ఓట్లు ఇమిడి ఉన్నాయి. ఇవి కాకుండా మిలటరీ సర్వీసులో పనిచేసే ఉద్యోగుల ఓట్లు అదనంగా పోలయ్యాయి. 21 రౌండ్లలో ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తికానున్నది. 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్న విషయం తెలిసిందే. టీడీపీ అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి, బహుజన్ సమాజ్‌వాజ్ పార్టీ అభ్యర్థిగా ఇసుకల జయరాజ్, వైసీపీ అభ్యర్థిగా కుందురు నాగార్జునరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పగడాల పెద్దరంగస్వామి, తెలుగు రాజ్యాధికార సమితి అభ్యర్థిగా చింతా శ్యాంసన్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా జవ్వాజి పవన్‌కుమార్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జానావత్ ఠాకూర్‌నాయక్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా దాసరి బాబూరావు, స్వతంత్ర అభ్యర్థులుగా కొప్పుల నరసింహులు, టి.కోటేశ్వర్‌రెడ్డి, పరిసనేని వెంకటేశ్వర్లు, పిడతల రమేష్‌రెడ్డి, బట్టపోతుల ఓబులేసు, బాలసాని మాల్యాద్రిరెడ్డి, బొంతా రంగారెడ్డి, బొర్రా రాఘవేంద్రయాదవ్, మీనిగ మురళిమోహన్‌రెడ్డి, ముడియం వెంకటరామిరెడ్డి, ఎం.లక్ష్మీరామనాయక్, వరికుంట్ల ప్రసాద్, వీరంరెడ్డి ఉషారాణి అసెంబ్లీ బరిలో నిలిచారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ అభ్యర్థులైన ముత్తుముల అశోక్‌రెడ్డి, కుందురు నాగార్జునరెడ్డిల మధ్యనే పోటీ జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామి నియోజకవర్గంలోని చాలా ప్రాంతాలలో ప్రచారం చేసినప్పటికీ పోటీ నామమాత్రమే. మిగతా అభ్యర్థుల పోటీ నామమాత్రం కావడంతో టీడీపీ, వైసీపీ మధ్యనే ప్రధానపోటీ నెలకొన్నది.

ఎవరు గెలిచినా రెండవసారి

గిద్దలూరు అసెంబ్లీ బరిలో ప్రధానంగా పోటీలో ఉన్న టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ముత్తుముల అశోక్‌రెడ్డి, కుందురు నాగార్జునరెడ్డి ఇప్పటివరకు ఒక్కొక్కసారి ఎమ్మెల్యేగా పని చేశారు. అశోక్‌రెడ్డి గిద్దలూరు ఎమ్మెల్యేగా గెలుపొందగా, కుందురు నాగార్జునరెడ్డి మార్కాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం తెలిసిందే. వీరిరువురు కేవలం ఒక్కొక్క పర్యాయం మాత్రమే ఎమ్మెల్యేగా గెలుపొందగా ప్రస్తుతం ఎవరు గెలిచినా రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచినట్లు అవుతుంది.

టేబుల్స్ ఇవే

ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ జరుగనుండగా తొలుత అర్ధవీడు మండలం నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతోంది. 1వ బూత్ నుంచి 29వ బూత్ వరకు అర్ధవీడు మండలంలో ఉండగా తొలి రెండు రౌండ్లు అర్ధవీడు మండల ఫలితం వెలువడుతుంది. ఆ తరువాత 30 నుంచి 74వ నంబరు వరకు ఉన్న కంభం మండలం, 75 నుంచి 129వ నంబరు వరకు ఉన్న బేస్తవారపేట మండలం, 130 నుంచి 164వ నంబరు వరకు ఉన్న రాచర్ల మండలం, 165 నుంచి 243వ నంబరు వరకు ఉన్న గిద్దలూరు రూరల్, అర్బన్, 244 నుంచి 284వ నంబరు బూతు వరకు కొమరోలు మండలం ఫలితాలు వెలువడనున్నాయి. అంటే తొలుత అర్ధవీడు, తరువాత కంభం, బేస్తవారపేట, రాచర్ల, గిద్దలూరు చివరగా కొమరోలు మండల పోలింగ్ బూతుల వివరాలు వెల్లడికానున్నాయి.

విజయం ఎవరిని వరిస్తుందో..!

ఎర్రగొండపాలెం, జూన్ 3 : ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ స్థానికంగా నెలకొంది. గెలుపుపై ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలు ధీమాగా ఉన్నాయి. నియోజకవర్గంలో 2,07,214 ఓట్లు ఉండగా, 1,85,242 ఓట్లు పోలయ్యాయి. 89.40 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్లను మొత్తం 19 రౌండ్లలో లెక్కించనున్నారు. పోస్టల్ ఓట్లు కూడా 1500 పైనే ఉన్నాయి.

ఈ నియోజకవర్గంలో గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. ఇక ఈ పర్యాయం ప్రభుత్వ వ్యతిరేకత సామన్య ఓటరు నుంచి కనిపిస్తోందని, ప్రస్తుతం గిరిజనులు కూడా టీడీపీకే మొగ్గు చూపారని తన గెలుపు తథ్యం అని టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పేర్కొంటున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తాము పడినకష్టానికి విజయం తమనే వరిస్తుందని ఎరిక్షన్‌బాబు ధీమాగా ఉన్నారు. 6500 ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని చెబుతున్నారు. టీడీపీ పార్టీనాయకులు, కార్యకర్తలు ఈ పర్యాయం విజయం తమదే అని ఉత్సాహంగా ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, పోస్టల్ ఓట్లు, బీసీ ఓటర్లు ఈ పర్యాయం టీడీపీకే మొగ్గు చూపారని ఎరిక్షన్‌బాబు తెలిపారు.

ఎర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన తాటిపర్తి చంద్రశేఖర్ నియోజకవర్గానికి మూడు నెలల క్రితమే వచ్చినప్పటికీ, వైసీపీకి ఉన్న బలమైన ఓటు బ్యాంకు ఈ పర్యాయం తనకు గెలుపును తెచ్చి పెడుతుందని ఆయన పేర్కొంటున్నారు. పోల్‌మేనేజ్‌మెంట్, నాయకులతో సమన్వయం చేసుకోవడం తమకు కలిసి వస్తుందన్నారు. తనకు 10 వేల వరకు మెజారిటీ వస్తుందని అంచనా వేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నప్పటికీ, ఫలితాలపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

విజేత ఎవరో... తేలేది నేడే

మార్కాపురం : సార్వత్రిక ఎన్నికలలో మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ విజేత ఎవరో మంగళవారం తేలనుంది. పోలింగ్ ముగిసిన అనంతరం ఎవరి అంచనాలలో వారున్నప్పటికీ, టీడీపీ, వైసీపీ అభ్యర్థులు కౌటింగ్ తేదీ దగ్గర పడే కొద్ది కనిపించిన దేవుళ్లను మొక్కే పనిలో పడ్డారు. కౌటింగ్ తేదీ జూన్ 4 రావడంతో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కౌటింగ్ కేంద్రంలో అనుసరించాల్సిన వ్యూహాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమ పార్టీ ఏజెంట్లకు సుశిక్షితులను చేసి మంగళవారం జరుగనున్న ఒంగోలుకు సోమవారం మధ్యాహ్నం నుంచే తరలివెళ్లారు.

14 టేబుళ్లు... 19 రౌండ్లు

మార్కాపురం నియోజకవర్గంలోని మార్కాపురం మున్సిపాలిటీ, మండలం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి నగర పంచాయతీ, మండలాలలో 257 పోలింగ్ కేంద్రాలలో 2,14,608 ఓట్లకు గాను 1,87,952 ఓట్లు పోలయ్యాయి. వాటి లెక్కింపునకు ఒంగోలు రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓట్లు లెక్కించేందుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. వాటిపై 19 రౌండ్లలో 257 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన లెక్కింపు జరుగుతుంది.

సాయంత్రం 4 గంటలకు ఫలితాలు

మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏ పార్టీ అభ్యర్థికి ఎంత మెజార్టీ వచ్చిందో తెలిపే స్పష్టమైన ఫలితాలను అధికారులు సాయంత్రం 4 గంటలకు ప్రకటించే అవకాశం ఉంది. మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును 4 టేబుళ్ల మీద అధికారులు ప్రారంభిస్తారు. 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఒక రౌండ్‌లో 14 ఈవీఎంలలో ఓట్ల లెక్కింపుకు 25 నిమిషాల సమయం పడుతుందని అధికారులు వెల్లడించారు. దీనిని బట్టి 19 రౌండ్ల ఓట్ల లెక్కింపుకు సుమారు 8 గంటల సమయం పడుతుంది. అంటే తుది ఫలితాలు సాయంత్రం 4 గంటలకు వెలువడనున్నాయి.

టేబుల్	లెక్కించే మార్కాపురం కేంద్రాలు
1వ టేబుల్	1, 15, 29, 43, 57, 71, 85, 99, 113, 127, 141, 155, 169, 183, 197, 211, 225, 239, 253
2వ టేబుల్	2, 16, 30, 44, 58, 72, 86, 100, 114, 128, 142, 156, 170, 184, 198, 212, 226, 240, 254
3వ టేబుల్	3, 17, 31, 45, 59, 73, 87, 101, 115, 129, 143, 157, 171, 185, 199, 213, 227, 241, 255
4వ టేబుల్	4, 18, 32, 46, 60, 74, 88, 102, 116, 130, 144, 158, 172, 186, 200, 214, 228, 242, 256.
5వ టేబుల్	5, 19, 33, 47, 61, 75, 89, 103, 117, 131, 145, 159, 173, 187, 201, 215, 229, 243, 257.
6వ టేబుల్	6, 20, 34, 48, 61, 76, 90, 104, 118, 132, 146, 160, 174, 188. 202, 216, 230, 244
7వ టేబుల్	7, 21, 35, 49, 62, 77, 91, 105, 119, 133, 147, 161, 175, 189, 203, 217, 231, 245.
8వ టేబుల్	8, 22, 36, 50, 63, 78, 92, 106, 120, 134, 148, 162, 176, 190, 204, 218, 232, 246.
9వ టేబుల్	9, 23, 37, 51, 64, 79, 93, 107, 121, 134, 149, 163, 177, 191, 205, 219, 233, 247.
10వ టేబుల్	10, 24, 38, 52, 65, 80, 94, 108, 122, 135, 150, 164, 178, 192, 206, 220, 234, 248.
11వ టేబుల్	11, 25, 39, 53, 66, 81, 95, 109, 123, 136, 151, 165, 179, 193, 207, 221, 235, 249.
12వ టేబుల్	12, 26, 40, 54, 67, 82, 96, 110, 124, 137, 152, 166, 180, 194, 208, 222, 236, 250.
13వ టేబుల్	13, 27, 41, 55, 68, 83, 97, 111, 125, 138, 152, 167, 181, 195, 209, 221, 237, 251.
14వ టేబుల్	14, 28, 42, 56, 69, 84, 98, 112, 126, 138, 153, 168, 182, 196, 210, 222, 238, 252.

అవీ..ఇవీ..

అప్రమత్తతోనే ఎయిడ్స్ నివారణ



ఇండెక్స్ టెస్టింగ్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ సావిత్రి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 3: ఎయిడ్స్ వ్యాధిని అప్రమత్తతతోనే నివారించవచ్చని మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.సావిత్రి అన్నారు. వైద్యశాలలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డాక్కు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండెక్స్ టెస్టింగ్ హెల్పింగ్ డెస్క్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల జీవిత భాగస్వాములకు, వారి పిల్లలకు హెచ్ఐవీ పరీక్షలు ఈ కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాధిగ్రస్తులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, ఆర్ఎంవో రామచంద్రరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏఆర్‌టీ కౌన్సిలర్లు పోతురాజు, రామారావు, మహాలక్ష్మీ, రాజు, లక్ష్మీరెడ్డి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లబ్‌ఫుట్ వ్యాధి నివారణపై అవగాహన

మార్కాపురం రూరల్, జూన్ 3: స్థానిక సర్వజన వైద్యశాలలో క్లబ్‌ఫుట్ వ్యాధి నివారణ దినోత్సవం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కేడీఈఐసీ కూడలిలో అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ. ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ పుట్టకు లోపం వచ్చిన పిల్లలకు సరైన వైద్యం అందిస్తున్నామన్నారు. 'క్లబ్‌ఫుట్ ఇండియా' అనే ఒక ఎన్జీవో సంస్థ ద్వారా పిల్లల సైజుకు తగ్గట్టు బూట్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ యశ్వంత్ మాట్లాడుతూ.. ఈ సమస్యకు పరిష్కారం ఉంటుందని తల్లిదండ్రులు వేరే నాటు మందులు వాడి నష్టపోవద్దన్నారు. సైకాలజిస్ట్ సుబ్బారావు మాట్లాడుతూ ఇది పుట్టకతో వచ్చే లోపం అని, అదేమీ శాపం కాదన్నారు. వారికి వైద్య సదుపాయం అందిస్తే అందరూ పిల్లలతో కలిసి వారు జీవనం సాగిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్లు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు



వార్డెన్లతో మాట్లాడుతున్న అరుణకుమారి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 3: మార్కాపురం డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లోని 13 వసతి గృహాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవో అరుణ కుమారి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వార్డెన్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్ పరిధిలో ప్రి మెట్రిక్ వసతి గృహాలు 7, బాలికలు 3 మొత్తం 10 వసతి గృహాలలో 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివిధ ఇంటర్ కళాశాలలలో చదివే విద్యార్థులు కూడా వసతి గృహాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాస్టళ్లలో అన్ని వసతులు కల్పించాలన్నారు. నూటికి నూరు శాతం హాస్టళ్లలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

మూణాళ్ల ముచ్చట

- నిర్మించి ఏడాది కూడా కాకముందే కూలిన ప్రహరి
- రూ.20 లక్షల ప్రభుత్వ ధనం వృథా



కూలిన ప్రహరిగోడ

పుల్లలచెరువు, జూన్ 3: మండలంలో గత రాత్రి కురిసిన వర్షానికి పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరి కూలింది. గోడను నాశిరకంగా కట్టడంతో కొద్దిపాటి వర్షానికే కూలిపోయింది. దీంతో గత ఏడాది సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన ప్రహరి కథ మళ్లీ మొదటికి వచ్చింది. మండలం కేంద్రమైన పుల్లలచెరువులో మండల కేంద్రమైన జేడ్పీ పాఠశాలలో సుమారు రూ.20 లక్షలతో ప్రహరి గోడ నిర్మించారు. కాంట్రాక్టరు , అధికారులు నిబంధనలు పాటించకుండా నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ప్రహరిగోడ కూలింది. గోడ కూలడానికి ప్రస్తుతానికి కారణాలను కూడా అధికారులు అంచనా వేయలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అనధికార కోతలతో ప్రజల అవస్థలు



132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

కంభం, జూన్ 3 : పదిరోజుల నుంచి కంభం 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అనధికార విద్యుత్ కోతలతో సబ్ డివిజన్‌లోని కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఓవైపు తీవ్రమైన వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వేళపాలా లేకుండా గంటలకొద్ది విద్యుత్‌ను నిలిపి వేస్తుండ డంతో అటు ఇంట్లో ఉండలేక, బయట ఎండలో తిరగలేక విద్యుత్‌శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు చిన్న గాలి వీచి నా, వర్షం పడినా వెంటనే కరెంటు కట్ చేస్తున్నారు. తీగలు తెగిపోయాయని గంటల కొద్ది కోతలు విధిస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ పరికరాలు బిగించక పోవడంతో తరచూ అవాంతరాలు ఏర్పడుతున్నాయని అంటున్నారు. ఇప్పటి కైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి

- మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు



మార్కాపురం, జూన్ 3: నేడు సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ జరుగనున్న నేపథ్యంలో పోలీసుశాఖకు ప్రజలు సహకరించాలని మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు తెలిపారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంగళవారం మొత్తం ప్రజలు ఇళ్లలోంచి బయటకు రాకుండా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. ఎలాంటి పనులు ఉన్నా ఒక్కరోజు వాయిదా వేసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. సబ్ డివిజన్ మొత్తం 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎక్కడా ప్రజలు గుంపులుగా తిరగరాదన్నారు. మొబైల్ వాహనాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నపాటి ఘటనలు చోటుచేసుకున్నా చర్యలు అత్యంత కఠినంగా ఉంటాయన్నారు. అత్యవసర సేవలు మినహా అన్ని రకాల దుకాణాలను మూసి వేసినట్లు తెలిపారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే పోలీసుశాఖ ఉపేక్షించదన్నారు. ఇప్పటికే గొడవలకు కారణమైన వారిపై రౌడీషీట్లు తెరిచినట్లు తెలిపారు. ప్రజలు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. అదే విధంగా రాజకీయ పార్టీల కార్యకర్తలు కూఆ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దన్నారు. నిరంతరం సబ్‌డివిజన్‌పై ప్రత్యేక నిఘా పెడతున్నట్లు తెలిపారు.

నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలు



పహరా కాస్తున్న పోలీసులు

ఎర్రగొండపాలెం, జూన్ 3 : పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఒంగోలులో జరుగుతున్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచే 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేస్తున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రం అన్ని ప్రధాన కూడళ్లలో సాయుధ పోలీసులు పహరా కాస్తున్నారు. నియోజకవర్గంలోని దోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండల కేంద్రాలలో సాయుధ పోలీసులు సమస్యలు తలెత్తకుండా పహరాకాస్తున్నారు. ఎర్రగొండపాలెం ఎస్ఐ సుదర్శన్, సీఐ రాములునాయక్‌లు పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఇద్దరు చొప్పున పోలీసులు పహరా ఉన్నారు. నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలు ఈ నెల 5వ తేదీ వరకు అమలులో ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు. షాపులు అన్ని మూసివేయించడంతో ప్రజలు కొన్ని ఇబ్బందులు పడుతున్నారు.

మార్కాపురంలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మార్కాపురం, జూన్ 3: నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలో సోమవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం నుంచి నాలుగు వ్యాపార కూడళ్లు, ప్రధాన వీధుల్లో ఏఆర్, సివిల్ పోలీసులు తిరిగారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాలు ఎలావున్నా చిన్నపాటి అల్లర్లు, గొడవలు జరిగినా చర్యలు కఠినంగా ఉంటాయని మైక్‌లో ప్రచారం నిర్వహించారు. కౌటింగ్ రోజు మొత్తం పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఎవరూ ఉండకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ, గ్రామీణ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలు

గిద్దలూరు టౌన్, జూన్ 3 : అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీసులు 144 సెక్షన్ అమలులోకి తెచ్చారు. అలాగే 30 పోలీసు యాక్ట్ కూడా అమలు చేస్తున్నారు. 3వ తేదీ సోమవారం నుంచే పోలీసులు 144 సెక్షన్‌ను నియోజకవర్గం మొత్తం అమలులోకి తేగా ఈనెల 5వ తేదీ వరకు ఉంటుందని పట్టణ సీఐ సోమయ్య తెలిపారు. నలుగురు కంటే ఎక్కువగా గుమి కూడరాదని, కౌంటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీల నాయియకులు, కార్యకర్తలు, అభిమానులు సంయమనం పాటించాలని, గెలుపునకు సంబంధించి ఎలాంటి ర్యాలీలో, టపాసులు పేల్చడం, రంగులు చల్లుకోవడం నిషేధమని అన్నారు. గొడవలకు దిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

కంభం : నేటి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ముందస్తు చర్యల్లో కంభం సబ్‌డివిజన్ పరిధిలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువగా గుమికూడరాదని హెచ్చరించారు. కంభం సర్కిల్ పరిధిలోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, రెస్టారెంట్లు, లాడ్జీలు, హోటళ్లు మూసి వేయాలన్నారు. జూన్ 6వ తేదీ వరకు సంబరాలు, ఉత్సవాలు చేసేందుకు పర్మిషన్లు లేవన్నారు.

కదలని ట్యాంకర్.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు



రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్యాంకర్

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 3: మార్కాపురం పట్టణంలోని కంభం కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటువంటి ప్రదేశంలోని ముస్లిం షాదీఖానా వద్ద రెండు నెలల క్రితం నీటి ట్యాంకర్‌ను పార్క్ చేశారు. అప్పటి నుంచి ఇక్కడ తీయకపోవడంతో తరచూ ట్రాఫిక్ కష్టాలు వస్తున్నాయి. అసలే ఇరుకైన ప్రాంతం. నిత్యం రద్దీగా వాహనాలు తిరిగే ప్రదేశంలో ఈ ట్యాంకర్‌ను నిలపడంతో ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. రెండు నెలల క్రితం షాదీ ఖానా స్లాబు వేసే సమయంలో తెచ్చిన ట్యాంకర్‌ను అక్కడే వదిలేరు. మున్సిపల్, పోలీస్ అధికారులు పట్టించుకోకపోవటంతో ట్రాఫిక్‌కు అడ్డంగా మారింది.

ఎరిక్షన్‌బాబు విశేష పూజలు



చినమస్తానదేవికి పూజలు చేస్తున్న ఎరిక్షన్‌బాబు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, జూన్ 3: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం స్వామివారికి అభిషేకాలు, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం అర్చకులు ఎరిక్షన్‌బాబును ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, మోటకట్ల శ్రీనివాసరెడ్డి, దేవినేని చలమయ్య, వంకాయలపాటి ఆంజనేయులు, ఊట్ల వెంకటేశ్వర్లు, వలరాజు, చేకూరి సుబ్బయ్య, పయ్యావుల ప్రసాదు, శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, మహేష్, శేషాద్రి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో మురుగు కాలువలు

రోడ్లపై నిలుస్తున్న వర్షపు నీరు



పోలీసు స్టేషన్ వద్ద రోడ్లపై నిలిచిన వర్షపునీరు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 3: మార్కాపురం పట్టణంలోని పలు ప్రధాన వీధులు చిన్నపాటి చినులకే చిత్తడిగా మారుతున్నాయి. పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపం ఎదురు లక్షల రూపాయలతో నిర్మించిన పెద్ద మురుగు కాలువను పూడ్చి వేశారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో దానిపై ఆక్రమణలు వెలిశాయి. దీంతో నీరు పోయే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతోంది. పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురు కూడా నీరు నిలిచిపోయింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లపైనే వివిధ షాపుల యజమానులు ఎత్తుగా మట్టి పోస్తుండటంతో నీరు పోయే మార్గం లేకపోయింది. రీడింగ్ రూమ్ కాంప్లెక్స్ మూల మలుపు వద్ద ఒక షాపు యజమాని ఎత్తుగా మట్టి వేయటంతో నీరు రోడ్డుపైనే నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతూ జారిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలు తొలగించి వర్షపు నీరు పోయే మార్గం సుగుమం చేయాల్సి ఉంది.

పొగాకు వ్యాపారుల సిండికేట్

- భారీగా పడిపోయిన ధరలు
- ఒక్కరోజులో కిలోకు రూ.15 తగ్గింపు



పొగాకు కొనుగోలు చేస్తున్న బయ్యర్లు

టంగుటూరు, జూన్ 3 : పొగాకు వేలంలో వ్యాపారులంతా సిండికేట్ అయ్యారు. ధరలను భారీగా దిగజార్చారు. టంగుటూరు వేలం కేంద్రంలో ఒక్క రోజు వ్యవధిలోనే మేలురకం కిలో రూ.15 తగ్గించారు. శనివారం గరిష్ఠ ధర కిలో రూ.347 లభించగా సోమవారం రూ.332 వద్దనే ఆగిపోయింది. శనివారం మార్కెట్ ధరలను చూసిన రైతులు ఆనందించారు. సోమవారానికి ఇది రూ.350 దాటుతుందని ఆశించారు. తీరా వేలం కేంద్రంలోకి వెళ్లిన తర్వాత ధరలను చూసి డీలాపడ్డారు. ఈ ఏడాది మార్కెట్‌లో ఇప్పటి వరకూ లభిస్తున్న ధరలను చూసి రైతులు వచ్చే సీజన్‌కు పొగాకు సాగుకు ఇప్పటి నుంచే భూముల కౌలు, బ్యారెన్‌లు అద్దెకు ఒప్పందాలు చేసుకోవడం ప్రారంభించారు. ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో ఎకరా కౌలు రూ.35 వేల నుంచి 40 వేలకు చేరింది. బ్యారన్‌ల లీజు కూడా పెరిగింది. కొందరు కొత్త బ్యారన్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అనూహ్యంగా సోమవారం వేలంలో ధరలు తగ్గాయి. దీంతో రైతులు ఆలోచనలో పడ్డారు. టంగుటూరు వేలం కేంద్రానికి సోమవారం ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం రైతులకు చెందిన 1,017 బేళ్లను అనుమతించారు. వాటిలో 965 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205 దక్కింది.

వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో మేలు



విద్యార్థినుల జానపదనృత్యం, బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 3: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయని ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తర్లుపాడు ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థులు వారికి నచ్చిన అంశాలలో శిక్షణ పొంది మానసిక, శారీరక పరిపక్వతకు పునాదులు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు నిర్వహించిన జనపద గేయాలు, దేశ భక్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుందాకర్, బాక్సింగ్ కోచ్ పి.వేణు, డాక్టర్ ఎం.మాధవరావు, పిన్నిక శివ, కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిన్నిక నాగేశ్వరరావు, కార్యదర్శి కాశంగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఝాన్సీరాణి, ఛత్రపతి శివాజీల వేషధారణ, గ్రంథాలయంలో విద్యార్థుల ఆటలు

చదరంగం ద్వారా ఏకగ్రత పెంపు

మార్కాపురం వన్‌టౌన్ : చదరంగం ద్వారా ఏకగ్రత పెరుగు తుందని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, చదరంగంలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ నెల 6న ముగింపు సభ నిర్వహించి విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తామని శివారెడ్డి తెలిపారు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే!

» విజయం ఎవరికి దక్కేనో?

దర్శి, జూన్ 3: దర్శి అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమవుతుంది. ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరికి దక్కుతుందోనని తీవ్ర ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. విజయంపై ప్రధాన పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ ఓటర్లు ఎటువైపు మొగ్గి ఉంటారో అన్న అలోచనతో అంచనాలు వేస్తూ తలమునకలవుతున్నారు. దర్శి అసెంబ్లీకి టీడీపీ కూటమి అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పి.కొండారెడ్డితో పాటు మొత్తం 11 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఒంగోలు లోక్‌సభ టీడీపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు మరికొంతమంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు.

దర్శి నియోజకవర్గంలో 2,26,370 మంది ఓటర్లు ఉండగా.. 2,05,792 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా దర్శి అసెంబ్లీలో 90.91 శాతం పోలింగ్ నమోదైంది. ఒంగోలులోని రైజ్ కళాశాలలో కౌంటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమవుతుంది. మొత్తం 282 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు జరిగాయి. ఒక్కో రౌండ్‌కు 14 టేబుల్స్ వేశారు. 21 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారు. దర్శి నియోజకవర్గంలో 1983 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా.. 1749 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కౌంటింగ్ పూర్తయిన అనంతరం ఈవీఎంల లెక్కింపు ప్రారంభిస్తారు. మధ్యాహ్నానికి ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు దర్శి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు. దర్శి ఆర్వో కార్యాలయంలో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పటిష్ట బందోబస్తు మధ్య సోమవారం ఒంగోలు కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీలు, ఏజంట్లు సహకరించాలని కోరారు. కౌంటింగ్‌లో ఎవరైన గొడవలు చేస్తే తక్షణమే బయటకు పంపటంతో పాటు కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫలితాల అనంతరం ప్రజలు ఎలాంటి గొడవలకు పాల్పడకుండా సమన్వయం పాటించాలని కోరారు. గెలుపు, ఓటములను సమానంగా భావించాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కల్పిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



దర్శిలో మూతపడిన దుకాణాలు

దర్శిలో దుకాణాల మూసివేత

దర్శి, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా దర్శి పట్టణంలో దుకాణాలను అధికారులు మూసి వేయించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు పట్టణంలోని అన్ని దుఖాణాలను సోమవారం మధ్యాహ్నం మూసి వేయించారు. ఈసందర్భంగా సీఐ షేక్ షమీముల్లా మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమయంలో, ఫలితాల అనంతరం ప్రజలు ఉద్రిక్తతకు గురికాకుండా ప్రశాతంగా ఉండాలని కోరారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలో దుకాణాలను మూసివేయించినట్లు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

కురిచేడులో పోలీసుల కవాతు

కురిచేడు, జూన్ 3: కురిచేడు మండలంలో సోమవారం ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల లెక్కింపు జరుగనున్న దృష్ట్యా గ్రామాలలో ఎటువంటి సంఘటనలో చోటు చేసుకోకుండా ముందుస్తు చర్యలు చేపట్టారు. కురిచేడు, నమశ్శివాయపురం, దేకనకొండ గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. 144 సెక్షన్ అమలులో ఉందని, గ్రామాలలో ఇద్దరి కంటె ఎక్కువ మంది గుమికూడ వద్దని ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు. ఫలితాల అనంతరం ర్యాలీలు నిర్వహించరాదన్నారు.

పామూరులో మూడు రోజులపాటు 144వ సెక్షన్ అమలు

పామూరు, జూన్ 3: కౌంటింగ్ సందర్భంగా ఎస్పీ ఆదేశాలమేరకు మంగళవారం నుంచి మూడు రోజులపాటు పామూరు మండలంలో 144వ సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపారు. సభలు, ర్యాలీలు, బాణసంచా కాల్చడం, తదితర కార్యాక్రమాలకు ఎవరూ పాల్పడవద్దన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు సోదర భావంతో సంయమనం పాటించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, జూన్ 3: కౌంటింగ్ సందర్భంగా మంగళవారం గ్రామంలో 144వ సెక్షన్ అమల్లో ఉంటున్నట్టు ఎస్ఐ వి.అంజనేయులు తెలిపారు. ప్రజలు గుమికూడటం, బాణసంచా కాల్చటం చేయరాదన్నారు. ఒకరిద్దరు తప్పా ఎక్కువమంది తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ప్రశాంతతకు ప్రజలు సహకరించాలన్నారు.

మాగుంటను కలిసిన టీడీపీ నాయకులు



మాగుంటను సన్మానిస్తున్న దొనకొండ టీడీపీ నాయకులు

దొనకొండ, జూన్ 3: ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని టీడీపీ మండల నాయకులు సోమవారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో కలిశారు. నిమ్మకాయల సుబ్బారెడ్డి, కొత్తం రఘునాదరెడ్డి, శృంగారపు నాగసుబ్బారెడ్డి, శృంగారపు రామసుబ్బారెడ్డి తదితరులు మాగుంటను కలిసి మంగళవారం వెలువడే ఎన్నికల ఫలితాల్లో ఒంగోలు ఎంపీగా విజయం ఖాయమని వివరిస్తూ శాలువా వేసి, పూలబొకే అందించి అభినందించారు.

నారాయణస్వామి ఆదాయం రూ.2 లక్షల 60వేలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 3: సీఎస్‌పురం మండలం విట్టపాలెం శ్రీనారాయణస్వామికి ఆదివారం రూ.2,58,919 ఆదాయం వచ్చింది. సోమవారం కానుకలను లెక్కించారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.82,180, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.45 వేలు, శాశ్వత అన్నదాన పతకానికి వచ్చిన విరాళం రూ.1,26,223, పంచామృత అభిషేకానికి రూ.5516 వచ్చింది. శాశ్వత అన్నదాన పథకానికి కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఎం.వెంకటకృష్ణారెడ్డి, సుబ్బమ్మ దంపతులు రూ.20వేల 116 అందజేసినట్టు ఈవో తెలిపారు.

దివ్యాంగుల సర్వే పరిశీలన

పీసీపల్లి, జూన్ 3: మండలంలో ఈనెల 1నుంచి జరుగుతున్న దివ్యాంగుల సర్వే కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించిన ఎంఈవోలు సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సర్వేలో మాటలు రాని, వినికిడి లోపం, మందబుద్ధి కలిగిన చిన్నారులను గుర్తించి వారి సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. తద్వారా వారికి అందించాల్సిన సామగ్రిని సమగ్రశిక్ష ద్వారా అందించేందుకు సులభతరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శ్వేషిక తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు పరీక్షకు 47 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), జూన్ 3 : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ సప్లిమెంటరీ పరీక్షలకు సోమవారం 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 448 మంది హాజరు కావాల్సి ఉండగా 401 మంది హాజరయ్యారు. పదవ తరగతి హిందీ పరీక్షకు 8మందికి గాను ఆరుగురు హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ఇంటర్ బయాలజి సబ్జెక్టుకు 223 మంది హాజరు కావాల్సి ఉండగా 193 మంది, ఇంటర్ కామర్స్ పరీక్షకు 448 మంది హాజరు కావాల్సి ఉండగా 401 మంది హాజరయ్యారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకులు, విద్యాశాఖ డైరెక్టర్ ఎ. సుబ్బారెడ్డి సోమవారం ఒంగోలులోని మూడు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే శివకుమార్, ఓపెన్ స్కూలు సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరెడ్డిలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

6నుంచి టెన్త్ మూల్యాంకనం

పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 6నుంచి స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. గణితం మినహా మిగిలిన సబ్జెక్టుల జవాబు పత్రాలు ఇక్కడికి మూల్యాంకానికి వచ్చాయన్నారు. గణితం జవాబు పత్రాలు డిజటల్ ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తారని తెలిపారు. ఇతర సబ్జెక్టులకు సంబంధించి సుమారు 10వేల జవాబు పత్రాలు ఇక్కడికి మూల్యాంకనానికి వచ్చాయని పేర్కొన్నారు. మూల్యాంకనం ఈనెల 9తో ముగుస్తుందని సుభద్ర తెలిపారు.

12 నాటికి నాడు-నేడు పనులు పూర్తికి ఆదేశం

ఒంగోలు(విద్య), జూన్ 3 : వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి అంటే ఈనెల 12 నాటికి పాఠశాలల్లో నాడు-నేడు కింద మంజూరు చేసిన పనులన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల విద్యా మౌలిక వసతుల కమిషనర్ కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు తరగతి గదులకు శ్లాబులు పూర్తి చేస్తే తర్వాత తలుపులు, కిటికీలు పెట్టుకోవచ్చన్నారు. పాఠశాలల్లో నిర్మాణాల కట్టుబడుల వల్ల వచ్చే చెత్త, చెదారం, ఇతర నిర్మాణ సామగ్రిని పాఠశాలలోని నిర్మాణ స్థలాల నుంచి తొలగించి దూరంగా వేసి పాఠశాలల్లో ప్రమాదాలను నివారించాలని సూచించారు.

సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా వచ్చిన మెటీరియల్‌ను పాఠశాలల పునః ప్రారంభ నాటికి పనిచేసే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు నాడు- నేడు పనులు పూర్తి చేసి పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని భాస్కర్ ఆదేశించారు.

సైకిల్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

ఒంగోలు(కల్చరల్), జూన్ 3:సైకిల్‌ను ఉపయోగించటం వల్ల వాహన కాలుష్యం తగ్గి పర్యావరణం పరిరక్షింపబడుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. సోమవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సంస్థ సభ్యులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకే కాకుండా మంచి వ్యాయామంగా కూడా సైకిల్ వాడకం ఉపయోగపడుతుందని అన్నారు. సైకిల్ వాడండి - పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో ర్యాలీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు.



భైరవకోనలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఉగ్ర

భైరవకోనలో ఉగ్ర పత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 3: సీఎస్‌పురం మండలంలోని భైరవకోన దేవస్థానంలో టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సోమవారం కుమారుడు జయసింహారెడ్డి, టీడీపీ శ్రేణులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు ఉగ్రను సాదరణంగా ఆహ్వానించారు. ఉగ్ర కుటుంబసభ్యుల పేర్లతో పూజలు జరిపించారు. త్రిముఖ దుర్గాంబా అమ్మవారి ఆశీస్సులు మనందరికి ఉండాలని కోరుకున్నట్లు ఉగ్ర తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంగయ్య, టి.చినఅల్లూరయ్య, మాలకొండయ్య, పి.రవి కుమార్, బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి, పసుపులేటి గురుకృష్ణ పాల్గొన్నారు.

22 రౌండ్లలో కనిగిరి ఫలితం

» మధ్యాహ్నం 12 గంటలలోపు వెల్లడి
» మహమ్మదాపురం నుంచి ప్రారంభమై రేణిమడుగుతో ముగింపు

కనిగిరి, జూన్ 3: కనిగిరి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 22 రౌండ్లలో పూర్తికానుంది. మంగళవారం 12 గంటల సమాయానికి ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఒంగోలు రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో కనిగిరి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఇప్పటికే పూర్తిచేశారు. నియోజకవర్గంలో 297 పోలింగ్ బూత్‌లు ఉండగా, మొత్తం 22 రౌండ్లలో ఈవీఎం యంత్రాలను లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపు హనుమంతునిపాడు మండలంలోని మొదటి పోలింగ్ బూత్ మహమ్మదాపురం నుంచి ప్రారంభమవుతుంది. పామూరు మండలంలోని చివరి పోలింగ్ బూత్ రేణిమడుగుతో ముగియనుంది.

1వ రౌండ్: మహమ్మదాపురం పోలింగ్ బూత్ నుంచి ప్రారంభమై వేములపాడులో రెండు, లింగంగుంట్ల, ఉమ్మన్నపల్లి, హనుమంతాపురం, వాలిచెర్లలో 2 బూత్‌లు, నందనవనం, పాపిరెడ్డిపల్లి, వీరరామాపురం, రామాయిపల్లి, చినముప్పళ్ళపాడు, పెదదాసళ్ళపల్లి బూత్‌లతో లెక్కింపు ముగియనుంది.

2వ రౌండ్: కూటాగుండ్లతో ప్రారంభమై, నల్లగండ్ల, పెదగొల్లపల్లిలో 2, తిమ్మారెడ్డిపల్లిలో 2, దాసరిపల్లి, కోటతిప్పల, కొండారెడ్డిపల్లి, హనుమంతునిపాడు, హాజీపురం, మిట్టపాలెం, కిష్టంపల్లి, దొడ్డిచింతలతో ముగుస్తుంది.

3వ రౌండ్: శీతారామపురం బూత్ నుంచి పూలికుంట్ల, జాళ్ళపాలెం, గుడిపాటిపల్లిలో 2, పందువనాగులవరం, ఇమ్మడిచెరువు, పందువలో 2, వెదుళ్ళచెరువు, రాళ్ళపల్లి, మోటుపల్లి, రామలింగాపురం, రామగోపాలపురం బూత్‌లతో కౌంటింగ్ ముగుస్తుంది.

4వ రౌండ్: గన్నవరంలో 2 బూత్‌లు, పాపిరెడ్డిపల్లిలో 2, జిల్లెలపాడు, వెలిగండ్ల, మల్లంరాజుపల్లి, బల్లవరం, తమ్మినేనిపల్లి, నర్సమందాపురం, పద్మాపురం, మొగుళ్ళూరు బూత్‌లతో కౌంటింగ్ ముగుస్తుంది.

5వ రౌండ్: మొగుళ్ళూరు పోలింగ్‌బూత్ నుంచి ప్రారంభమై కొత్తనరసింహపురం, మరపగుంట్ల, కోటాలపల్లి, నాగిరెడ్డిపల్లి, చోడవరం, వెంగనగుంట, పెద గొగులపల్లిలో రెండు బూత్‌లు, కందులగుంట్ల అగ్రహారం, ఆర్‌కే పల్లి, ముండ్లపాడు, అరివేముల, జంగంవారిపల్లితో కౌంటింగ్ ముగుస్తుంది.





రైజ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు

6వ రౌండ్: ఏనుకునాంపురంలో రెండు బూత్‌లు, వెంకటాయచెరువు, బోయమడుగుల, డీజీపేటలో మూడు బూత్‌లు, కొండబోయినపల్లి, సీఎస్‌పురంలో ఆరు బూత్‌లతో కౌంటింగ్ ముగుస్తుంది.

7వ రౌండ్: కోవిలండపాడులో రెండు బూత్‌లు, చింతపూడి, నాగులవరం, కంభంపాడు, శీలంవారిపల్లి, ఉప్పలపాడు, పుల్లగూరపల్లి, అయ్యన్నపల్లి, రేగులచెలక, చెన్నపునాయునిపల్లి, వట్టబయలులో రెండు బూత్‌లు, ఏ కొత్తపల్లితో ముగుస్తుంది.

8వ రౌండ్: అంబవరం బూత్ నుంచి గుంతచెన్నంపల్లి, నల్లమడుగులలో 2, అనికాళ్ళపల్లి, పెదరాజుపాలెంలో రెండు బూత్‌లు, గానుగపెంట, బడుగులేరులో 2 బూత్‌లు, యడవల్లి, ఎర్ర ఓబునపల్లి, సీహెచ్ కొత్తపల్లి, దిరిశవంచతో లెక్కింపు ముగిస్తుంది.

9వ రౌండ్: చల్లగిరిగల బూత్ నుంచి ప్రారంభమై నందనమారెళ్ళ, తుమ్మగుంటలో 2, కాశీపురం, దేవాంగనగర్‌లో రెండు, కనిగిరి పట్టణంలో 120 పోలింగ్ కేంద్రం నుంచి 126 పోలింగ్ కేంద్రాల వరకు ఏడు బూత్‌ల కౌంటింగ్ ముగుస్తుంది.

10వ రౌండ్: కనిగిరి పట్టణంలోని 127వ పోలింగ్ బూత్ నుంచి 140వ పోలింగ్ బూత్ వరకు 14 పోలింగ్‌బూత్‌లకు కౌంటింగ్ ముగుస్తుంది.

11వ రౌండ్: కనిగిరి పట్టణంలోని 141వ పోలింగ్ బూత్ నుంచి 144వరకు, పునుగోడులో రెండు బూత్‌లు, చింతలపాలెంలో రెండు బూత్‌లు, శంఖవరంలో రెండు బూత్‌లు, పెరంగుడిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, రాగిమానిపల్లి, గుడిపాడు బూత్‌లతో కౌంటింగ్ ముగుస్తుంది.

12వ రౌండ్: కొత్తపాలెం బూత్ నుంచి వెంకటేశ్వరపురం, ఎనిమిరెడ్డిపల్లి, తాళ్ళూరు, పాలూరివారిపల్లి, ఏరువారిపల్లిలో రెండు బూత్‌లు, వాగుపల్లి, చినఇర్లపాడు, కంఠంవారిపల్లి, బూతంవారిపల్లి, మాచవరం, చాకిరాలలో రెండుబూత్‌లతో కౌంటింగ్ ముగుస్తుంది.

13వ రౌండ్: ఎన్.గోల్లపల్లి బూత్ నుంచి సుల్తాన్‌పురం, పొలవరం, కలగట్ల, లింగారెడ్డిపల్లిలో 2, చిన అలవలపాడు, కంచర్లవారిపల్లి, చీర్లదిన్నెలో 2, బాలవెంకటాపురం, బల్లిపల్లిలో 2, జమ్మలమడక బూత్‌తో ముగుస్తుంది.

14వ రౌండ్: ఏగువపల్లి బూత్ నుంచి ప్రారంభమై వంగపాడు, బుడ్డాయిపల్లి, గురువాజీపేటలో రెండు బూత్‌లు, కృష్ణాపురం, గుదేవారిపాలెంలో రెండు బూత్‌లు, చౌటగోగుపల్లి, పెద అలవలపాడులో రెండుబూత్‌లు, వెంగళాపురంలో 2, పొతవరంతో ముగుస్తుంది.

15వ రౌండ్: నేరేడుపల్లిలో రెండు బూత్‌ల నుంచి, మారెళ్ళల్లో 2, బట్టుపల్లి, ముద్దపాడు, మరికుంటపల్లి, పాలేటిపల్లి, తలకొండపాడు, చెరుకూరివారిపల్లి, పీసీపల్లిలో మూడు బూత్‌లు, పడమటపల్లితో ముగుస్తుంది.

16వ రౌండ్: పీసీపల్లి 211 పోలింగ్ బూత్ నుంచి పెద వరిమడుగు, జంగాలపల్లి, మురుగమ్మి, వేపగుంపల్లి, చింతగుంపల్లిలో రెండు, వెంగళాయపల్లి, పెద ఇర్లపాడులో నాలుగు బూత్‌లు, తురకపల్లి, గుంటుపల్లితో కౌంటింగ్ ముగుస్తుంది.

17వ రౌండ్: శంఖరాపురం బూత్ నుంచి కోదండ రామపురం, లక్ష్మక్కపల్లి, రావిగుంపల్లిలో రెండు, మార్కొండాపురం, భూమిరెడ్డిపల్లి, చిలంకూరు, దొడ్డవెంకటాయపల్లి, వీరభద్రాపురం, పీ.కట్టకిందపల్లిలో రెండు, డాదిరెడ్డిపల్లి, గుమ్మలంపాడుతో కౌంటింగ్ ముగుస్తుంది.

18వ రౌండ్: వగ్గంపల్లిలో రెండు, నర్రమారెళ్ళల్లో 2, బలిజపాలెం, కొండారెడ్డిపల్లి, మోపాడు, తూమాటివారిపల్లి, కోడిగుంపల, అయ్యవారిపల్లి, అయ్యన్నకోట, మోపాడు, ఇనిమెర్లలో రెండు బూత్‌లతో ముగుస్తుంది.

19వ రౌండ్: నుచ్చుపొద బూత్ నుంచి చింతలపాలెం, మోత్రావులపాడు, వెంకటాపురం, బుక్కాపురం, తాతాయిపల్లి, పడమటిపల్లి, తూర్పుకోడిగుడ్లపాడులో రెండు, పామూరు పట్టణంలోని 262 నుంచి 266 పోలింగ్ బూత్‌ల వరకు ముగుస్తుంది.

20వ రౌండ్: పామూరు పట్టణంలోని 267వ పోలింగ్ బూత్ నుంచి 279 పోలింగ్ బూత్ వరకు 13 బూత్‌లకు తిరగలదిన్నెతో ముగుస్తుంది.

21వ రౌండ్: పుట్టంనాయునిపల్లి బూత్ నుంచి లక్ష్మీనర్సాపురంలో రెండు, కట్టకిందిపల్లి, కరోల్లపాడు, కంభాలదిన్నెలో 3, అప్పమాంబపురం, బొట్లగూడూరులో 3, రజాసాహెబ్‌పేట, బోడవాడ పోలింగ్ బూత్‌లతో కౌంటింగ్ ముగుస్తుంది.

22వ రౌండ్: రేణిమడుగు పోలింగ్ బూత్ ఒక్కదాన్ని 22వ రౌండ్‌గా లెక్కిస్తారు.

రైల్వే అధికారుల నిర్లక్ష్యం.. రాకపోకలకు అంతరాయం

» అండర్‌పాస్ వంతెనలో వర్షంనీరు వెళ్లేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయని డ్రైనేజీ నిర్మాణం
» మోకాళ్ల లోతు నీరు నిలిచిన వైనం

దొనకొండ, జూన్ 3: దొనకొండలో రైల్వే అధికారులు నిర్మాణం చేపట్టిన రైల్వే అండర్‌పాస్ వంతెనలో వర్షం నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ నిర్మాణం సక్రమంగా ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అండర్‌పాస్ వంతెనలో వర్షం నీరు మోకాళ్లలోతులో నిలిచిపోయింది. రైల్వే అధికారులు దాదాపు మూడు సంవత్సరాల క్రితం దొనకొండలో రెండు వైపులా అండర్‌పాస్ వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కురిచేడు వైపు వెళ్లే అండర్‌పాస్ వంతెనకు వర్షంనీరు బయటకు వెళ్లేందుకు సరైన నిర్మాణ పనులు చేపట్టలేదు. రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో మూడేళ్లుగా వర్షం కురిసిన సమయంలో అండర్‌పాస్‌లో మోకాళ్ళలోతు నీరు నిలుస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్‌పాస్ వంతెన అవతలి వైపున పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ వైద్యశాల, పోస్టాఫీస్, కెనరా బ్యాంకు, వివిధ వ్యాపార దుఖాణాలు, అధికసంఖ్యలో గృహలు, బాదాపురం, రామిరెడ్డిపల్లి, పోలేపల్లి తదితర గ్రామాలు ఉండటంతో ప్రజలు నిత్యం ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి నీరు నిలిచిపోకుండా శాశ్వ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అండర్‌పాస్‌లో నిలిచిఉన్న నీరు

పోలీసుల హెచ్చరిక బోర్డులు

పీసీపల్లి, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా 30వ పోలీసు యాక్ట్, 144సెక్షన్‌కు సంబంధించి మండలంలోని పెదయిర్లపాడు, పీసీపల్లిలో పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు .ఆయా కూడళ్లలో ప్రజలనుద్దేశించి ఎస్సై రమేష్‌బాబు మాట్లాడుతూ సెక్షన్144 అమలులో ఉన్నందున నలుగురికి మించి గుమికూడరాదన్నారు. ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని చెప్పారు.

చెరువులో పడి విద్యార్థి మృతి



విద్యార్థిని మింగిన చెరువు

కురిచేడు, జూన్ 3: మండలంలోని పడమర కాశీపురంలో సోమవారం ఉదయం గేదెలు కాయడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు చెరువులో పడి విద్యార్థి మృతిచెందాడు. గ్రామానికి చెందిన సాదం ఏడుకొండలు, అంజమ్మల కుమారుడు బంగారు(13) గేదెల మేపకానికి పొలం వెళ్ళాడు. గేదెలు నీరు తాగడానికి గ్రామం పక్కనే ఉన్న చెరువులోకి దిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి సమృద్ధిగా నీరు చేరింది. గ్రామంలో గృహాల వద్దకు మట్టి తోలడానికి చెరువు కట్ట పక్కనే ఎక్సకవేటర్‌తో మట్టిని తీశారు. దీంతో కట్ట పక్కనే గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలలోకి నీరు చే రింది. బంగారు చెరువులోకి దిగగానే గుంతలలో పడి ఈత రాక అడుక్కు చేరాడు. పక్కనే ఉన్న పిల్లలు గ్రామంలోకి పరుగెత్తికెళ్ళి విషయం ప్రజలకు చెప్పారు. గ్రామస్థులు పరుగునవచ్చి బంగారును చెరువులో నుంచి బయటకు తీసి బతికించే ప్రయత్నాలు చేశారు. అయినా ఫలితం లేదు. బంగారు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బాగా చదువునే పిల్లవాడు వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండ కుండా గేదెల మేపకానికి వెళ్ళి అకాల మరణం చెందడంతో గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠినచర్యలు

దొనకొండ, జూన్ 3: అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని త్రిపురాంతకం సీఐ సుబ్బారావు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా మంగళవారం నుంచి మూడు రోజులు డ్రైడేగా ప్రకటించినట్టు చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు సోమవారం స్పెషల్ ఫోర్స్‌తో దొనకొండకు విచ్చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఈ మూడు రోజులు మద్యం సేవించినట్లు కనిపిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. రోడ్లపైకి వచ్చి ర్యాలీలు చేయటం, బాణసంచా కాల్చటం, రంగులు చల్లుకోవటం నిషేధించినట్టు చెప్పారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. వీటిని వ్యక్తిగత జీవితాల్లోకి తెచ్చుకొని ఇబ్బందుల పాలు చేసుకోవద్దని కోరారు.

ఎస్సై సంపత్‌కుమార్ మాట్లా డుతూ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. దొనకొండ మం డలంలో రెండు పోలీస్ మొబైల్ వాహనలు, స్పెషల్ ఫోర్స్ మూడు ప్రాంతాల్లో పికెట్, సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నట్టు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్ సీఐ జి.శ్రీనివాసరావు, స్థానిక పోలీసు లు, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి

తాళ్లూరు, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ వైవీ రమణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. వ్యాపారస్తులు, రాజకీయ ప్రతినిధులు, ప్రజలతో ఆయన మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలు శాంతియుతంగా ఉండాలన్నారు. అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలను 4వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు మూసి వేయాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా వీధుల్లోకి రావద్దన్నారు. ప్రజల పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నుంచి గ్రామాల్లోని దుకాణాలను, షాపులను మూసి వేయించారు.



దొనకొండలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 4 జూన్ 2024







బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్.



కౌంటింగ్ కేంద్రాలలోని ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా.

తీర్పు నేడే

- నిరీక్షణకు తెర

- అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే
- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- తొలుత పోస్టల్ బ్యాలెట్లు, ఆపై ఈవీఎంలు
- బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి వచ్చింది.. దాదాపు మూడు నెలల పాటు సాగిన ఓట్ల సమరం మంగళ వారం నాటి ఓట్ల లెక్కింపుతో ముగింపునకు రానుంది. మే 13న పోలింగ్ ముగియడంతో అప్పటినుంచి అభ్యర్థులతో పాటు ప్రజలు ఫలితాలపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. రకరకాల సర్వేలు, అంచనాలు, ఊహాగానాలు, సామాజిక సమీకరణాలు, కూడికలు, తీసివేతలు ఇలాంటి వాటన్నింటికి తెరపడి వాస్తవ ఫలితాలు మరికొద్ది గంటల్లోనే రానున్నాయి. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాపట్ల పార్లమెంటు స్థానానికి సంబంధించిన కౌంటింగ్ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

బాపట్ల, జూన్3(ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల భవితవ్యం తేలిపోయే సమయం వచ్చేసింది. ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓటరు తీర్పు నేడు వెలువడనుంది. ఓటర్ల తీర్పు కోసం అభ్యర్థులు ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపును పూర్తి చేసేందుకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. మే 13న పోలింగ్ ముగిశాక పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజక వర్గాల్లోని ఆర్వో కేంద్రాల్లో భద్రపరిచారు. వీటిని పూర్తి భద్రత మధ్య సోమవారం బాపట్లలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. ఈ దఫా ప్రధాన రాజకీయ పార్టీల దృష్టంతా పోస్టల్ బ్యాలెట్లపైనే ఉంది.

పోలింగ్ కేంద్రాలు.. రౌండ్లు వారీగా....

ఈవీఎంల కౌంటింగ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానుంది. ఒక్కో రౌండ్‌కు సంబంధించి 14 బూత్‌ల ఓట్లను లెక్కించనున్నారు. 298 పోలింగ్ స్టేషన్లతో అద్దంకి నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలవగా ఇక్కడ 22 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. తర్వాత 295 పోలింగ్ బూత్‌లతో పర్చూరు ఉండగా ఇక్కడా 22 రౌండ్లలో లెక్కింపు సాగనుంది. రేపల్లెలో 264 పోలింగ్ స్టేషన్లకు 19 రౌండ్లు, వేమూరులో 233 కేంద్రాల పరిధిలో 17 రౌండ్లు, చీరాలలో 218 పోలింగ్ స్టేషన్లు ఉండగా 16 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. బాపట్ల నియోజకవర్గంలో 202 పోలింగ్ కేంద్రాలకు 15 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. జిల్లాలో తొలి ఫలితం వెల్లడి కూడా బాపట్లదే కానుంది.

పోలీస్ నిఘాలో బాపట్ల

కౌంటింగ్ జరిగే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల పరిసరాలతో పాటు బాపట్ల పట్టణం మొత్తం పోలీసు నిఘాలోకి వెళ్లింది. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉండడంతో అనుమతి లేకుండా ఎలాంటి విజయోత్సవాలు, ర్యాలీలు చేపట్టరాదని ఇప్పటికే పోలీసు శాఖ ఆదేశించింది. బాపట్ల పట్టణంలోకి ప్రవేశించే బైపాస్ మార్గాల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేసిన తర్వాతనే అనుమతిస్తున్నారు. సహేతుక కారణం లేకుండా బయట వ్యక్తులు ఎవ్వరినీ పట్టణంలోకి ప్రవేశించనీయడం లేదు. కౌంటింగ్ కేంద్రం దగ్గర మూడంచెల భద్రత ఏర్పాటు చేసి పూర్తి తనిఖీలతో పాటు నిర్దిష్ట పాస్‌లు ఉన్నవారినే లోపలికి అనుమతించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచే బాపట్ల పట్టణంలోని దుకాణాలు అన్నింటిని పోలీసులు మూసివేయించారు.

సోమవారం రాత్రికే...

ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లు అందరూ సోమవారం రాత్రికే బాపట్లతో పాటు చీరాల రూరల్ పరిధిలోని రిసార్ట్‌లకు చేరారు. మంగళవారం ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే విధంగా వీరంతా ప్లాన్ చేసుకున్నారు. మరోవైపు పార్టీ శ్రేణులు సైతం భారీ సంఖ్యలోనే ఇప్పటికే బాపట్ల పరిసరప్రాంతాలకు చేరుకున్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

మూడు వారాల నిరీక్షణకు మంగళవారం తెరపడనుంది. గెలుపు అవకాశాలపై ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు ఎవరి ధీమాను వారు కనబరుస్తుండడం విశేషం. ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లతో పాటు తాజాగా వెల్లడైన ఎగ్జిట్ పోల్ అంచనాలు పాలక పార్టీ అభ్యర్థులను ఆత్మరక్షణలో పడేయగా, కూటమి అభ్యర్థులు జోష్ మీదున్నారు. సర్వేల లెక్కలన్నీ పక్కన బెట్టి ఓటర్లు తమ పక్షాన నిలబడ్డారన్న ధీమాతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు.





రథం బజారు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పోస్టల్ బ్యాలెట్ ఇలా..

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్లు	పోలైనవి
• వేమూరు	2076	1981
• రేపల్లె	3818	3582
• బాపట్ల	2899	2719
• పర్చూరు	2920	2766
• అద్దంకి	2821	2702
• చీరాల	3271	3017
మొత్తం	17,805	16,767

అద్దంకిలో అత్యధికంగా 88.25 శాతం

మే 13న జరిగిన ఓటింగ్ విషయానికొస్తే అత్యధికంగా జిల్లాలో అద్దంకి లో 88.25 శాతం పోలింగ్ నమోదైంది. తర్వాత స్థానాల్లో పర్చూరు 87.32, వేమూరు 86.43, బాపట్ల 83.02, చీరాల 82.61, రేపల్లె లో 82.59 పోలింగ్ శాతం నమోదైంది. రౌండ్ల వారీగా చూస్తే తొలి ఫలితం బాపట్లది కాగా, తుది ఫలితం అద్దంకిది కానుంది.



బాపట్ల బస్టాండ్ వద్ద మూసి వేసిన దుకాణాలు

ఎమ్మెల్యే పిన్నెల్లికి బిగ్ షాక్

• కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లొద్దని సుప్రీం ఆంక్షలు



నరసరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపుకు వెళ్లరాదంటూ పిన్నెల్లిని ఆదేశించింది. పిన్నెల్లి బాధితుడు, పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రం తెలుగుదేశం పార్టీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు సోమవారం విచారించి ఆదేశాలు జారీ చేసింది. తనకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నుంచి ప్రాణహాని ఉందని, పిన్నెల్లికి 6 వరకు హైకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపు ఆదేశాలు రద్దు చేయాలని కోరుతూ శేషగిరిరావు రెండు పిటిషన్లను దాఖలు చేశారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో పిన్నెల్లి తనపై దాడి చేశాడని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజు కూడా పిన్నెల్లి హింసకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనపై శేషగిరిరావు మరో పిటిషన్ దాఖలు చేశాడు. ఆధారాలున్నా ఎమ్మెల్యే పేరు, అనుచరుల పేర్లు లేకుండా కేసు పెట్టారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులంటూ ఎమ్మెల్యేకు అనుకూలంగా అధికారులు వ్యవహరించారని పిటిషన్లో తెలిపారు. ఈ అంశాలన్నీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ముందస్తు బెయిల్ ఇచ్చిందని పిటిషన్‌లో తెలిపారు. తీవ్ర ఘటనలైనా బెయిల్ మంజూరు చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. శేషగిరిరావు దాఖలు చేసిన రెండు పిటీషన్లపై విచారించిన సుప్రీంకోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది. పిన్నెల్లిని అరెస్టు చేయవద్దని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు తప్పుపట్టింది. ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లికి ఉపశమనం కల్గించి హైకోర్టు తప్పు చేసిందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.

ఎమ్మెల్యే పిన్నెలి కదిలికలపై నిఘా

• సుప్రీంకోర్టు తీర్పుతో అప్రమత్తమైన పోలీసులు

నరసరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ఓట్ల లెక్కింపుకు వెళ్లరాదంటూ సుప్రీంకోర్టు ఆదేశాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నరసరావుపేటలో పిన్నెల్లి కదిలికలపై నిఘా ఉంచారు. రెడ్డినగర్ సమీపంలోని కొత్తగా ఏర్పాటు చేసిన రియల్ వెంచర్‌లో వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ నివాసం ఉంటున్నాడు. ఈ ఇంటిలోనే పిన్నెల్లి ఉంటున్నాడు. పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన కేసులో హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ ఇస్తూ 6 వరకు ఎస్పీ కార్యాలయంలో సంతకం చేయాలన్న షరతు విధించింది. ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎస్పీ కార్యాలయంలో సంతకం చేసేందుకు కూడా బందోబస్తుతో తీసుకు వెళ్లేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి తరుపున కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించిన వారంతా రాత్రి ఆయనను కలసివెళ్లారు.

వాహనాల మళ్లింపు ఇలా...

చీరాల వైపు నుంచి బాపట్లకు వచ్చే వాహనాలు జాతీయ రహదారి 216 మీదుగా సూర్యలంక రోడ్డులో నుంచి బాపట్ల పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. కర్లపాలెం వైపు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారి 216 మీదుగా వెళ్లవలసి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులకు కమ్మ కల్యాణ మండపం పక్కన దాని ఎదురుగా ఉన్న రెండు ప్రదేశాలను పార్కింగ్ కోసం కేటాయించారు. అధికారులకు, సిబ్బందికి విలియం బూత్ కళాశాల వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చే కూటమి పార్టీల ఏజెంట్‌లకు, ఇండిపెండెంట్ అభ్యర్థుల ఏజెంట్లకు వై జంక్షన్‌లోని రాయల్ మెరైన్ కంపెనీ వద్ద పార్కింగ్ స్థలం కేటాయించారు. వైసీపీ ఏజెంట్లకు జాతీయ రహదారి 216 నుంచి నాగేంద్రపురం వెళ్లే రోడ్డు పక్కన పార్కింగ్ సౌకర్యం కల్పించడమైనది.

వెయ్యి మందికి పైనే విధుల్లో...



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఏఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతో పాటు వివిధ హోదాల్లో దాదాపు వెయ్యిమందిపైనే సిబ్బంది కౌంటింగ్ విధుల్లో భాగస్వామ్యం కానున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు, ఈవీఎంలకు వేర్వేరుగా సిబ్బందిని కేటాయించారు. కౌంటింగ్ ప్రక్రియను మొత్తం వీడియో తీయనున్నారు. ఆర్వో నిర్ణయమే ఫైనల్‌గా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. మధ్యాహ్నం 1 గంటకు తొలి ఫలితం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రక్రియ అంతా పూర్తయ్యేసరికి సాయంత్రం 6 కావచ్చని, బాపట్ల పార్లమెంట్ స్థానం కూడా ఉన్నందున రాత్రి వరకు కౌంటింగ్ జరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని యంత్రాంగం చెబుతోంది.

క్షణక్షణం.. ఉత్కంఠ



- కొన్ని గంటల్లో జాతకాలు వెల్లడి
- నేటి ఫలితాలపైనే అమరావతి భవితవ్యం
- కూటమి నేతల్లో గెలుపు ధీమా
- వైసీపీ వారిలో ఓటమి భయం
- పందేల రాయుళ్ల గుండెల్లో గుబులు

గుంటూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా ఈవీఎంలలో భద్రంగా ఉన్న రాష్ట్ర భవిష్యత్తు మరికొన్ని గంటల్లో వెల్లడి కానుంది. టీవీల ద్వారా ఎప్పటికప్పుడు ఫలితాలను తెలుసుకునేందుకు అన్ని వర్గాల ప్రజానీకం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది. అందరూ తమ వ్యాపకాలను మంగళవారం పక్కన పెట్టి శెలవు దినంగా భావిస్తూ ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో తెలుసుకునేందుకు వేచి చూస్తున్నారు. అలాగే కోట్లలో పందేలు వేసిన బెట్టింగ్ రాయుళ్ళ గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నాయి. కొందరు పందెం రాయుళ్ళైతే తమ వద్ద నగదు లేకపోవటంతో స్థలాలను, పొలాలను కూడా తాకట్టు పెట్టి బెట్టింగ్‌లు పెట్టారు. సోమవారం కూడా పందేల పరంపర కొనసాగుతూనే ఉంది.

ఇక ఇప్పటికే వెలువడిన అత్యధిక సర్వేలతో కూటమి నేతలతో పాటు కూటమి తరపున పందేలు పెట్టిన బెట్టింగ్ రాయుళ్ళలో కూడా గెలుపు ధీమా కనిపిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 12 తరువాత సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కూటమి అభ్యర్థుల్లో కూడా సోమవారం నుంచి గెలుపు ధీమా మరింత మెరుగైంది. కేంద్రంలోనూ రాష్ట్రంలోను ఎన్‌డీఏ కూటమిదే విజయం అనే రీతిలో ఇంచుమించు అన్ని సర్వేలు వెల్లడి కావటం ఇందుకు కారణం. ఇక వైసీపీ నేతలు పోలింగ్ జరిగిన మరుసటి రోజు నుంచే డీలా పడిపోయారు. ఓటమిని వారు ముందుగానే గమనించటం మూలంగానే తమ అనుయాయులు ఎవరినీ కూడా వైసీపీ తరుపున పందేలు వేసేందుకు పురమాయించలేకపోయారు. అందువల్లే కూటమి తరపున పందేలు వేసేందుకు అనేక మంది ముందుకు రాగా వైసీపీకి అనుకూలంగా బెట్టింగ్ పెట్టేందుకు ఒకరో ఇద్దరో ముందుకు రావటం జరిగింది. అది కూడా కోసు పందేలకే పరిమితమయ్యారు. కూటమి అభ్యర్థులు రెండు రూపాయలు పెడితే వైసీపీ తరపున రూపాయి పందేలు ఎక్కువగా జరిగాయి. ఇక కౌంటింగ్ సమయం ఆసన్నం అవటంతో మరికొన్ని గంటల్లో తాము అధికారానికి దూరం కాబోతున్నామని ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఫలితాలను ముందుగా గ్రహించిన కొందరు ఉన్న తాధికారులు వైసీపీ నేతల ఫోన్లు ఎత్తటం మానేశారు. ఇప్పటివరకు సలాం కొట్టిన పోలీసులే లాఠీలు ఝళిపించేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి నెలకొంది.

అమరావతి భవితవ్యం తేలేది నేడే...

సీఎం జగన్ మూడు రాజధానుల పేరుతో అమరావతి వెలుగులను మసకబారేటట్లు చేసి ఆఖరికి భూములను త్యాగం చేసిన రైతులపై సైతం లాఠీలు ఝుళిపించే స్థాయికి వెళ్ళిన విషయం తెలిసిందే. నవ్యాంధ్ర ప్రదేశ్ తొలి సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న రాజధానిపై అక్కసుతో అమరావతి పేరునే చెరిపేయాలని ఈ ఐదేళ్ళుగా ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఒక వైపు చంద్రబాబు హయాంలో నిర్మితమైన అసెంబ్లీ భవనాన్ని, సచివాలయ భవనాలను వాడుకుంటూనే అమరావతిని కూల్చే ప్రయత్నం చేశాడు. దీని ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉంది. అందువల్లే ఈ ప్రాంత ప్రజలు ఎంతో కసితో ఓటు వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క సీటు కూడా వైసీపీ కి రాదనే అంచనా వేసి కొందరు ఆ పందేలు కూడా వేశారు. కొన్ని గంటల్లో వెలువడే ఫలితాలపైనే అమరావతి భవితవ్యం ఆధారపడి ఉంది. తిరిగి చంద్రబాబు సీఎం అయ్యే పక్షంలో మొదటగా ఆయన అమరావతిపైనే దృష్టి సారించనున్నారు. కేంద్రంలో కూడా ఎన్‌డీఏనే అధికారం లోకి వస్తుండటంతో తిరిగి అమరావతిపై ఆశలు అందరికి చిగురిస్తున్నాయి.

విధులు.. అప్రమత్తం

• గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

బాపట్ల, జూన్ 3: కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని గుంటూరు రేంజ్‌ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహించే సిబ్బంది లోపలికి వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. కౌంటింగ్ సెంటర్‌లోని ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్ ఆయనకు వివరించారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు నియమ నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో, పరిసర ప్రాంతాలలో చిన్న అవాంఛనీయ ఘటన కూడా జరగకూడదన్నారు. మొబైల్ డిపాజిట్ సెంటర్, మీడియా సెంటర్ పరిశీలించారు. కౌంటింగ్ సమాచారం మేరకు జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణ కొరకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లను సందర్శించి విధులు నిర్వహించే సిబ్బంది అత్యంత వేగంగా స్పందించాలని సున్నితమైన అంశాలను త్వరితగతిన అధికారులకు తెలపాలని సూచించారు. సూచిక బోర్డులు, గ్యాంగ్‌వేలను పరిశీలించి ఎస్పీ వకుల్ జిందాల్‌కు పలుసూచనలు చేశారు. తదుపరి స్ట్రాంగ్‌రూమ్‌లను అక్కడ గార్డులు విధులు నిర్వహిస్తున్న విధానాన్ని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించటానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశామని కౌంటింగ్‌లో పాల్గొనే అభ్యర్థులు, ఏజెంట్‌లు నియమనిబంధనలకు లోబడి పోలీసువారి సూచనలు పాటించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు వీధులలోకి రాకూడదని తమ నివాసాల వద్దనే సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజలు సంయమనంతో వ్యవహరించాలి : ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం బాపట్ల పట్టణం, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో 144వ సెక్షన్ కౌంటింగ్ ముగిసే వరకు అమలలో ఉంటుందని తెలిపారు. వ్యాపార సముదాయాలు, హోటళ్ళు, రెస్టారెంట్‌లు, దుకాణాలు తెరవటానికి అనుమతిలేదన్నారు. 5డ్రోన్‌లతో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 600మంది పోలీసులు, కేంద్ర బలగాలతో పటిష్టమైన మూడంచల భద్రత ఏర్పాటు చేశామన్నారు. 1500మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఎక్కడైన ఘర్షణలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించటానికి అనుమతిలేదన్నారు. నలుగురి కంటే ఎక్కువమంది గుంపులుగా తిరగరాదన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో సమర్థంగా విధులు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే వాహనాలు, అభ్యర్థులు, ఏజెంట్‌లను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. హింసాత్మక ఘటనలు, ఘర్షణలకు పాల్పడటానికి ఉపయోగించే ఆయుధాలు, వస్తువులు వంటివి ఉంటే వెంటనే సంబంధితాధికారులకు సమాచారం అందించి వాహనం సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, డీఎస్పీ సి.హెచ్. మురళీకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది సూచనలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

పటిష్టభద్రత మధ్య కౌంటింగ్‌కు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో పటిష్టభద్రత మధ్య ఓట్లలెక్కింపు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సోమవారం కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సీసీకెమెరాల నిఘా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగుసూచనలు చేశారు. ఓట్లలెక్కింపు కేంద్రాల ప్రక్రియ ముగిసేవరకు నిరంతరం నిఘా కొనసాగాలన్నారు. అధికారులు, సిబ్బందికి ఒక మార్గం, అభ్యర్థులు, వారి ఏజెంట్‌లు వెళ్ళటానికి మరో మార్గం ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రాలకు వెళ్ళే మార్గాల వద్ద దిక్సూచి బోర్డులను స్పష్టం ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. కేంద్రాలలో వీడియోగ్రఫి ఏర్పాటు చేసి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్వోలకు సూచించారు. కార్యక్రమంలో డిఆర్వో సి.హెచ్.సత్తిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరులో స్నేహితుల మధ్య ఘర్షణ

» యువకుడిపై బీరు సీసాతో మరో యువకుడు దాడి

మార్టూరు, జూన్ 3: స్నేహితుల మధ్య జరిగిన గొడవలో దొండపాటి కల్యాణ్ అనే యువకుడిని పఠాన్ మస్తాన్ అనే యువకుడు బీరు సీసాతో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన సోమవారం కొణిదెన రోడ్‌లో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగింది. ఈ దాడిలో తలవెనుక, గొంతు వద్ద, చేతులపై గాయాలుగా కాగా కల్యాణ్‌కు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సను అందించారు. ప్రభుత్వ ఉద్యోగిగా కల్యాణ్ పనిచేస్తున్నారు. ఈ దాడిపై సమాచారం అందడంతో ఆస్పత్రి వద్దకు చేరుకున్న సీఐ రాజశేఖర్ రెడ్డి బాధితుడిని పరిశీలించారు. అనంతరం కల్యాణ్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కల్యాణ్‌పై దాడి చేసిన మస్తాన్ పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కొంతమంది యువకులు జిగ్ ఆట ఆడుతున్నారు. వారిలో కల్యాణ్, మస్తాన్ కూడా ఉన్నారు. అయితే కల్యాణ్‌కు మస్తాన్‌కు గతంలోనే గొడవలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. ఈ విషయమై వాళ్లిద్దరూ స్టేషన్‌లో కేసులు కూడా పెట్టుకున్నారు. ఈ కేసులపై రాజీ విషయంపై వారిద్దరి మధ్యా తరచూ వాదనలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం అదే విషయంపై వారిద్దరి మధ్యా మాటామాటా పెరగడంతో కల్యాణ్‌పై మస్తాన్ దాడి చేసినట్లు భావిస్తున్నారు. దాడి జరిగిన అనంతరం కల్యాణ్ నడుచుకుంటూ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. దాడికి పాల్పడిన మస్తాన్ స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ మస్తాన్ చేతికి రక్తపు మరకలు అంటి ఉండడంతో పోలీసులు అతనికి వైద్యం చేయాలని భావించారు. అయితే యూరినల్స్‌కు వెళతానని చెప్పిన మస్తాన్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐలు సైదా, బాషా విచారణ చేస్తున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఈ దాడి విషయమై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొణిదెన రోడ్‌లో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు అక్రమ కార్యకలాపాలకు నిలయంగా మారింది. మందు బాబులుకు, పేకాట రాయుళ్లకు స్థావరంగా మారింది. గత కొంతకాలం నుంచి ఇక్కడ అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. గతంలోనూ చిన్న చిన్న గొడవలు జరిగిన దాఖలాలున్నాయి. ఈ గొడవలు పెరిగి ప్రస్తుతం దాడులు జరిగే స్థాయికి అక్రమ కార్యకలాపాలు పెరిగిపోయాయి. ఇకనైనా అధికారులు ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతి


మృతి చెందిన జింకలు

పంగులూరు, జూన్ 3: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు చుక్కల జింకలు మృతి చెందాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి భగవాన్ రాజుపాలెం సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ ఎదురుగా చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో కొండలు, దట్టంగా సుబాబుల్ తోటలు ఉండడంతో జింకలు తిరుగుతున్నట్లు రైతులు చెప్తున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని హైవే పెట్రోలింగ్ ఉద్యోగి వెంకట్రామయ్య ఘటన విషయమై ఒంగోలు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న వేటపాలెం అటవీ శాఖ సెక్షన్ అధికారి జాన్సన్ తన సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. అనంతరం చనిపోయిన జింకలను స్వాధీనం చేసుకుని ముప్పవరం పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ మల్లేశ్వరితో పోస్టుమార్టం నిర్వహించారు. చనిపోయిన జింకలకు మార్టూరు మండలం నాగరాజుపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుబాబుల్ తోటలు అధికంగా ఉండడంవల్లే జింకలు, దుప్పులు తిరుగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలెవరూ వీటికి ప్రాణహాని తలపెట్టవద్దని, వీటిని రక్షించాలని కోరారు. ఎవరైనా హాని తలపెడితే అటవీ హక్కుల చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాన్సన్ తెలిపారు.

ఒంగోలులో కర్ఫ్యూ వాతావరణం..!

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 3: ఎన్నికల ఘట్టం ముగింపు దశకు చేరుకుంది. మరి కొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. దీంతో అటు అధికార యంత్రాంగం, ఇటు పోలీసులు ఆంక్షలు కఠినతరం చేశారు. ఇప్పటికే మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయగా, అందుకు అనుగుణంగా మూడు రోజులపాటు మద్యం దుకాణాలు, రెస్టారెంట్‌లు, బార్‌లు, మద్యం మాల్స్ మూత వేశారు. ఇదిలా ఉంచితే ఆర్టీసీ బస్సులను సైతం రద్దు చేశారు. ప్రత్యేకించి, గ్రామీణ ప్రాంతాలకు పూర్తిగా పల్లెవెలుగు బస్సులను రద్దు చే యగా, దూర ప్రాంతాల ట్రిప్పులను 30 శాతం రద్దు చేశా రు. సోమవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఓట్ల లెక్కింపు క్రమంలో ఎలాంటి అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు ముం దస్తు చర్యల్లో భాగంగా అంతటా 144 సెక్షన్ విధించారు. ముఖ్యంగా ఒంగోలు పార్లమెంట్ పరిధిలో పార్లమెంట్‌తోపాటు, అన్నీ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తుండగా, అన్నీ నియోజకవర్గాల నుంచి ఆయా రాజకీయ పార్టీల ముఖ్య నేతలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. దీంతో ఇప్పటికే హోటల్స్, లాడ్జిలు, పలు గెస్ట్ హౌస్‌లు ఆయా రాజకీయ పార్టీల శ్రేణులతో నిండిపోయాయి. అయితే మంగళవారం జరిగే ఓట్ల లెక్కిం పు సందర్భంగా జరిగే ఘటనలపై పోలీసు యంత్రాంగం పూర్తిగా దృష్టి సారించింది. ముందుగానే నగరంలో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశారు. అలాగే సోమవారం మధ్యాహ్నం నుంచి టీ దుకాణాల నుంచి మెగా షాపింగ్ మాల్స్ వరకు, అలాగే, వివిధ వ్యాపార సంస్థలన్నీ మూసివేశారు. అలాగే అత్యవసర సేవలకు సంబంధించి మెడికల్, పెట్రోలు బంకులు మినహా మిగతా వ్యాపార సంస్థలన్నీ బంద్ అయ్యాయి. పార్కులను సైతం మూసి వేయడంతో కర్ఫ్యూ వాతావారణం నెలకొంది. కాగా నేడు వెలువడే ఫలితాలపై అంతటా ఉత్కంఠ నెలకొంది.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

» మొత్తం 15.87లక్షల ఓట్లు
» ఎనిమిది నియోజకవర్గాలు, ఒంగోలు పార్లమెంట్ స్థానం
» రైజ్ కాలేజీ వద్ద భారీ బందోబస్తు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 3 : జిల్లాలో హోరాహోరీగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, తదనంతరం ఈవీఎంల లెక్కింపును చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు ఒంగోలు పార్లమెంట్ స్థానానికి వేర్వేరుగా ఈ లెక్కింపు జరగనుంది. అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఆయా టేబుళ్ళ వద్ద ఓట్ల లెక్కింపు కోసం మంగళవారం ఉదయం 6 గంటలకు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని నియమించనున్నారు. జిల్లా యంత్రాంగంతోపాటు ఓట్ల లెక్కింపు కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక అబ్జర్వర్‌ను నియమించారు. మొత్తం 18,22,470 ఓట్లు ఉండగా గతనెల 13న జరిగిన పోలింగ్‌లో 15,87,681మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాల వారీగా లెక్కింపును చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు ఉంటుంది.

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 140మంది పోటీలో ఉండగా ఒంగోలు పార్లమెంట్ స్థానానికి 25మంది అభ్యర్థులు ఉన్నారు. ఇతర పార్టీలు రంగంలో ఉన్నా టీడీపీ కూటమి, వైసీపీ మధ్యనే నువ్వానేనా అన్నట్లు పోటీ ఉండటంతో ఓట్ల లెక్కింపుపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. మరో వైపు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కూడా మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. అదనుగుణంగా టేబుళ్లను కూడా ఏర్పాటుచేశారు.


రాజకీయ పార్టీల సమక్షంలో సర్వీసు ఓట్లను బ్యాలెట్ బాక్సులో వేస్తున్న అధికారులు

ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి డ్రైరన్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 3: మంగళవారం ఉదయం కౌంటింగ్ నేపథ్యంలో అధికారులు, సిబ్బందికి ఓట్ల లెక్కింపు ఏలా చేపట్టాలో డ్రైరన్‌ను కలెక్టర్ నిర్వహించారు. ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు తర్వాత పార్టీల వారీగా ఏ విధంగా నమోదు చేయాలని, ఏలా కంప్యూటరీకరణ చేయాలని తదితర అంశాలను వివరించారు. ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం జరగనున్న ఓట్ల లెక్కింపు పరిశీలనను నియోజకవర్గాల అబ్జర్వర్లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు కేంద్రాలతో పాటు ప్రధాన ద్వారం నుంచి సిబ్బంది లోపలికి పంపే సమయంలో పోలీసులు చెక్‌ను పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపు కేంద్రాలను నియోజకవర్గాల వారీగా పరిశీలించి పలు సూచనలు చేశారు. మరోవైపు అబ్జర్వర్లు కూడా ఏర్పాట్లను పరిశీలించి ఆర్వోలకు పలు సూచనలు చేశారు.


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రైజ్ కాలేజీకి తరలించిన సర్వీసు ఓట్లు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 3 : కేంద్ర సర్వీసుల్లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి సంబంధించి 3,495 సర్వీసు ఓట్లు జిల్లాకు చేరాయి. గత పక్షం రోజుల నుంచి వచ్చిన సర్వీసు ఓట్లన్నింటిని రాజకీయ పార్టీల వారి సమక్షంలో ప్రత్యేక బాక్సుల్లో పెట్టి ఓట్ల లెక్కింపు జరగనున్న రైజ్ ఇంజనీరింగ్ కళాశాలకు సోమవారం ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఓటింగ్ ఒంగోలు పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాలో 6,693 సర్వీసు ఓట్లు ఉండగా సోమవారం నాటికి 3,495 వచ్చాయన్నారు. మంగళవారం ఉదయం 8గంటలలోపు వచ్చే సర్వీసు ఓట్లన్నింటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఆ ఓట్లను కూడా కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. కాగా సర్వీసు ఓట్లను సీసీ కెమెరా, ప్రభుత్వ వీడియో సమక్షంలో పార్టీల ప్రతినిధులకు చూపించి పోస్టల్ బ్యాలెట్ బాక్సులో వేసి సీల్ వేసిన అనంతరం ప్రత్యేక వాహనంలో తరలించారు.

ఉపశమనం

» పలకరించిన తొలకరి » పలు ప్రాంతాల్లో జల్లులు
» తగ్గిన ఉష్ణోగ్రతలు, చల్లబడ్డ వాతావరణం
» తొలకరి సాగుకు సానుకూలం


రోడ్డుపై ప్రవహిస్తున్ననీరు

ఒంగోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. తీవ్రమైన ఎండలు, అంతకు మించి ఉక్కపోతతో అల్లాడిన ప్రజానీకానికి ఎట్టకేలకు ఉపశమనం లభించింది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున జల్లులు పడ్డాయి. కొన్నిచోట్ల ఒక మోస్తరు వర్షమే కురిసింది. రాష్ట్రంలోకి మూడు రోజుల ముందే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతోపాటు దక్షిణ కోస్తా ప్రాంతంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనంతో తొలకరి జల్లులు పడ్డాయి. దీంతో మూడు నెలలుగా ఎండల తీవ్రతతో తల్లడిల్లుడుతున్న ప్రజానీకానికి ఊరటతోపాటు తొలకరి సాగుకు కూడా సానుకూల పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాలలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున జల్లులు పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సోమవారం ఉదయం 9గంటలకు గడిచిన 24 గంటల్లో సగటున 11.40 మి.మీ వర్షపాతం నమోదైంది.

పశ్చిమ ప్రాంతంలో ఒక మోస్తరు నుంచి భారీవర్షమే కురిసింది. గరిష్ఠంగా త్రిపురాంతకం మండలంలో 75.6మి.మీ నమోదు కాగా పుల్లలచెరువు 60.0, కురిచేడులో 46.4, కంభంలో 36.8, తర్లుపాడులో 31.2, బేస్తవారపేటలో 29.4, మార్కాపురంలో 24.0, పెద్దారవీడులో 18.6, దోర్నాలలో 12.8, గిద్దలూరులో 12.8, హెచ్ఎం పాడులో 12.2, నాగులుప్పలపాడులో 11.6 నమోదైంది. ఇతర మండలాల్లో జల్లులు పడ్డాయి. తాజా జల్లులతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. మరో రెండు, మూడు రోజులు వాతావరణం ఇలాగే చల్లబడి ఉండటంతోపాటు జల్లులు పడే అవకాశం కనిపిస్తున్నది. కాగా ప్రస్తుతం జల్లులు పడటం తొలకరి సాగుకు ఉపకరించనున్నాయి. గత నెల మూడవ వారంలో ఒక మోస్తరు జల్లులు జిల్లాలో పడగా తొలకరి పంటల సాగు కోసం పలుప్రాంతాల రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. అలాంటి ప్రాంతాల్లో తాజాగా కురిసిన వర్షంతో విత్తనాలు వేసే అవకాశం ఉంది జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు లక్షా 76వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. అందులో తొలకరి పంటలుగా పిలిచే నువ్వు, పెసర, సజ్జ వంటి మూడు నెలల పంటలు అలాగే పశుగ్రాస పంటలతోపాటు పిల్లిపెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు పైర్లను తక్షణం సాగే చేసే అవకాశం కనిపిస్తోంది.

22 రౌండ్లలో కౌంటింగ్

అద్దంకి, జూన్ 3 : అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 298 పోలింగ్ బూత్‌లు ఉండగా, మంగళవారం బాపట్లలో జరిగే కౌంటింగ్‌లో 22 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ ఓట్లు లెక్కింపు ప్రారంభం కానుంది. పోస్టల్ లెక్కింపు ఒక వైపు కొనసాగిస్తూనే 8-30 నుంచి ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. సంతమాగులూరు మండలం వెల్లలచెరువు నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. సంతమాగులూరు మండలం 60 పోలింగ్ స్టేషన్‌లు, 61 నుంచి 116 పోలింగ్ స్టేషన్ వరకు బల్లికురవ మండలం, 117 నుంచి 205 బూత్‌లవరకు అద్దంకి రూరల్,అద్దంకి పట్టణం, 206 నుంచి 254, జె.పంగులూరు మండలం, 255 నుంచి 298, కొరిశపాడు మండలంలోని పోలింగ్ స్టేషన్ ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఒక్కో రౌండుకు 14 టేబుళ్ల చొప్పున 21 రౌండ్లలో 294 పోలింగ్ స్టేషన్‌ల ఈవీఎంలలో ఓట్లు, మిగిలిన 4 ఈవీఎంలలో ఓట్లు 22వ రౌండ్‌లో లెక్కించనున్నారు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉండగా, అందులో 1,19,570 మంది పురుషులు, 1,24,475 మంది మహిళలు, 12 మంది ఇతరులు ఉన్నారు. వీరిలో 1,05,718 మంది పురుషులు, 1,09,654 మంది పురుషులు, ముగ్గురు ఇతరులు మొత్తం 2,15,375 మంది మే 13న జరిగిన పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అద్దంకి నియోజకవర్గంలో సోమవారం ఉదయం వరకు అద్దంకిలోని పెసిలిటేషన్ సెంటర్‌లో 2744 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 699 మంది ఇతర జిల్లాలకు చెందిన వారు కాగా, 1807 మంది ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 196 మంది వృద్ధులు, దివ్యాంగులు ఇళ్ల వద్ద ఓటు హక్కు హక్కును వినియోగించుకున్నారు. మరో 42 మంది సర్వీస్ ఓటర్లు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల బ్యాక్స్‌లను సోమవారం ఉదయం అద్దంకి నుంచి కౌంటింగ్ జరిగే బాపట్లకు బందోబస్తు మధ్య తరలించారు. ఈవీఎంల ద్వారా, పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా మొత్తం 2,18,119 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 89.4 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఒంగోలు సబ్ డివిజన్‌లో 144 సెక్షన్

ఒంగోలు(క్రైం), జూన్3: ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్నీ పోలీసు స్టేషన్ పరిధిలో ఇప్పటికే 30 పోలీసు చట్టం అమలులో ఉందని , కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ విధించినట్లు ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. అదే విధంగా కౌంటింగ్ జరిగే మంగళవారం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారని అన్నారు. సోమవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వ్యాపార సంస్థలు, దుకాణాలు మూసివేయాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం నిషేధించినట్లు తెలిపారు.

కూటమి కట్టి...ధరలు తగ్గించి..

» దిగజారిన పొగాకు ధరలు
» ఒక్కరోజులోనే కిలోకు రూ.28 తగ్గుదల
» పలు వేలంకేంద్రాల్లో రైతులు నిరసన
» ఆగి సాగిన వేలం, నేడు కొనుగోళ్లకు సెలవు

ఒంగోలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో ధరలు పతనమయ్యాయి. ఒక్కరోజులోనే కిలో గరిష్ఠ ధరను ఏకంగా రూ.28 మేర తగ్గిపోయింది. శనివారం మార్కెట్లో గరిష్ఠ ధర కిలో రూ.360 పలుకగా సాయంత్రం అది కూడా రూ.332కు దిగజారింది. పొగాకు వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందన్న పరిస్థితి మరోసారి ఇలా రుజువైంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి పొగాకు ధరలు పెరుగుతూనే ఉన్న విషయం విదితమే. గతనెల రెండవ పక్షంలో మరింతగా పెరిగి పైపైకి ధరలు చేరాయి. ఈ క్రమంలో ఈనెల 1న మార్కెట్లో రికార్డు స్థాయి ధరలు లభించాయి పొగాకు బోర్డు చరిత్రలో ఆల్‌టైం రికార్డ్‌గా ఒంగోలు-1 కేంద్రంలో గరిష్ఠ ధర కిలో రూ.360 లభించగా ఇతర కేంద్రాల్లోనూ రూ.350పైనే ఉన్నాయి. అంతేకాక మేలురకం బేళ్ల కోసం వ్యాపారులు పోటీ పడ్డారు. అయితే ఒక్కరోజు గడిచి సోమవారం నాటికి ఆ ధరలు గణనీయంగా తగ్గి పోయాయి. అక్కడి ధరలు తమకు ఎందుకు ఇవ్వరని ఉత్తరాది ప్రాంత రైతులు నుంచి వస్తున్న వత్తిడితోపాటు దక్షిణాదిలో ఇలాగే ధరలు పెరుగుతూ పోతే భవిష్యత్‌లో మార్కెట్ ఏ స్థాయికి పోతుందన్న ఆందోళన చెందిన వ్యాపారులు తగ్గించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

ఇదే అంశంగా ఆదివారం గుంటూరులో భారత పొగాకు వ్యాపారుల సంఘం(ఐటీఏ) ప్రతినిధులు సమావేశమై చర్చించుకొని అంతిమంగా ధరలు తగ్గించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఆ ప్రభావం సోమవారం దక్షిణాది పొగాకు మార్కెట్‌పై కనిపించింది. గరిష్ఠ ధరలను కిలో రూ.330కే పరిమితం చేయాలని భావించిన వ్యాపారులు ఆ ప్రకారమే సోమవారం వేలం ఆరంభం నుంచే వ్యవహరించారు. దీంతో అంతకు ముందు పోటీపడి ధరలు పెంచి కొనుగోలు చేసిన డీలర్లు, మధ్యస్థాయి వ్యాపారుల కొనుగోళ్లు తగ్గిపోయాయి. అదేసమయంలో ప్రధాన కంపెనీల అయిన ఐటీసీ. జీపీఐతోపాటు పలువురు ఎక్స్‌పోర్టర్లు గతం కన్నా ఎక్కువ బేళ్లను కొనుగోలు చేశారు. తద్వారా మార్కెట్లో వ్యాపారులు సిండికేట్ అయి కొంటున్న తీరు స్పష్టంగా అర్థమవుతోందని రైతు ప్రతినిధులు ఆరోపిస్తున్నారు డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరుగుదల పొగాకు మార్కెట్లో సర్వసాధారణం. అలాగే నిన్న మొన్నటివరకు ధరలు పెరిగాయి. అయితే ధరలు పెంచుకుంటూ పోయిన వ్యాపారులు డిమాండ్ ఉన్నా కూటమి కట్టి ఒక్కసారిగా తగ్గించి వేశారని రైతులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో వేలంకేంద్రాలను నిలిపివేస్తున్నారు. బుధవారం మార్కెట్‌లో భవిష్యత్ ధరలపై స్పష్టత రానుంది.


వేలంలో పాల్గొన్న వ్యాపారులు

తేలనున్న భవితవ్యం

» కౌంటింగ్ కోసం సర్వం సిద్ధం
» భారీ బెట్టింగ్‌లతో అభ్యర్థుల విజయాలపై పెరిగిన ఆసక్తి
» ఒంగోలు ఫలితంపై మరింత ఉత్కంఠ
» స్థానాలు మారిన మంత్రులకు గట్టిపోటీ
» దర్శి నియోజకవర్గంపై అందరి దృష్టి

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం మరికొద్దిసేపట్లో సేపట్లో తేలిపోనుంది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుండగా, 11 గంటల సమయానికే ఏపార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయో వెల్లడికాబోతోంది. ఒకట్రెండు నియోజకవర్గాలు మినహా మధ్యాహ్నం ఒంటిగంట సమయానికే ప్రధాన పార్టీల అభ్యర్థులలో ఎవరు విజయం వైపు దూసుకుపోతున్నది, ఎవరు వెనకబడింది అనే అంశంపై కూడా స్పష్టత రానుంది. గతనెల 13న పోలింగ్ జరగ్గా ఓట్ల లెక్కింపు మంగళవారం జరుగుతుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ఏజెంట్లతో అధికార యంత్రాంగం మాక్ కౌంటింగ్ నిర్వహించుకుని, అసలు సిసలు కార్యక్రమానికి సిద్ధమైంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రకాశం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, లోక్‌సభ అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఒంగోలులో జరుగనుంది. అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ బాపట్లలోను, కందుకూరు ఓట్ల లెక్కింపు నెల్లూరులోనూ ఉంటుంది. దూరప్రాంత నియోజకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్లు ఓట్ల లెక్కింపు జరిగే పట్టణాలకు ఇప్పటికే చేరారు. వారి రాకతో లాడ్జిలు, హోటళ్ల కిటకిటలాడుతున్నాయి.

భారీ బెట్టింగ్‌ల మధ్య..

రాష్ట్రస్థాయిలో టీడీపీ కూటమికి అనుకూలంగా బెట్టింగ్‌లు ఎక్కువ జరిగాయి. జిల్లా స్థాయిలో ఈ పర్యాయం ఏ పార్టీకి మెజారిటీ స్థానాలు వస్తాయన్న అంశంపైనే పందేలు జరిగాయి. అద్దంకి, పర్చూరులో టీడీపీ అభ్యర్థులకు వచ్చే ఆధిక్యంపైనే ఎక్కువ బెట్టింగ్‌లు జరిగాయి. మిగిలిన స్థానాల్లో గెలుపోటములపైనే పందేలు సాగాయి. దర్శి, చీరాల, మార్కాపురం, కందుకూరు నియోజకవర్గాల్లోనే అసెంబ్లీ అభ్యర్థుల గెలుపోటములపై ఎక్కువ బెట్టింగ్ జరిగింది. ఎగ్జిట్ పోల్స్ వివరాలు వెల్లడి తర్వాత ఆరా సంస్థ అంచనాలకు అనుగుణంగా వైసీపీకి మద్దతుగా బెట్టింగ్‌లు కొంత పుంజుకున్నాయి. అయితే సోమవారం ఉదయం నుంచి అవి తగ్గి తిరిగి టీడీపీ కూటమి విజయానికి అనుకూలమైన పందేలు పెరిగాయి.

దామచర్ల వర్సెస్ బాలినేని...

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్, వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య పోటీని ప్రజానీకం ప్రతిష్ఠాత్మకంగా పరిగణించారు. బాలినేని గత ఎన్నికల్లో 5వసారి గెలుపొందారు. 2012లో తొలిసారి ఓడిపోయిన జనార్దన్ 2014లో గెలుపొంది, గత ఎన్నికల్లో ఓటమిచవి చూశారు. రెండోసారి గెలుపొందేందుకు తహతహలాడుతున్నారు. కీలకంగా భావించిన ఈ నియోజకవర్గంలో గెలుపుపై ఇద్దరు అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. కానీ దామచర్ల జనార్దన్ వైపే గెలుపు మొగ్గు కనిపిస్తోంది. జనార్దన్ గెలిచి టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీ, పాలనాపరంగా ఆయనకు మంచి గుర్తింపు లభించే అవకాశం ఉంది.

ఇద్దరు మంత్రులకు అగ్ని పరీక్షే...

అధినేత ఆదేశాలతో నియోజకవర్గాలు మారి పోటీ చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్ కొండపిలో, మరో మంత్రి నాగార్జున సంతనూతలపాడులో కూటమి నుంచి గట్టిపోటీ ఎదుర్కొన్నారు. కొండపిలో సురేష్‌పై పోటీ చేసిన కూటమి అభ్యర్థి స్వామికి గెలిస్తే ప్రాధాన్యం లభించడం ఎలా ఉన్నా, ఇటు పార్టీలోనూ, అటు నియోజకవర్గంలోనూ అన్నీ తానై వ్యవహరిస్తున్న టీడీపీ నాయకుడు దామచర్ల సత్యకు మంచి ప్రాధాన్యాన్ని అధిష్ఠానం ఇచ్చే అవకాశం ఉంది.

కనిగిరి, దర్శి..

కనిగిరిలో 2009లో గెలుపొందిన డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రస్తుతం కూటమి అభ్యర్థిగా రెండోసారి విజయాన్ని అందుకునే దిశగా కనిపిస్తున్నారు. ఆయనపై పోటీ చేసిన వైసీపీ అభ్యర్థి నారాయణ యాదవ్ తొలిసారి అవకాశం కోసం ఆశపడుతున్నారు. దర్శిలో వైసీపీలో మరో కీలక నాయకుడైన బూచేపల్లి శివప్రసాదరెడ్డి అనూహ్యంగా గట్టి పోటీని ఎదుర్కొన్నారు. తొలిసారి రంగంలోకి వచ్చిన కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నిరకాలుగా దూసుకుపోయారు. దీంతో లక్ష్మిదే విజయం అని కూడా సర్వేలు సూచించడంతో దర్శి ఫలితంపై ఆసక్తి పెరిగింది.

పశ్చిమంలోనూ గట్టి ఫైట్

అధికార వైసీపీకి కంచుకోటలాంటి మార్కాపురం డివిజన్‌లో అభ్యర్థుల మార్పు ద్వారా విజయాన్ని సాధించాలని జగన్ వేసిన వ్యూహం ఎంతమేరకు ఫలిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. గిద్దలూరు, మార్కాపురం నుంచి కూటమి అభ్యర్థులు అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి విజయంపై నమ్మకంతో ఉండగా వైసీపీ అభ్యర్థులు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు అదే ధీమాతో ఉన్నారు. ఎర్రగొండపాలెంలో తొలిసారి ఎన్నికల బరిలో దిగిన ఎరిక్షన్‌బాబు, చంద్రశేఖర్‌లు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ మూడింటిలో వైసీపీ ఒకటి గెలుస్తుందా? లేక రెండోది కూడా గెలుస్తుందా? అనేదే ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.


రైజ్ కళాశాలలోని ఓ కేంద్రంలో కౌంటింగ్ కోసం ఏర్పాటుచేసిన టేబుళ్లు

గొట్టిపాటి, ఏలూరి విజయం లాంఛనమే

అద్దంకి, పర్చూరుల్లో కూటమి అభ్యర్థులు రవికుమార్, సాంబశివరావుల విజయం లాంఛనమేనని భావిస్తున్నారు. ఈ పర్యాయం గెలిస్తే రవికుమార్ వరుసగా ఐదుసార్లు గెలిచిన ఎమ్మెల్యేగా గుర్తింపు పొందుతారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి దక్కే అవకాశాలు కూడా లేకపోలేదు. గత ఎన్నికల్లోనే పర్చూరులో సంచలన విజయం సాధించిన కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఈ విజయంతో హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకోబోతున్నారు.

చీరాలపై పలు ఊహాగానాలు...

త్రిముఖ పోటీ మధ్య చీరాలలో టీడీపీ కూటమి అభ్యర్థి విజయానికి అవకాశాలు మెరుగుపడ్డాయని ఒక అంచనా. అయితే ఎమ్మెల్యే కరణం బలరాం కుమారుడు వెంకటేష్ విజయావకాశాలపై వైసీపీ నాయకులు పూర్తి ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ విజయం ద్వారా రాష్ట్రంలో రెండు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతోందని, ఆ పార్టీ ప్రకటించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీ అభ్యర్థి కొండయ్య బలహీనవర్గాలకు చెందిన నాయకుడు కావడం కూడా ఆపార్టీకి కలిసివచ్చింది.

బిల్లుల మోత.. అప్రకటిత విద్యుత్ కోత..!

- రాత్రింబవళ్లు ఇష్టారీతిగా కరెంట్ కట్
- గతంలో మునిసిపాలిటీ నిధుల నుంచి ముందస్తుగా రూ.9కోట్లు అప్పగింత
- అయినా తప్పని సమస్య
- పల్లెలను పట్టించుకునే నాథుడే లేరు
- అవస్థలు పడుతున్న ప్రజలు



చీరాలటౌన్, జూన్ 3 : విద్యుత్ బిల్లులు మోత మోగిస్తూనే, అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ విద్యుత్ అధికారులు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒకవైపు భయానకంగా ఎండలు మండుతున్నాయి. దీంతో నివాసాలు ఉక్కపోతగా మారాయి. ఈక్రమంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు వేడిగాలులకు అల్లాడుతున్నారు. మరోవైపు కరెంట్ రిలీఫ్ పేరుతో విద్యుత్ సరఫరాలు అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారు. వర్షం కురుస్తుందన్నా లేక గాలి వీస్తుందన్నా అంతకంటే ముందే సరఫరా ఆపుతున్నారు. అంతేకాకుండా లైన్ క్లియరెన్స్ పనులంటూ గంటలకొద్దీ అంధకారాల్లోకి తోస్తున్నారు. నోటితో మాత్రం 24 గంటలు నిరంతర సరఫరా అంటూ, సాంకేతిక లోపాలను ఉదహరిస్తు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎడాపెడా కోతలు విధిస్తు ప్రజలను వేధిస్తున్నారు. అంతేకాకుండా పెరిగిన చార్జీలు కారణంగా ఇళ్లల్లో వాడకం తగ్గించినా విద్యుత్ బిల్లుల్లో ట్రూ అప్ చార్జీలు, ఇంధన కొనుగోలు చార్జీలు అంటూ వినియోగదారునికి అదనపు వాతలు పెడుతున్నారు. ఈనేపథ్యంలో ఇంట్లో ఫ్యాన్ తిరగక, బయట ఎండకు తట్టుకోలేక సామాన్యులు బతుకు జీవుడా అంటున్నారు. ఇదిలావుంటే గతంలో మునిసిపల్ నిధుల నుంచి అప్పటి అధికారులు, పాలకులు విద్యుత్ సమస్యలు నియంత్రించేందుకుగాను మునిసిపాలిటీ నిధుల నుంచి ముందస్తుగా రూ. 9కోట్లు నిధులు విద్యుత్ అధికారులకు అప్పగించారు. వీటిపై అధికారులు కూడా చాలాచోట్ల విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చారు. మరమ్మతులు చేశారు. అయినా కోతలు తప్పకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలో అనేక ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు ఉన్నాయి. అయితే అప్రకటిత కోతలు కారణంగా హాస్పిటల్స్‌లో అసౌకర్యం ఏర్పడుతుంది. మరోవైపు ఎన్నికల కోడ్ ఉన్నందున పెట్రోల్ బంకుల్లో డబ్బాలలో డీజిల్ పోయడం లేదు. దీంతో హాస్పిటల్స్‌లో ఏదైనా అత్యవసర శస్త్ర చికిత్స సమయంలో విద్యుత్ అంతరాయం కలిగితే ప్రాణాపాయ పరిస్థితులు ఉన్నాయి.

చీరాల డివిజన్ పరిధిలోని పర్చూరు, చీరాల పరిధిలో అన్ని కేటగిరీలు కలుపుకుని సుమారు 1,62000 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. దీంతో రోజుకు 1 మిలియన్ యూనిట్‌ల విద్యుత్ వాడకం జరుగుతుంది. ఎండలు మండుతున్నా ఈ మధ్య కురిసిన వర్షాలు కారణంగా వాతావరణం అప్పుడప్పుడు చల్లబడింది. ఆ సమయంలో కొన్నిసార్లు విద్యుత్ డిమాండ్ తగ్గిందనే చెప్పాలి. అయినా కూడా చీరాల పట్టణంలోని సుమారు 10 వార్డులకు పైగా, వేటపాలెం, కొత్తపేట, చీరాల రూరల్ పరిధిలో ఈపూరుపాలెం, తోటవారిపాలెం, కావూరివారి పాలెం, వాడరేవు, దేవినూతల, బుర్లవారి పాలెం, ప ర్చూరు పరిధిలో పర్చూరు, కారంచేడు, కేశవరప్పాడు వంటి ప్రాంతాలలో గం టల కొద్దీ రాత్రింబవళ్లు విద్యుత్ అప్రకటిత కోతలు విధిస్తున్నారు. ఈనేపథ్యం లో వాటిపైనే ఆధారపడి జీవించేవారి పరిస్థితి దయనీయంగా మారింది. ఈక్రమంలో చేనేత కార్మికులకు మగ్గం సాగడం లేదు. రైతులకు సాగునీరు అం దడం లేదు. అధికారులు సమస్యలు పట్టించుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బిల్లులు తగ్గేదేలే

సాధారణంగా విద్యుత్ అప్రకటిత కోతలు, అంతరాయం వలన వినియోగం తగ్గుతోంది. ఈ క్రమంలో బిల్లులు తక్కువగా రావాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి కనిపించడం లేదు. వినియోగ ధరలు కంటే అదనపు సుంకాలే మోత మోగుతున్నాయి. విద్యుత్ కొనుగోలు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ), ట్రూ అప్ పేరుతో యూనిట్‌కు అదనంగా 21 పైసల నుంచి గరిష్ఠంగా 45 పైసలు వరకు వసూలు చేస్తున్నారు. ఈవిధంగా చూసుకుంటే విద్యుత్ ఆదాయం దండిగానే ఉంది. అయినా సరఫరా మెరుగు పరచక పోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తుండమే కాకుండా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోతలు ఉండవు..సరఫరా సక్రమంగా అందిస్తాం

ఇకపై విద్యుత్ కోతలు ఉండవు. ఎక్కడా కూడా కోతలు అమలు చేయడం లేదు. వర్షాలు, గాలులు సమయంలో సాంకేతిక లోపం సహజం. వాటిని వెం టనే పరిష్కరిస్తున్నాము. వ్యవసాయ విద్యుత్ సరఫరాలకు అంతరాయాలు లేవు. ఈ మధ్య కాలంలో కొన్నిచోట్ల విద్యుత్‌కు అంతరాయం జరిగింది. ఆ సమస్యను కూడా పరిష్కరించాం. వినియోగదారులకు ఇబ్బందులు ఉండవు. కాల పరిమితి ముగిసిన సర్వీసు వైర్లతో ప్రమాదం. అలాగే తడిచిన విద్యుత్ మోటార్లకు దూరంగా ఉండాలి.

- థామస్, చీరాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



మహేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన గొట్టిపాటి

అద్దంకి, జూన్ 3 : మండలంలోని గోపాలపురం మాజీ సర్పంచ్ యర్రా మహేష్ కిడ్నీ మార్పిడి చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం మహేష్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. టీడీపీ నేతలు కరి పరమేష్, యర్రా రాఘయ్య శ్రీనివాసరావు ఆయన వెంట ఉన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చీరాలటౌన్, మే 3 : ఇంటి పరిసర ప్రాంతాలల్లో నీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా చూడడం వలన తద్వారా వచ్చే వ్యాధులకు ప్రజలు దూరంగా ఉండవచ్చని వైద్యాధికారులు శిరిషా, ప్రణయ్‌కుమార్ అన్నారు. సోమవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా చీరాల పట్టణంలోని మరియంపేట, వైకుంఠపురం పట్టణ ఆ రోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా అ వగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యధికారులు మాట్లాడుతూ రాబోయే రోజులలో వర్షాల వలన మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ఎక్కువగా వస్తాయని, వాటి నుంచి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో చీరాల పట్టణ మలేరియా అధికారి చింతా శేషుబాబు, సూపర్‌వైజర్ బీబెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, పట్టణ ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.

పాఠశాలలోకి వర్షం నీరు



స్వర్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారీగా చేరిన వర్షపు నీరు

స్వర్ణ(పర్చూరు), జూన్ 3 : ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోకి భారీగా నీరు చేరింది. గ్రామంలోని ప్రధాన కాలనీలోకి నీరు చేరడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతోపాటు గాలి దుమారం కూడా తోడు కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీటితో కలసి మురుగు నీరు రోడ్డుపై చేరడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

దుకాణాలను మూసి వేయించిన పోలీసులు



దుకాణాలను మూసి వేయిస్తున్న సీఐ నరసింహారావు, ఎస్ఐ

బల్లికురవ. జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాలలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు హెచ్చరించారు. సోమవారం రాత్రి బల్లికురవ మండల కేంద్రంలో దుకాణాలను సీఐ మూసివేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతు గ్రామాలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు చెప్పారు. ఎవరూ ఇళ్ల నుంచి నుంచి బయటకు రావద్దని, ఒక చోట గుంపులుగా ఉండవద్దని సూచించారు. అత్యవసరమైతేనే ప్రయాణం చేయాలన్నారు. కౌంటింగ్ అనంతరం రాజకీయ పార్టీలకు మద్దతుగా వీధుల్లో వచ్చి కేకలు, ఈలలు వేయడం, బాణసంచా కాల్చడం చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆయనతోపాటు ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి, రైటర్ అంజనేయులు ఉన్నారు.

మొదలైన కౌంటింగ్ టెన్షన్


- నాడు అన్ని మండలాల్లోనూ టీడీపీకి మెజార్టీ
- అప్పటి, ఇప్పటి ఎన్నికల సరళిపై అంచనాలు



కౌంటింగ్ కోసం సిద్ధం చేసిన టేబుళ్లు

అద్దంకి, జూన్ 3 : గత సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ గాలి వీచినా అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాలలోనూ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆధిక్యతను సాధించారు. అత్యధికంగా పంగులూరు మండలంలో 3,330 ఓట్ల మెజార్టీ రాగా, అత్యల్పంగా బల్లికురవ మండలంలో 589 మెజార్టీ వచ్చింది. 2019 ఎన్నికలలో మండలాలవారీగా పరిశీలిస్తే సంతమాగులూరు మండలంలో 13 గ్రామాలలో టీడీపీకి, 7 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. సంతమాగులూరు మండలం మొత్తం పరిగణలోకి తీసుకుంటే టీడీపీకి 2611 ఓట్ల మెజార్టీ వచ్చింది. బల్లికురవ మండలంలో 13 గ్రామాలలో టీడీపీకి, 9 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. బల్లికురవ మండలం మొత్తమ్మీద టీడీపీకి 589 ఓట్లు మెజార్టీ వచ్చింది. అద్దంకి రూరల్ మండలంలో 16 గ్రామాలలో టీడీపీకి, 11 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. అద్దంకి రూరల్ మండలం మొత్తమ్మీద టీడీపీకి 2330 ఓట్లు మెజార్టీ వచ్చింది. అద్దంకి పట్టణంలో 1053 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. పంగులూరు మండలంలో 16 గ్రామాలలో టీడీపీకి, 5 గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. పంగులూరు మండలం మొత్తమ్మీద 3,330 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. కొరిశపాడు మండలంలో 12 గ్రామాలలో టీడీపీకి, మూడు గ్రామాలలో వైసీపీకి మెజార్టీ వచ్చింది. కొరిశపాడు మండలం మొత్తమ్మీద 2788 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చింది. పోస్టల్ ఓట్లలో కూడా టీడీపీకి మెజార్టీ వచ్చింది. నియోజకవర్గం మొత్తమ్మీద 12,747 ఓట్లు టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ మెజార్టీ సాధించారు. అప్పటి మండలాల మెజార్టీ ఆధారంగా ప్రస్తుతం ఆయా గ్రామాలలో జరిగిన ఓటింగ్ సరళిని బట్టి ఇరు పార్టీల నేతలు మెజార్టీలపై లెక్కలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే టీడీపీకి 12 నుంచి 15 వేల వరకు మెజార్టీపై, అన్ని మండలాలలో టీడీపీ మెజార్టీ సాధిస్తుందని బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున సాగాయి. మంగళవారం మధ్యాహ్నానికి దాదాపుగా ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉండడంతో బెట్టింగ్ రాయుళ్లలో టెన్షన్ మొదలైంది.

భారీ వర్షానికి ఉప్పుమడులు మునక





ఉప్పు కొఠారులలో నిలిచిన వర్షపు నీరు.. వర్షానికి కరిగిన ఉప్పు కువ్వలు

లబోదిబోమంటున్న రైతులు

చినగంజాం, జూన్ 3 : చినగంజాం మండలంలో ఆదివారం అర్థరాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో సాగు చేస్తున్న ఉప్పు మడులు నీట మునిగాయి. ఏప్రిల్, మేలో అధికంగా ఎండలు ఉండడంతో ఉప్పు దిగుబడి అధికంగా వస్తుంది. ఉప్పు దిగుబడి బాగా వచ్చే మేలో రెండు పర్యాయాలు అకాల వర్షాలు కురవడంతో ఉప్పు ఈ ఏడాది సక్రమంగా రాలేదు. ఉప్పు రైతులు ఉప్పు పంటకు వర్షం వలన విఘాతం కలిగిందని ఆవేదన చెందుతున్నారు. ఉప్పు నిల్వలు కూడా సక్రమంగా లేనప్పటికీ ధరలు అంతంత మాత్రంగానే ఉండడంలో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటిలో ఉప్పు వచ్చే అవకాశం లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. జూన్‌లో రుతుపవనాలు రావడంతో ఇకనుంచి చెదురుమదురు వర్షాలు కురుస్తూనే ఉంటాయని, దానివల్ల ఉప్పు కొఠారులు సాగు చేయడం కష్టమేనని రైతులు అంటున్నారు. మండల పరిధిలోని అడవీధిపాలెం, సోపిరాల, చినగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, పెదగంజాం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూములలో సుమారు మూడువేల ఎకరాలలో ఉప్పు పంటను రైతులు సాగు చేస్తున్నారు. తాజాగా కురిసిన వర్షానికి సుమారు రెండువేల ఎకరాలలో తీత తీయాల్సిన ఉప్పు, ఎక్కాలపై ఉంచిన ఉప్పు కరిగిపోయిందని రైతులు విలపిస్తున్నారు. గట్లపై నిల్వ ఉంచిన ఉప్పు కువ్వలు కూడా కరిగిపోయాయని రైతులు తెలిపారు. ఎకరం భూమిలో తీత తీయవలసిన 25 బస్తాల ఉప్పు వర్షానికి పోయిందని తెలిపారు. ప్రస్తుతం క్వింటా ఉప్పు బస్తా ధర నాణ్యతను బట్టి రూ.250 నుంచి రూ.300 వరకు ఉంది. నష్టాలలో ఉన్న ఉప్పు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ రమేష్

పర్చూరు, జూన్ 3 : నిబంధనలు అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎస్.రమేష్ అన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎన్నికల గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అమలు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక పోలీస్ నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యాపార దుకాణాలు సైతం సంపూర్ణంగా మూనివేయాలన్నారు. బాణ సంచా కాల్చటం, వీధల వెంట సంబరాలు చేసుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చకొట్టే ప్రకటనలు చేయటం నిషేధమన్నారు. దీన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరించాలన్నారు.

వైభవంగా ప్రథమ వార్షికోత్సవం

- 92 అడుగుల అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు
- వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి
- భారీగా తరలి వచ్చిన భక్తులు



92 అడుగుల శ్రీ అభయాంజనేయ విగ్రహం

పర్చూరు, జూన్ 3 : పర్చూరులోని వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సంలో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కిక్కిరిసింది. నియోజకవర్గ కేంద్రంలో రూ.2కోట్ల నిధులతో దాతల సహకారంతో శ్రీ అభయాంజనేయస్వామివారి సుందర విగ్రహం రూపుదిద్దుకుంది. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విగ్రహ దాత చిమటా శ్రీనివాసరావు దంపతులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది.



ఏలూరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలూరి

శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ పూజల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరిని ఘనంగా సన్మానించారు.



కొండయ్యను సత్కరిస్తున్న పుర ప్రముఖులు

ఘనంగా ఆర్‌కే టౌన్‌షిప్ ఆవిర్భావ వేడుకలు

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యను సత్కరించిన ప్రముఖులు

చీరాల, జూన్ 3 : టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆర్‌కే టౌన్‌షిప్ 33వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌కే టౌన్‌షిప్, ఆర్‌కే గ్రూపు కళాశాలల నిర్వాహకులు, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య మాట్లాడుతూ తనకు వెన్నంటి ఉండి అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న బంధులు, మిత్రలు, శ్రేయోభిలాషులు, స్థానికంగా కూటమి శ్రేణులకు శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పురప్రముఖులు, కొండయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం.రాజా, అవ్వారు సాంబయ్య, పృధ్వీ వెంకటేశ్వర్లు, తేలప్రోలు నాగేశ్వరరావు, బోయిన శివరామకృష్ణ, సిద్ధి బుచ్చేశ్వరరావు, పొత్తూరు సుబ్బయ్య, పృధ్వీ లలితమోహన్, జి.రాంబాబు, బొగ్గుల పార్థసారధి గుర్రం తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకుతో ఊపిరితిత్తులకు ప్రమాదం



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి

చీరాలటౌన్, మే 3 : పొగాకు వాడకం వలన గుండె, ఊపిరితిత్తులకు ప్రమాదం అని, పక్షవాతం, నోటి కేన్సర్ తదితర వ్యాధులు వస్తాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుభాషిణి అన్నారు. సోమవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా చీరాల ఏరియా ఆసుపత్రిలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పొగాకు పరిశ్రమల జోక్యం నుం చి పిల్లలను రక్షించాలని, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక కార్యచరణ ప్రకటించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎవరు స్మోకింగ్ చేయకూడదని, అలా చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రతి విద్యాసంస్థను పొగాకు రహిత విద్యాసంస్థలగా ప్రకటించడం, గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని రూపుమాపే దిశగా పలు అ వగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిగిరెట్, పోగాకు ఉత్పత్తుల చట్టం-2003 కఠినంగా అమలు పర్చడం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ హరిబాబు, వైద్యాధికారులు శ్రీకాంత్, పృధ్వీ, రవిప్రకాష్, దినేష్, లక్ష్మీనారాయణ, కోటినాగిరెడ్డి, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి బీ రమేష్, నర్సింగ్ స్టాఫ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగం

- రోడ్డు మార్జిన్‌లే డంపింగ్ కేంద్రాలు
- కంపుతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



నాగులపాలెంలో ముళ్లచెట్లతో ఉన్న చెత్త సంపద కేంద్రం

పర్చూరు, జూన్ 3 : మెరుగైన పారిశుధ్య నిర్వహణతోపాటు చెత్త నుంచి సంపదను సృష్టించాలన్న సంకల్పంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో లక్షల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు (డంపింగ్‌యార్డ్) నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లోని చెత్త చెదారాలను ఆయా పంచాయతీల ద్వారా పారిశుధ్య కార్మికులు సేకరించి వాహనాల ద్వారా రోడ్డు మార్జిన్‌లో వదలి వేస్తూ మమ అనిపిస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్ల మార్జిన్‌లు డంపింగ్ యార్డ్‌లను తలపించే విధంగా తయారయ్యాయి. దీంతో ఆ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలిసన వాహనదారులు కంపుతో ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు రోడ్డు మార్జిన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తగులపెట్టేందుకు చర్యలు చేపట్టడంతో సమస్య తీవ్రంగా మారుతుంది. వ్యర్థాలను తగులపెట్టే క్రమంలో వెలువెడే పొగతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనాలకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పర్చూరు నుంచి చీరాల, పర్చూరు నుంచి ఇంకొల్లు, యద్దనపూడి వెళ్లే ప్రధాన రహదారుల్లో



పర్చూరు - యద్దనపూడి రహదారిలో వ్యర్థాలు

పరిస్థితి మరింత దయనీయంగా మారింది. లక్షలు వెచ్చింది నిర్మాణం చేసిన చెత్త సంపద కేంద్రాలు ముళ్ల చెట్లు, పొదలతో నిరుపయోగంగా మారాయి. కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకు వచ్చే డంపిగ్ కేంద్రాలు ఇలా ఆలనా పాలనకు నోచుకోక పోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన పర్చూరులో మాత్రం డంపింగ్ యార్డ్‌ను తాటాకుల షెడ్‌తో సరిపెట్టి మమా అనిపించారే తప్ప పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టలేదు. అడుసుమల్లి, నాగులపాలెం, నూతలపాడు, చెరుకూరు, రమణాయపాలెం తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను నిర్మాణం చేసారే తప్ప వినియోగంలోకి తీసుకు వచ్చిన దాఖలాలు లేవు. దీంతో ఏళ్ల తరబడి నిర్మాణం చేసిన డంపిగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయితీలకు ఆదాయం సమకూర్చడంతోపాటు, ప్రజలకు మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హుండీ కానుకల లెక్కింపు

సింగరాయకొండ, జూన్ 3 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. మూడు నెలలకు రూ.2,15,224 ఆదాయం సమకూరింది. అనంతరం ఈనెల 16వ తేదీ నుంచి 26 వరకూ జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో టెంకాయలు అమ్ముకోవడానికి వేలంపాటను నిర్వహించారు. రూ.1.55 లక్షలకు పేరం సుబ్బరామిరెడ్డి టెంకాయలు అమ్ముకునే హక్కును దక్కించుకున్నారు. కూల్‌డ్రింక్స్ ఐస్‌క్రీమ్ అమ్ముకోవడానికి నిర్వహించిన వేలం పాటలో ఎవరూ పాల్గొనకపోవడంతో నిలిపేశారు.

కౌంటింగ్ కేంద్రానికి పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

నెల్లూరు(హరనాథపురం) : పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కూడిన బాక్సులను ప్రియదర్శిని కళాశాల స్ట్రాంగ్ రూములకు చేర్చారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో భద్రపరచిన ఈ బాక్సులను సోమవారం తరలించారు. ఆర్వోలు, ఏఆర్వోల సమక్షంలో బందోబస్తు నడుమ ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్‌లో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కూడా డీఆర్వో లవన్న సమక్షంలో ప్రియదర్శిని కళాశాలకు చేర్చి భద్రపరిచారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం 4 జూన్ 2024



ఓటరు మెచ్చిన రాజెవరో!?

- నేడే ఓట్ల లెక్కింపు.. అభ్యర్థుల్లో ఎడతెగని ఉత్కంఠ
- మధ్యాహ్నం 2 గంటలకు తొలి ఫలితం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఖరీదైన ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎటు?
- ఎన్డీయే కూటమికి జై కొట్టారా!?
- ఫ్యాన్ గాలి ఎటువైపు వీచింది!?





లబ్ డబ్.. లబ్ డబ్...

గడియారం కన్నా గుండె వేగం ఎక్కువగా కొట్టుకుంటోంది.

కొన్ని గంటలు.. కాదు కాదు... కొన్ని నిమిషాలు.. సెకన్లు

అవును.. ఇరవై రోజుల నిరీక్షణకు ఇంకొన్ని గంటల్లో తెరపడనుంది. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉన్న ఈవీఎంలు తెరుచుకుని తీర్పు వెల్లడయ్యేందుకు ఇంకా కొన్ని నిమిషాలే ఉన్నాయి.

ఐదేళ్ల అంచనాలు.. 60 రోజుల హోరాహోరీ ప్రచారాలు.. గెలుపు కోసం వెదజల్లిన రూ.వేల కోట్ల ప్రభావం.. మీట నొక్కిన తరువాత ఓటు రూటు ఎటువైపో తెలుసుకోవడం కోసం మూడు వారాల నిరీక్షణ.. వీటన్నిటికీ సమధానం మంగళవారం దొరకనుంది. సాయంత్రం 3 గంటలకల్లా విజేతలెవరో.. పరాజితులెవరో తేలిపోనుంది. ఐదేళ్ల జగన్ పాలనకు జనం జై కొట్టారా!? ఇక చాలు పొమ్మంటూ తిరస్కరించారా!? బట్టబయలు కానుంది. ఎన్డీఏ కూటమికి అనుకూలంగా వచ్చిన మెజారిటీ ఎగ్జిట్‌పోల్స్‌లో నిజమెంత!?.. రాష్ట్రానికి టీడీపీ అధినేత చంద్రబాబు అవసరమని భావించిన ప్రజలెందరో లెక్క తేలిపోనుంది. తరతరాలుగా జిల్లా రాజకీయాలపై ఆదిపత్యం సాధిస్తూ వచ్చిన పలువురు పెద్దారెడ్ల భవిత్యం ఎలా ఉండబోతుందో నేటి ఫలితాలతో తేలిపోతుంది. 20 రోజుల పాటు అభ్యర్థుల గెలుపోటములపై ప్రజలను వెన్నాడిన ఉత్కంఠకు తెరపడనుంది. జిల్లావాసులు ఎవరికి జై కొట్టారో.. రానున్న ఐదేళ్ల కాలానికి ఎవరిని రాజును చేశారో!? ఎవరిని పరాజితులను చేసి ఇళ్లకు పంపారు నేటి ప్రజాతీర్పుతో తేటతెల్లం కానుంది.



ఓట్ల లెక్కింపు సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

నెల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ అనంతరం దొరికిన 20 రోజుల విరామంతో విశ్రాంతి జీవనంలోకి వెళ్లిన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఆఖరు టెన్షన్ మొదలయ్యింది. సోమవారం ప్రతి నాయకుడి ఇంటి వద్ద సందడి కనిపించింది. కౌంటింగ్ ఏజెంట్ల హడావుడితో ప్రధాన పార్టీల అభ్యర్థుల నివాసాల వద్ద పండుగ వాతావరణం నెలకొన్నా, పోటీదారుల్లో మాత్రం నరాలు తెగే ఉత్కంఠ కనిపించింది. ఎగ్జిట్‌పోల్స్ ప్రభావంతో కూటమి సభ్యుల్లో ఉత్సాహం కనిపించినా అసలు ఫలితాలపై మాత్రం టెన్షన్ కనిపించింది. పీత కష్టాలు పీతవి అన్నట్టుగా బెట్టింగ్ రాయుళ్లు ఇంకా ఎక్కువ టెన్షన్ పడిపోతున్నారు. కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో వీరి గుండె వేగం పెరుగు తోంది. తాము కాచిన పందెం ఏమవుతుందోననే టెన్షన్‌తో ఎత్తిన మొబైల్‌ను దించకుండా నిరవధికంగా ఎగ్జిట్ పోల్స్‌ను చూస్తూ తమలో తామే మాట్లాడుకొంటూ టెన్షన్‌గా కనిపిస్తున్నారు.

● విధుల్లో 3,600 మంది

ఓట్ల లెక్కింపు సిబ్బంది ఉదయం 5 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రమైన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకుంటారు. నియోజకవర్గాల వారీగా ఈవీఎం యంత్రాలను వారికి కేటాయించిన కౌంటింగ్ గదుల్లో కి చేరుస్తారు. ఏజెంట్ల సమక్షంలో సరిగ్గా ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియలో ప్రత్యక్షంగా 1,100 మంది, పరోక్షంగా మరో 2,500 మంది సిబ్బంది విధుల్లో ఉంటారు.

అందరి దృష్టి జిల్లాపైనే!

నెల్లూరు రాజకీయాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. రాష్ట్ర రాజకీయాలను శాసించిన రాజకీయ కుటుంబాలు జిల్లాలో చాలానే ఉన్నాయి. ఆ క్రమంలోనే ఈ జిల్లా రాజకీయాల పట్ల రాష్ట్రస్థాయిలో ఆసక్తి కనబడు తోంది. ఈ ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీల నుంచి పెద్ద రాజకీయ కుటుంబాలు, బడా పారిశ్రామికవేత్తలు పోటీ పడటంతో ఫలితాల పట్ల మరింత ఆసక్తి పెరిగింది. ఆనం, మేకపాటి, సోమిరెడ్డి, నేదురుమల్లి, నల్లపరెడ్డి, ఆదాల, కోటంరెడ్డి కుటుంబాలు ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. అలాగే బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలు పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దం పతులు, వైసీపీలో నెంబర్ టుగా చక్రం తిప్పిన విజయ సాయిరెడ్డి, రాజకీయ చిత్రపటంలోకి కొత్తగా దూసుకొచ్చిన బడా కాంట్రాక్టర్లు, ఎన్ఆర్ఐలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వర రావులు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలే ఈ నేతల భవిష్యత్తును నిర్ణయించనుండటంతో జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా నెల్లూరు జిల్లా ఫలితాలపై ఆసక్తి కనబడుతోంది.

● తొలుత పోస్టల్ బ్యాలెట్

కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. నెల్లూరు పార్లమెంట్ సెగ్మెంట్‌కు 23,976 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 25,846 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో సర్వీస్ ఓట్లు 24,223 కాగా, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధుల ఓట్లు, 870, పీడబ్ల్యూడీ ఓట్లు 753 పోల్ అయ్యాయి. నియోజకవర్గాల వారీగా గమనిస్తే నెల్లూరు రూరల్‌లో అత్యధికంగా 5405 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా సర్వేపల్లిలో అత్యల్పంగా 1878 ఓట్లు పోల్ అయ్యాయి. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇందుకోసం ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశారు. 20 నిమిషాల్లో ఈ ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఆ తరువాత ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలు పెడతారు.

● మధ్యాహ్నం 2 గంటలకల్లా తొలి ఫలితం

ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. జిల్లా పరిధిలో ఈవీఎంల ద్వారా మొత్తం 15,48,183 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో అత్యధికంగా 79.63 శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గాల్లో కందుకూరు నియోజకవర్గంలో అత్యధికంగా 88.96 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కావలి, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో 83 పైచిలుకు శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నెల్లూరు రూరల్ నుంచి అత్యల్పంగా 67.76 శాతం మంది ఓటు హక్కు వినిగించుకున్నారు. నెల్లూరు సిటీ 71.72, కోవూరు 79.29, ఉదయగిరి 81.92 శాతం ఓటింగ్ జరిగింది. ప్రతి 20 నిమిషాలకు ఒక రౌండ్ పూర్తి చేస్తారు. ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల్లో అత్యధికంగా 24 రౌండ్ల లెక్కింపు జరిగితే నెల్లూరు సిటీలో అత్యల్పంగా 18 రౌండ్లకే తుది ఫలితాలు వెల్లడి అవుతాయి. అభ్యంతరాలు, వివాదాలు లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో తొలి ఫలితం నెల్లూరు సిటీదే కానుంది. ఉదయగిరి, కోవూరు ఫలితాలు కాస్త ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు వెలువడే అవకాశం ఉంది. నెల్లూరు పార్లమెంట్ తుది ఫలితాలు వెలువడే సరికి సాయంత్రం 6 గంటల సమయం పడుతుంది. ఈ ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. నాలుగు రౌండ్లలో పూర్తి చేస్తారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 2వేల మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	అభ్యర్థులు	రౌండ్లు	తొలి ఫలితం వెలువడేది?
నెల్లూరు సిటీ	2,39,497	1,71,763	3,071	15	18	మధ్యాహ్నం 2 గం..
నెల్లూరు రూరల్	2,80,888	1,90,324	5,405	11	21	మధ్యాహ్నం 3 గం..
కోవూరు	2,67,403	2,11,976	3,210	13	24	సాయంత్రం 4 గం..
కావలి	2,38,553	1,98,066	3,635	13	23	సాయంత్రం 4 గం..
కందుకూరు	2,28,979	2,03,637	2,689	22	20	మధ్యాహ్నం 3 గం..
ఆత్మకూరు	2,15,401	1,79,829	3,131	13	20	మధ్యాహ్నం 3 గం..
ఉదయగిరి	2,41,861	1,97,970	2,827	15	21	సాయంత్రం 4 గం..
సర్వేపల్లి	2,32,011	1,94,618	1,878	13	21	మధ్యాహ్నం 3 గం..

ఏర్పాట్లు ఎలా ఉన్నాయ్!



కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్, ఎస్పీ ఆరా



పోస్టల్ బ్యాలెట్ ఓట్లున్న పెట్టెలను తరలిస్తూ..



ఓట్ల లెక్కింపు సిబ్బంది కోసం కమ్మనైన వంటలు తయారు చేస్తున్న సిబ్బంది



బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు

మూడంచెల భద్రత

- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 యాక్ట్ అమలు
- రాజకీయ పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్ల వద్ద భద్రత

బందోబస్తు విధుల్లో 2వేల మందికిపైగా పోలీసులు

నెల్లూరు (క్రైం) : ఓట్ల లెక్కిపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆధ్వర్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద సుమారు 2వేల మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. బందోబస్తుపై సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయడంతో పాటు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్‌ను అమలు చేశారు. అభ్యర్థుల ఇళ్లు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రత ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరిస్తున్నారు. డ్రైడేను 5వ తేదీ ఉదయం వరకు నిక్కచ్చిగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా రెండు రోజుల పాటు నాకా బందీతోపాటు లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, గైర్హాజరు అయినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● నిఘా నీడలో...

ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో సీసీ కెమెరాలతో పాటు వీడియో గ్రాఫర్‌ను నియమించి ప్రతి అంశం రికార్డు అయ్యేలా చర్యలు చేపట్టారు. ప్రధాన గేట్లు వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు ఇలా ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే లోనికి అనుమతిస్తారు. కేంద్రబలగాలు, ఏపీఎస్పీతోపాటు స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా 300లకుపైగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఉంచారు. జిల్లా ప్రధాన కేంద్రంలోని కూడళ్లలో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ను ఇప్పటికే బైండోవర్లు చేయగా, భద్రత దృష్ట్యా సోమవారం పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు

కౌంటింగ్ సందర్భంగా మంగళవారం నెల్లూరు నగరం, రూరల్ పరిధిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

- గొలగమూడి దేవాలయానికి వెళ్లే భక్తులు కాకుటూరు జాతీయ రహదారి మీదుగా వెళ్లాలి.
- గూడురు నుంచి నెల్లూరు నగరంలోకి వచ్చే ప్రయాణికులు అయ్యప్పగుడి మీదుగా వెళ్ళాలి.
- కావలి వైపు నుంచి వస్తూ నెల్లూరు నగరంలోకి వెళ్లే ప్రయాణికులు చింతారెడ్డిపాలెం జంక్షన్ చిల్డ్రన్స్ పార్కు మీదుగా వెళ్లాలి.
- హైవేపై దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు, లారీలకు ఎలాంటి ఆంక్షలు లేవు.
- మినీబైపాస్ నుంచి కొండాయపాలెం మీదుగా నేషనల్ హైవేపైకి అనుమతి లేదు.
- కౌంటింగ్‌కు వచ్చే నాయకులు, ఏజెంట్ల వాహనాలకు కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్‌లో, ద్విచక్ర వాహనాలకు స్కూలు పడమర వైపు ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.



పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ

ఏజెంట్లకు సూచనలు

- కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే ఏజెంట్లు అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలి.
- మొబైల్స్, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు, పెన్, పేపర్ వంటి వాటిని అనుమతించరు.
- ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రం లోపలికి వెళ్లిన తర్వాత కౌంటింగ్ పూర్తయ్యేవరకు బయటకు రాకూడదు.
- అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగానే మందులు వెంట తెచ్చుకోవాలి.
- ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, డీజే సౌండ్స్, బాణాసంచా కాల్చడానికి అనుమతి లేదు.

రౌండ్ల వారీ ఫలితాలు ఆలస్యం లేకుండా ప్రకటించాలి

కౌంటింగ్ అబ్జర్వర్ నితిన్ సింగ్ బదారియా

నెల్లూరు (హరనాథపురం), జూన్ 3 : ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి రౌండ్లవారీ ఫలితాలను ఆలస్యం లేకుండా ప్రకటించాలని కౌంటింగ్ పరిశీలకుడు నితిన్ సింగ్ బదారియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బదారియా మాట్లాడుతూ ఎటువంటి కారణాలు లేకుండా ఓట్ల లెక్కింపు ఆలస్యం కాకుడదని స్పష్టం చేశారు. మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు రౌండ్ల వారీగా ఫలితాలు ప్రకటించేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు ఏజెంట్లకు ఓట్ల లెక్కింపు పద్ధతిపై క్లుప్తంగా అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ పేపర్ల స్క్రూటినీలో ఈసీఐ నిబంధనలు పాటించాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు సిటీ, కోవూరు, ఉదయగిరి, రిటర్నింగ్ అధికారులు వికాస్ మర్మత్, సేధుమాధవన్, ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నితిన్ సింగ్ బదారియా, పక్కన కలెక్టర్

మద్యం దుకాణాల మూత

నెల్లూరు(క్రైం) : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలు, బార్లు మూసివేశారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత 5వ తేదీ బుధవారం ఉదయం మద్యం దుకాణాలు తెరవనున్నారు.

ఆ ఇద్దరెవరో..!

- అత్మకూరు, ఉదయగిరి అభ్యర్థుల విజయంపై ఎడతెగని ఉత్కంఠ
- నేడు తేలనున్న నేతల భవితవ్యం !


ఆనం రామ నారాయణరెడ్డి (టీడీపీ)


మేకపాటి విక్రమ్‌రెడ్డి (వైసీపీ)


కాకర్ల సురేష్ (టీడీపీ)


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి (వైసీపీ)

ఆత్మకూరు, జూన్ 3: ఈ మారు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు అసెంబ్లీ బరిలో 13మంది పోటీ ఉన్నారు. వీరిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు 10మంది కాగా, మిగిలిన వారు స్వతంత్రులుగా ఉన్నారు. అయితే పోటీ మాత్రం టీడీపీ, వైసీపీ మధ్యే నువ్వా... నేనా అన్నట్లుగా ఉంది. మరి కొన్ని గంటల్లో నేతల భవితవ్యం తేలనుంది.

గెలుపు ధీమాలో ఎవరికి వారు..

ఆత్మకూరు అసెంబ్లీ బరిలో నిలిచిన టీడీపీ, వైసీపీ అభ్యర్థులిద్దరూ గెలుపు తమదంటే తమదేనని ధీమాగా ఉన్నారు. అనూహ్యంగా టీడీపీ టిక్కెట్ దక్కించుకుని ఎన్నికల బరిలో దిగిన ఆనం రామనారాయణరెడ్డి తప్పకుండా గెలుపొంది అసెంబ్లీలో తిరిగి అడుగు పెట్టడం ఖాయమనే ధీమాలో ఉన్నారు. గత ఉప ఎన్నికల్లో ఆత్మకూరు నియోజవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి ఈసారి విజయలక్ష్మీ తననే వరిస్తుందన్న ధీమాతో ఉన్నారు. అయితే ఇరుపార్టీల నేతలు, కార్యకర్తలు మాత్రం ఉత్కంఠను భరించలేకున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు పందెం రాయుళ్లు మాత్రం బెట్టింగు జోరు కొనసాగిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గం మొత్తం మీద 83.49శాతం పోలింగ్ జరిగింది. కొన్నిగ్రామాల్లో 90శాతం పైబడి పోలింగ్ జరిగింది. 2,15,401 మంది ఓటర్లుకుగాను 1,79,829 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,05,815 మంది పురుషుల్లో 88,854మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేక్రమంలో 1,09,578 మంది మహిళల్లో 90,974మంది ఓటుహక్కును వినియోగించుకు న్నారు. చేజర్ల మండలంలో అత్యధికంగా 88.47శాతం పోలింగ్ నమోదు కాగా ఆత్మకూరు మండలంలో అతి తక్కువగా 80.96శాతం పోలింగ్ నమోదైంది. మర్రిపాడు మండలంలో 81.78శాతం పోలింగ్ నమోదు కాగా సంగం మండలంలో 84.33శాతం, ఏఎస్‌పేట మండలంలో 84.56శాతం, అనంతసాగరం మండలంలో 83.35శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఆత్మకూరు మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో 80శాతం పైబడి పోలింగ్ నమోదు కావడం నియోజకవర్గ చరిత్రలో రికార్డు సృష్టించినట్లయ్యింది. ఈ ఎన్నికల్లో ఆత్మకూరులో 3,131మంది బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ ఆధిపత్య గ్రామాల్లో భారీ ఎత్తున పోలింగ్ జరిగింది. తమకు అనుకూలంగా ఓటింగ్ చేసుకోవడంలో ఇరువర్గాల నాయకులు విజయవంతం అయ్యారు. ఆధిపత్య గ్రామాల్లో జరిగిన భారీ పోలింగ్ ఫలితాలను తారుమారు చేస్తుందన్న అనుమానం లేకపోలేదు. ఏదీ ఏమైనా ఆత్మకూరు విజేత ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది.

ఉదయగిరి: నియోజకవర్గం నుంచి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మరియు స్వతంత్ర్య అభ్యర్థులు 15మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధానంగా వైసీపీ, ఉమ్మడి టీడీపీల నడుమ పోటీ ఉన్నది. వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ల మధ్య పోటీ హోరాహోరీగా కొనసాగింది. వీరు ఇరువురు ఎన్నికల్లో తొలిసారి పోటీ చేయడంతో అభ్యర్థుల్లో ఉత్కంతత నెలకొంది. నియోజకవర్గ ఫలితాలపై ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. రెండుసామాజిక వర్గాల మధ్య జరిగిన ఎన్నికల్లో ఆయా సామాజిక వర్గాల ఓటర్లు పోటాపోటీగా ప్రచారం నిర్వహించడమే కాక ఓటింగ్ సరళి పెంచేందుకు కృషి చేశారు. నియోజకవర్గ కౌంటింగ్ సాయంత్రం నాలుగు గంటలకు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కౌంటింగ్‌కు అధికారులు 14టేబుళ్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1,97,970 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ తుది ఫలితాలు సాయంత్రం ఆరు గంటలకు వెలువడే అవకాశముంది. ఏదిఏమైనా మరికొన్ని గంటల్లో వెలుబడే అభ్యర్థుల ఫలితాల కోసం నియోజకవర్గ ఓటర్లు ఎదురుచూస్తున్నారు.

ఆత్మకూరులో ఉరుములు, మెరుపులతో వర్షం

ఆత్మకూరు, జూన్ 3: మెట్టప్రాంతమైన ఆత్మకూరులో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. రోజంతా మేఘావృతమై మబ్బులు కమ్మి ఉండడంతో నిప్పులు చెలరేగిన సూరీడు ఒక్కసారిగా శాంతించాడు. ఎండ తీవ్రత నుంచి ఉపసమనం లభించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మరో రెండురోజుల పాటు సాధారణం కంటే అధిక వర్షాలు కుస్తాయని ఐఎండీ సూచనల నేపథ్యంలో వ్యవసాయం జోరుగా సాగుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయగిరిలో 85.6 మి.మీ వర్షం

ఉదయగిరి, జూన్ 3: ఉదయగిరి ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున 4నుంచి 5.30గంటల వరకు 85.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపుల దాటికి గ్రామాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అనేకచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 9గంటలకు విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు. మండలంలోని నేలటూరు, గడ్డంవారిపల్లి, వెంకట్రావుపల్లి చెరువుల్లో కొద్దిపాటి వర్షపు నీరు చేరింది.

సంగంలో స్వల్పంగా..

సంగం: మండలంలో మంగళవారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోజంతా వాతావరణం చల్లగా ఉంది. గత పదిహేను రోజులుగా వడగాలులకు, ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు వాతావరణం చల్లబడడంతో హాయిగా స్వేదతీరారు. నైరుతీ రుతుపవనాల రాకతో వాతావరణం మారడంతో ఎండల నుంచి ప్రజలు ఉపసమనం పొందారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

సంగం, జూన్ 3: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం మంగళవారం కొనసాగింది. అందులో భాగంగా లైబ్రియన్ రవీంద్రనాథ్‌రెడ్డి పిల్లలకు చందమామ కథలను చదివించడం, భావాలను వివరించారు. అదేవిధంగా చంద్రగ్రహణం, సూర్యగ్రహణం ఎలా ఏర్పడతాయో పిల్లలకు వివరించారు. బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి అందులోని పలు అంశాలతో పాటు ప్రజాప్రతినిధుల చట్టసభల గురించి వివరించారు.

కాకర్ల విజయం తథ్యం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 3: నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి కాకర్ల విజయం తథ్యమని పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెట్టప్రాంత అభివృద్ధికి గత రెండేళ్లుగా తన ట్రస్టు ద్వారా విశేష సేవలందిస్తూ ప్రజల మనుసుల్లో చెరగనిముద్ర వేసుకొన్నట్లు చెప్పారు. సేవలను గుర్తించి నియోజకవర్గ ప్రజలు ఆయన రుణాన్ని ఓటు ద్వారా తీర్చుకోనున్నారని తెలిపారు. కరువు కోరల్లో చిక్కిన మెట్ట ప్రాంతానికి కాకర్ల విజయంతో వెలుగు వస్తుందన్నారు.

అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు

ఉదయగిరి, జూన్ 3: మెట్టప్రాంతంలో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షానికి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో వ్యవసాయ భూముల్లో పదునెక్కే విధంగా వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ పంటలను వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. భూములను దుక్కులు దున్నేందుకు అన్నదాతలు కాడిమేడి సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.

చెత్త సంపద కేంద్రాల నిరుపయోగం

మర్రిపాడు, జూన్ 3: మండలకేంద్రంతో పాటు డీసీ పల్లి, చిన్నమాచునూరు, కృష్ణాపురం మేజర్ పంచాయతీలతో పాటు మరో 20పంచాయతీలున్నాయి. వీటిలో పూర్తి స్థాయిలో చెత్తను కేంద్రాలకు తరలిస్తున్న పరిస్థితి లేదు. పారిశుధ్య పనులు చేసేందుకు అవసరమైన కార్మికులను నియమించినా వారికి జీతాలు చెల్లించక పోవటంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకపోయింది. చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన వాహనాలు మూలకుచేరాయి. గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరించేందుకు హరిత రాయబారులను ఏర్పాటు చేశారు. వారికి సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో విధులు సక్ర మంగా నిర్వర్తించడం లేదు. ఈ సమస్యతో గ్రామాల్లోని ఏ కాలనీల్లో చూసినా చెత్త పేరుకపోయి పారిశుధ్యం కొరవడింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఘనవ్యర్థాల కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.


చిన్నమాచునూరులోని చెత్త సంపద కేంద్రం

సర్కిల్‌లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు

ఉదయగిరి రూరల్, జూన్ 3: కౌంటింగ్ సందర్భంగా ఉదయగిరి సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీఐ వేల్పుల గిరిబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన కౌంటింగ్ విషయంపై విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు గుమికూడి ఉండరాదన్నారు. 30పోలీస్ యాక్ట్, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సంబరాలు, ర్యాలీలు నిషేధమన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని టీడీపీ, వైసీపీ కార్యాలయాలతో పాటు ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు


సీతారామపురం: దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ అనూష

సీతారామపురం, జూన్ 3: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ అనూష కోరారు. సోమవారం సీతారామపురంలోని దుకాణదారులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం అయ్యారు. నాలుగో తేదీ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలక్షన్ కమిషన్ వారి ఆదేశాలతో మండలంలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30అమ ల్లో ఉంటుందన్నారు. అనంతరం ఎస్ఐ అనూష విలేకరులతో మాట్లాడారు. ఎక్కడైనా గుంపులుగా ప్రజలు ఉండకూడదని, ఎలాంటి ర్యాలీలు, బాణాసంచా, ఊరేగింపులు చేసుకోవడానికి అనుమతి లేదన్నారు. అత్యవసర సేవలు, దుకాణాలు మాత్రమే అందు బా టులో ఉంటాయని మండల ప్రజలు పోలీసు వారికి సహకరించాలన్నారు. అంతేకాకుండా సీతారామపురం బస్టాం డ్ సెంటర్, సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఉంటుందని, మండలంలో రెండు మొబైల్ పార్టీలు విధులు నిర్వర్తిస్తుంటాయని తెలిపారు.

వైభవంగా కోదండరాముడి కల్యాణం


కల్యాణం తిలకిస్తున్న భక్తులు


భక్తులకు మంగళసూత్రం చూపుతున్న పూజారి

సంగం, జూన్ 3: రామచంద్రపురంలో వెలసిన కోదండరామస్వామి కల్యాణంను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా సమేత కోదండరామస్వామి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదిక మీదకు చేర్చి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల నడుమ వేడుక జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, జూన్ 3: మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల ఏడు కుటుంబాలకు చెందిన వారు మృతి చెందారు. సోమవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఏడు కుటుంబాల సభ్యులకు పరామర్శించారు. ఒక్కొరికి రూ.10వేలు చొప్పున రూ.70వేలను అందజేశారు. మృతులు 8వ వార్డులో గుండ్లూరు సుబ్బా రావు, 5వ వార్డు ఉప్పుటూరు సుబ్రహ్మణ్యం, 8వ వార్డు గాలి కమలమ్మ, 1వ వార్డు కోలా అంకమ్మ, నల్లగట్ల పెంచలయ్య, 18వ వార్డు షేక్ మునీర్గా, షేక్ పర్వీన్‌లు ఉన్నారు. కష్ట కాలంలో తమకు ఆర్థిక సాయం అందజేసిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ


ఉదయగిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి, జూన్ 3: గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సోమవారం పట్టణంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాత్రివేళ దోమలబారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాతవాటర్‌బాటిళ్ల, టెంకాయచిప్పలను ఇళ్ల పరిసాలకు దూరంగా పారవేయాలన్నారు. కార్యక్ర మంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పోస్టుమన్‌కు ఉత్తమ అవార్డు

అనంతసాగరం, జూన్ 3: స్థానిక తపాలా కార్యాలయ పోసుమెన్ షేక్ ఖాజావలి ఉత్తమ ఆంధ్ర పోస్ట్‌మ్యాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన చేస్తున్న సేవలకు గుర్తించి అవార్డు అందుకోవడం ఇది మూడోసారి. ఆయన్ను అసిస్టెంట్ పోస్టల్ సూపరిండెంట్ మహ్మద్ హుసేన్, సహ ఉద్యోగులు, ప్రజాసంఘాల నేతలు, స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కౌంటింగ్‌పై కావలి నేతల్లో ఉత్కంఠ

- టీడీపీ, వైసీపీ మధ్యే ప్రధాన పోటీ
- ఇండిపెండెంట్ పసుపులేటి సుధాకర్‌తో ఎవరికి నష్టం ?
- పట్టణంలో భారీగా బెట్టింగ్‌లు
- ఎంపీ అభ్యర్థి క్రాస్ ఓటింగ్‌పై భయం..భయం !

కావలి, జూన్ 3: కావలి నియోజకవర్గంలో మొత్తం 2,38,553 ఓట్లకు గాను మే 13న జరిగిన పోలింగ్‌లో 1,98,066 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మంగళవారం నెల్లూరులో కౌంటింగ్ జరగనుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులలో ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ జరగగా, ఇంటిపెండెంట్ అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ కూడా గట్టి పోటీ ఇచ్చారు. అయితే గెలుపు ఓటములు టీడీపీ, వైసీపీ మధ్యే ఉండగా ఇండిపెండెంట్ అభ్యర్థి వలన ఎవరికి నష్టం జరుగుతుందా ? అని ప్రధాన పార్టీలలో ఉత్కంఠ నెలకొంది. 2019 ఎన్నికలలో కావలిలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ఈసారి కూడా క్రాస్ ఓటింగ్ ప్రభావం ఎవరిని ముంచుతుందోననే అనుమానాలు ఉన్నాయి. వైసీపీలోని కొందరు ప్రధాన నేతలు ఎంపీ అభ్యర్థి కోసం పనిచేసినట్లు, ఎమ్మెల్యే అభ్యర్థి కోసం పనిచేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కావలిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి నష్టం జరుగుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తొలుత టీడీపీ కన్నా ముందంజలో ఉన్న వైసీపీ పోలింగ్ నాటికి కొంత వెనుకపడిందనే ప్రచారం నెలకొంది. దీంతో టీడీపీ అభ్యర్థి విజయంపై ఆ పార్టీ నేతలలో బలమైన నమ్మకం ఏర్పడింది. గతంలో గెలుపు పందేలలో ముందుంటున్న వైసీపీ ఈసారి వెనుక పడటంతో ఒకటికి రెండు రెట్లు టీడీపీ ఇచ్చే విధంగా పందేలు జరిగాయి. దానికి కూడా ఆశించిన స్థాయిలో పందేలకు రాకపోవటంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి 10వేల మెజార్టీ ఓట్లు పైన వస్తాయని టీడీపీ నేతలు పందెం కట్టగా, అన్ని రావని వైసీపీ నేతలు పందేలు కట్టారు. అంటే దీనిని బట్టి టీడీపీ ముందంజలో ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఏదిఏమైనా టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా - నేనా అన్నట్లుగా పోటీ ఉండటంతో కౌంటింగ్ ఫలితాల కోసం ఆయా పార్టీల నేతలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కాగా, కావలి నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 23 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతున్నందున లెక్కింపు పూర్తయ్యేసరికి సాయంత్రం 7 గంటలు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

మధ్యాహ్ననికల్లా కందుకూరు ఫలితం

ప్రజలు, అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్

కందుకూరు, జూన్ 3: ఓట్ల లెక్కింపు గడియలు వచ్చేయటంతో అటు అభ్యర్థులు.. ఇటు ప్రజల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కందుకూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగే నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 6గంటలకే పోలింగ్ ఏజెంట్లు ఉండాలన్న అధికారుల సూచించారు. ఆ మేరకు నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు సోమవారం సాయంత్రమే ఇక్కడి నుంచి బయలుదేరి నెల్లూరు చేరుకున్నారు. ఉదయాన్నే కందుకూరు నుంచి బయలుదేరి సకాలంలో వెళ్లటం సాధ్యంకాదన్న ఆలోచనతో రాత్రికే చేరుకుని అక్కడే బసచేసేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ఏజెంట్లుకి ఏర్పాట్లు పూర్తిచేశారు. 21మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా.. ప్రధాన పోటీ తెలుగుదేశం అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ల మధ్యే ఉంటుందని మిగిలిన వారంతా నామమాత్రపు పోటీదారులేనన్న విషయం సుస్పష్టం. ఇండిపెండెంట్లలో కొందరు ప్రధాన పార్టీల అభ్యర్థుల సూచన మేరకు నామినేషన్లు వేసిన వారే కావటంతో వారి తరపున ఏజెంట్లుగా వెళ్లే వారు కూడా అనధికారికంగా ప్రధాన అభ్యర్థుల కోసమే కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించనున్నారు. దీంతో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఒక్కో టేబుల్ వద్ద తమ ఏజెంట్లు ఐదుగురు ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం.

కందుకూరు నియోజకవర్గంలో 2,28,979 ఓట్లు ఉండగా వాటిలో 2,03,637 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలోని 271 పోలింగ్ కేంద్రాలలో ఈ ఓట్లు పోలవగా ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అంటే ప్రతిరౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాల లెక్కింపు పూర్తవుతున్నందున మొత్తం 20రౌండ్లలో కందుకూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరగనుంది. రౌండ్‌కు 15 నిమిషాలు సమయం అనుకున్నా 5గంటల్లో కందుకూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. ఉదయం 8గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నందున మధ్యాహ్నం ఒంటి గంటకే తుది ఫలితం తేలే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, హోమ్ ఓటింగ్, ఇతర జిల్లాల ఓట్లు, సర్వీస్ ఓట్లు కలిపి 2705 ఓట్లు పోలై ఉండగా వాటి లెక్కింపుకు ప్రత్యేకంగా ఒక టేబుల్ ఏర్పాటు చేశారు. దీంతో ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి ఈఓట్లు లెక్కింపు కూడా పూర్తవుతుంది. అందువల్ల మధ్యాహ్నం ఒంటిగంటకల్లా తుదిఫలితం వస్తుందని ఉదయం 11గంటలకల్లా ఎవరికి విజయావకాశాలు ఉన్నాయనే విషయంలో స్పష్టమైన అంచనాకు రావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఇంటూరి విజయం కోసం పూజలు

వలేటివారిపాలెం, జూన్ 3 : బడేవారిపాలెం శివాలయంలో టీడీపీ కార్యకర్తలు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు గెలవాలని సోమవారం 101కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అలాగే మహా కూటమి ఘన విజయం సాధించి, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నారు.

నెల్లూరుకు తరలిన నేతలు, ఏజెంట్లు


కౌంటింగ్ కోసం నెల్లూరు తరలివెళుతున్న టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి, కౌంటింగ్ ఏజెంట్లు

కావలి, జూన్ 3: నెల్లూరులో మంగళవారం జరగనున్న కౌంటింగ్‌కు కావలి నుంచి టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు, కౌంటింగ్ ఏజెంట్లు సోమవారం సాయంత్రం నెల్లూరుకు తరలివెళ్లారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వారి కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు తెలిపి అత్యవసరమైతే తప్ప వివాదాల జోలికి వెళ్లివద్దని సూచించారు. కొందరు స్వతంత్ర అభ్యర్థుల తరపున కూడా ప్రధాన పార్టీలు వారి నేతలను కౌంటింగ్ ఏజెంట్లుగా నియమింపచేశారు. రాత్రికి అక్కడ బస ఏర్పాటుచేసి మంగళవారం తెల్లవారుజాము నుంచే వారు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నారు.

ఎగ్జిట్ పోల్స్ తర్వాత పందేల జోరు

లింగసముద్రం, జూన్ 3: ఎగ్జిట్ పోల్స్ అనంతరం కూడా మండలంలో కూటమి, వైసీపీ పార్టీల గెలుపోటములపై పందేలు జోరుగా కాస్తున్నారు. కొన్ని సర్వే సంస్థలు కూటమి గెలుస్తుందని, మరికొన్ని సర్వే సంస్థలు వైసీపీ గెలుస్తుందని తమ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. అయితే నేషనల్ మీడియా ఎక్కువగా కూటమి గెలుస్తుందని చెప్పాయి. అయినా మండలంలోని కొందరు వైసీపీ గెలుస్తుందని, ఇందుకు ఒకటికి రెండు వంతున నగదు ఇవ్వాలని కోరగా, అయితే టీడీపీనే గెలుస్తుందని అందుకు అంగీకరించి పందేలు కాస్తున్నారు. ఈ పందేలు సోమవారం కూడా లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో జరిగినట్టుగా తెలిసింది. ఇప్పటికే మండలంలో సుమారు రూ.3 కోట్లకు పైగానే పందేలు కాసినట్టుగా సమాచారం.

చిరువ్యాపారికి చేయూత

కావలి టౌన్, జూన్ 3: పట్టణంలోని వెంగళరావునగర్ 23వ వార్డులో నివసిస్తున్న చిరు వ్యాపారి బాదుల్లా అనారోగ్యంతో బాధపడుతుండగా హ్యాపీ సేవాసంస్థ సభ్యులు సోమవారం పరామర్శించారు. సంస్థ ద్వారా విషయం తెలుసుకున్న ఖాసిం స్నేహితులు ముందుకొచ్చి వైద్య ఖర్చుల కోసం రూ. 30వేల నగదు, పండ్ల వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండిని అందించారు.

నాదెండ్ల మనోహర్‌కు శుభాకాంక్షలు


నాదెండ్లకు పుష్పగుచ్చం అందచేస్తున్న అళహరి

కావలిటౌన్, జూన్ 3: జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ సోమవారం తెనాలిలోని జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందించి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ తెనాలి ఎమ్మెల్యేగా నాదెండ్ల గెలుపు ఖాయమని, పవన్‌కల్యాణ్ ఆశీ ర్వాదంతో ఎన్డీయే ప్రభుత్వంలో కీలక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు.

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి ప్రతిభ

కందుకూరు, జూన్ 3: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ 2024 పరీక్షలో కందుకూరు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి ఏ.శ్యామ్ సిద్విలాస్ 142 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కరరావు, బెజవాడ నరేంద్రబాబులతో కలిసి శ్యామ్ సిద్విలాస్‌ను కళాశాలలో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.


శ్యామ్ సిద్విలాస్‌ను అభినందిస్తున్న బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు

ప్రయాణికులకు నిలువ నీడేది?

- కానరాని బస్‌షెల్టర్
- మండుటెండలో ప్రజలకు తప్పని అవస్థలు
- చెట్ల నీడన, దుకాణాల వద్ద నిరీక్షణ
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు


రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

వలేటివారిపాలెం, జూన్ 3: స్థానిక బస్టాండు సెంటరులో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ బస్సుల కోసం చెట్ల కింద, దుకాణాల వద్ద నిరీక్షిస్తున్నారు. వలేటివారిపాలెంలో బస్‌స్టేషన్ ఉన్నా నిరుపయోగంగా ఉంది. మండలంలోని వివిధ గ్రామాల నుండి మండల కేంద్రానికి వచ్చి వెళ్లేవారు దుకాణాల వద్ద హోటళ్ల వద్ద బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. ప్రయాణికులు దుకాణాల వద్ద నిలబడితే తమ వ్యాపాలకు ఆటంకం కలుగుతుందని దుకాణదారులు అక్కడి నుంచి పంపుతున్నారు. ఎండాకాలం ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుండి మండల కేంద్రానికి వివిధ పనులపై వస్తుంటారు. వీరికి మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో వారి బాధలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా మహిళలు మలమూత్ర విసర్జనకు ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుంటారు. ఎప్పుడు పడితే అప్పుడు చార్జీలు పెంచి ప్రయాణికుల నుండి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ సౌకర్యాల కల్పనలో మాత్రం దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు తావిస్తోంది. మారుమూల గ్రామాల ప్రయాణికులు అవస్థలు పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ప్రయాణికుల సౌకర్యార్థమే ఆర్టీసీ ప్రధాన ధ్యేయం అని అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించి మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా : సీఐ

కలిగిరి, జూన్ 3: కలిగిరి సర్కిల్ పరిధిలోని జలదంకి, కలిగిరి, కొండాపురం, వింజమూరు మండలాల్లోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. సోమవారం సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో సోమవారం నుంచి మంగళవారం రాత్రి వరకు లాడ్జిలు, రెస్టారెంట్లు, హోటల్స్ మూసివేయాలన్నారు. జూన్ 6 వరకు బాణాసంచ కాల్చడం, బహిరంగ సభలు, ర్యాలీలు, విజయోత్సవ సంబరాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేస్తామన్నారు.

సంబరాలు, ర్యాలీలకు అనుమతి లేదు : ఎస్సై


భీమవరప్పాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై మహేంద్ర

కొండాపురం : మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని ఎస్సై మహేంద్ర సోమవారం తెలిపారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బాణాసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధిం చినట్లు చెప్పారు. సునిశిత ప్రాంతాలైన కొమ్మి, సాయిపేట, తూర్పుఎర్రబల్లి, గొట్టిగుండాల, సత్యవోలు తదితర పంచాయతీలలో ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాయపేటలో తాగునీటి ఎద్దడి : గ్రామస్థుల అవస్థలు


రాయపేటలో వాటర్ ట్యాంక్

అల్లూరు, జూన్ 3 : నగర పంచాయతీ పరిధిలోని రాయపేట గ్రామంలో తాగునీటి ఎద్దడితో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు గ్రామంలో పర్యటించినపుడు తమ ప్రభుత్వం వస్తే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తామని హామీలు ఇవ్వడమే తప్ప అమలుపరచిన దాఖలాలు లేవని, తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి నూతన ప్రజాప్రతినిధులైనా తమ గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించకపోతారా అని గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు.